thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 296 కరీంనగర్ శుక్రవారం, 2 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియ లేదు.. బీఎస్ఎఫ్ ఐజీ అశోక్ యాదవ్

శ్రీనగర్: ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, పాకిస్థాన్ ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడినా తీవ్రస్థాయిలో సమాధానమిస్తామని సరిహద్దు భద్రతా దళం ఇన్‌స్పెక్టర్ జనరల్ అశోక్ యాదవ్ తెలిపారు. శ్రీనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎల్‌ఓసీ వెంబడి పలు లాంచిం గ్ ప్యాడ్లు, ఫార్వార్డ్ లొకేషన్లను ధ్వంసం చేశామని, అయితే కొన్ని యథాతథంగా ఉన్నాయని చెప్పారు. ఉగ్రవాదులు ఇప్పటికీ అక్కడ ఉన్నట్టు చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ, సరిహద్దు భద్రతా దళాలు పాకిస్థాన్ లోని అనేక లాంచింగ్ ప్యాడ్లు, ఫార్వార్డ్ లొకేషన్లపై విరుచుకుపడి ధ్వంసం చేశాయి. అయితే కొన్ని మాత్రం ఎల్‌ఓసీ వెంబడి అలాగే ఉన్నాయి. కొందరు ఉగ్రవాదులు అక్కడ సంచారం సాగిస్తున్నారు. అయితే ఉగ్రవాదులు ఎలాంటి చొరబాటు యత్నాలు చేసినా వాటిని తిప్పికొడ తాం. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు, పాకిస్థాన్ ఎలాటి దుస్సాహసానికి పాల్పడినా చాలా తీవ్రమైన స్పందన ఉంటుంది' అని అశోక్ యాదవ్ తెలిపారు.




# తెలంగాణలో మరో కొత్త జిల్లా..

## ఈ ప్రాంతాలతో కలిపి, హైదరాబాద్ శివారులోనే..!

## నూతన జిల్లా ఏర్పాటుకు రేవంత్ సర్కార్ సన్నాహాలు..

హైదరాబాద్ : తెలంగాణలో మరో కొత్త జిల్లా ఏర్పాటు కానుంది. రాజధాని హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజనకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న మూడు పోలీస్ కమిషనరేట్లు నాలుగుగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీగా మారిన నేపథ్యంలో జిల్లాల హద్దులను కూడా కమిషనరేట్ల పరిధితో అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2027 జనగణన ప్రక్రియ ప్రారంభానికి ముందే అంటే వచ్చే ఏడాది జనవరి నాటికే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 16 మండలాలున్న హైదరాబాద్ జిల్లా పరిధిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. తిరుమలగిరి, మారేడ్‌పల్లి మండలాలు,అమీర్‌పేట మండలంలోని బేగంపేట ప్రాంతాన్ని మల్కాజిగిరి జిల్లాలో కలపనున్నారు. ఇప్పటి వరకు బండ్లగూడ, బహదూర్‌పుర వరకే ఉన్న జిల్లా హద్దులు, ఇకపై శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాల వరకు విస్తరించనున్నాయి. అయితే ఈ మండలాల్లో జీహెచ్‌ఎంసీ పరిధి ఎంతవరకు ఉంటుందో, అంతవరకే హైదరాబాద్ జిల్లా కిందికి వస్తుంది. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధికి సమానంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హద్దులను ఖరారు చేయనున్నారు. రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విలీనం కానున్నాయి. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా ఈ జిల్లా పరిధిలోకి వస్తాయి. అయితే, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జీహెచ్‌ఎంసీ పరిధికి బయట ఉండటంతో దీనిపై నిర్ణయం ఇంకా పెండింగ్‌లో ఉంది. విస్తారమైన భూభాగం, ఐటీ కారిడార్, పరిశ్రమలతో కూడిన రంగారెడ్డి జిల్లాను రెండుగా విభజించనున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐటీ సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలు ఉండే ప్రాంతం 'అర్బన్ జిల్లా'గా మారుతుంది. కొత్తగా ఏర్పడిన 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ పరిధిని రూరల్ జిల్లాగా మార్చనున్నారు. ఇందులో షాద్‌నగర్, చేవెళ్ల, ఆమనగల్లు, కేశంపేట, తలకొండపల్లి, మాడ్గుల, యాచారం, మంచాల, కందుకూరు, మహేశ్వరం వంటి మండలాలు ఉంటాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు దేశవ్యాప్తంగా 'హౌసింగ్ సెన్సస్' నిర్వహించాల్సి ఉన్నందున.. జనవరి లోపే ఈ జిల్లాల మార్పుపై డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. పోలీస్ స్టేషన్ పరిధి, జిల్లా కలెక్టరేట్ పరిధి ఒకే విధంగా ఉండటం వల్ల సామాన్య ప్రజలకు, శాంతిభద్రతల నిర్వహణకు సులువు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## చైనాతో పాటు ప్రపంచ దేశాలకు భారత్ బిగ్ షాక్.. సలాం కొట్టిన అమెరికా..




ప్రపంచ బియ్యం ఉత్పత్తి రంగంలో భారత్ చరిత్రాత్మక ఘనత సాధించింది. ఇప్పటివరకు ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా ఉన్న చైనాను అధిగమించి భారతదేశం ప్రపంచ బియ్యం ఉత్పత్తిలో నంబర్-1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో బియ్యం రంగంలో చైనా దీర్ఘకాల ఆధిపత్యానికి తెరపడగా.. భారత్ ప్రపంచానికి కొత్తగా బియ్యం రాజుగా అవతరించింది. చైనా ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, అరుదైన లోహాల నుంచి అనేక కీలక వస్తువుల వరకు ఆధిపత్యం చెలాయిస్తోంది. అలాంటి దేశాన్ని బియ్యం ఉత్పత్తిలో వెనక్కి నెట్టడం భారత్‌కు వ్యూహాత్మకంగా.. ఆర్థికంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన విజయంగా చెప్పవచ్చు. అమెరికా కూడా ఈ విజయాన్ని అధికారికంగా అంగీకరించింది. అమెరికా వ్యవసాయ శాఖ డిసెంబర్ 2025 నివేదిక ప్రకారం, 2024-25 సంవత్సరానికి భారతదేశ బియ్యం ఉత్పత్తి 152 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకోగా, చైనా ఉత్పత్తి 146 మిలియన్ మెట్రిక్ టన్నుల వద్ద నిలిచింది. ఈ గణాంకాలతో ప్రపంచ బియ్యం ఉత్పత్తిలో భారత్ వాటా 28 శాతానికి పైగా పెరిగింది. ఈ పరిణామం చైనాకు పెద్ద ఆందోళనగా మారిందని చెప్పుకోవచ్చు.

ఎన్నో దశాబ్దాలుగా బియ్యం ఉత్పత్తిలో తామే అగ్రస్థానంలో ఉన్నామని భావించిన డ్రాగన్‌కు.. భారత్ సాధించిన ఈ ఘనత వ్యూహాత్మక షాక్‌గా మారింది. నివేదికల ప్రకారం భారతదేశ విజయానికి తైవాన్ నుంచి వచ్చిన సాంకేతిక సహకారం కూడా ఒక కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. చైనా-తైవాన్ మధ్య ఉద్రిక్త సంబంధాలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ అంశం చైనాకు మరింత అసహనాన్ని కలిగిస్తోంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా బియ్యం మూలం గురించి మాట్లాడినప్పుడు భారతదేశం పేరు ప్రముఖంగా వినిపించేది. కానీ ఉత్పత్తి పరంగా చైనా ముందుండేది. కానీ ఇప్పుడు ఆ సమీకరణ పూర్తిగా మారింది. అంతర్జాతీయ బియ్యం సంస్థ దక్షిణాసియా ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సుధాన్షు సింగ్ మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా అవతరించడం చరిత్రాత్మక విజయమే కాకుండా, ప్రపంచ ఆహార భద్రతలో భారత్ పాత్రను మరింత బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పతనం కాబోతోంది..భారత్ అలర్ట్‌గా ఉ ండాలి.. దేశ ఆర్థిక వ్యవస్థపై RBI హెచ్చరిక.. ప్రస్తుతం భారతీయ బియ్యం 172 దేశాలకు ఎగుమతి అవుతోంది. ఇది కేవలం వాణిజ్య అంశం మాత్రమే కాకుండా, భారత విదేశాంగ విధానంలో కూడా ఒక ముఖ్యమైన సాధనంగా మారింది.

అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆహార భద్రత కల్పించడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. బియ్యం ఆదాయం పరంగా కూడా భారత్ అదుతేమైన ప్రగతి సాధించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 1,23,000 రకాల బియ్యం ఉండగా, వాటిలో దాదాపు 60 వేల రకాలు భారతదేశంలోనే లభిస్తాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ రికార్డు స్థాయిలో రూ. 4.5 లక్షల కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసింది. ఇందులో బియ్యం వాటా సుమారు 24 శాతం. బాస్మతి, బాస్మతియేతర బియ్యం ఎగుమతుల ద్వారా మాత్రమే భారత్ రూ. 1.05 లక్షల కోట్లకు పైగా విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించింది.




## తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు.. భారీగా పొగమంచు

హైదరాబాద్ / అమరావతి , జనవరి 1: ఏపీ, తెలంగాణా రాష్ట్రాలు చలి గుప్పిట్లో చిక్కుకున్నాయి. ఎన్నడూలేని విధంగా గత నెలరోజుల నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు వణికిపోతున్నారు. ప్రస్తుతం.. తెలంగాణ వ్యాప్తంగా సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు ఉ ష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో దట్టమైన పొంగమంచు కురియడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. కోహిర్, సిర్పూర్ ప్రాంతాల్లో నెల రోజులుగా 5 నుంచి 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, జనగాం, మెదక్, రంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో చలి తీవ్రత బాగా పెరిగిపోయింది. నగర శివారు ప్రాంతాల్లోనూ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. అక్కడి ప్రాంతాల్లో 8 నుంచి 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక.. ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో విపరీతమైన చలి ప్రభావం కనిపిస్తోంది. రాబోయే మూడు రోజుల్లో కొస్తాంధ్ర, యానాం, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో ఉ ష్ణోగ్రతలు 2-3 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

దక్షిణ తీర ప్రాంతాల్లోనూ కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని ఐఎండీ అంచనా వేస్తోంది. జనవరి 1 తర్వాత వాతావరణంలో చాలా మార్పులు ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం కూడా విపరీతంగా చలి తీవ్రత కనిపిస్తోంది. ఉత్తర భారతదేశం నుంచి చల్లటి పవనాలు వీడయడం వల్లనే ఉషో?గ్రతలు తగ్గాయని ఐఎండీ పేర్కొంది.




## కేసీఆర్ హయాంలో తెలంగాణకు తీరని అన్యాయం

హైదరాబాద్ - సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అండ్ కో తమ ప్రభుత్వంపై కావాలనే విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమానికి నీళ్ళే ప్రధాన కారణమని తెలిపారు. బీఆర్ఎస్ నేతలది సంకుతిత స్వభావమని విమర్శించారు. కేసీఆర్ నోరు తెరిస్తే అబద్దాలే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్ళలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ నదీ జలాల అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రజంటేషన్‌కు హాజరై ప్రసంగించారు సీం రేవంత్‌రెడ్డి. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ఏపీ ప్రభుత్వంపై తీవ్ర వత్తిడి తెస్తున్నామని చెప్పుకొచ్చారు. గతంలో కేసీఆర్, హరీష్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మరణ శాసనంగా మారాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశదషారు. ఏపీ నీటి చౌర్యం చేస్తున్న తెలంగాణ వాటాను మనం వాడుకోలేని పరిస్థితిలో ఉన్నామి ఆవేదన వ్యక్తం చేశారు. కమీషన్ల కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి ఆ ప్రాజెక్టును మార్చారని మండిపడ్డారు. తలా వదిలేసి తోక దగ్గర నీళ్ళు తెచ్చేలా ప్రాజెక్టు డిజైన్ చేశారని ఆరోపణలు చేశారు. ఏపీకి 66 శాతం నీళ్ళు శాశ్వత హక్కు వచ్చేలా కేసీఆర్ సంతకం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ నీటి లెక్కలు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి.



## సర్పంచుల బిల్లులు వెంటనే విడుదల చేయాలి

సిద్దిపేట, జనవరి1: పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కొత్త సర్పంచులకు నిధులను కేటాయించాలని విన్నవించారు. ఇవాళ అక్బర్‌పేట, భూంపల్లి మండలంలోని బొప్పాపూర్‌లో ఎంపీ రఘునందన్‌రావు పర్యటించారు. ఈ సందరరేగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఓపెన్ జిమ్, బాలవికాస వాటర్ ప్లాంట్, సోలార్ స్ట్రీట్ లైట్లను సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్, పాలకవర్గంతో కలిసి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు ఎంపీ రఘునందన్ రావు. మహాత్మాగాంధీ కళలు కన్నా గ్రామస్వరాజ్యం సాధించాలని పాలకవర్గానికి సూచించారు. తన పార్లమెంట్ పరిధిలో ఎప్పుడు, ఏ సమస్య వచ్చిన 24 గంటలు తాను అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. వ్యక్తిగత రీత్యా కూడా గ్రామపంచాయతీల ఏర్పాటుకు కృషి చేస్తానని మాటిచ్చారు. బొప్పాపూర్ గ్రామ పంచాయతీ, ఐకేపీ సెంటర్లో లైట్లు, రోడ్ల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటిపై సోలార్‌ను ఏర్పాటు చేసుకుని కరెంట్ ఆదా చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు ఎంపీ రఘునందన్ రావు. మూడున్నరేళ్లలో సోలార్ నుంచి కరెంట్ తయారీ చేసేలా చూడాలని నిర్దేశించారు.




## న్యూ ఇయర్ కిక్కు.. తెలంగాణలో రూ.వెయ్యి కోట్ల మద్యం తాగేశారు

హైదరాబాద్: తెలంగాణలో నూతన సంవత్సరం సందరరేగా భారీగా మద్యం విక్రయాలు జరిగాయి. మూడు రోజుల్లో దాదాపు రూ.వెయ్యి కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరిగినట్టు ఆబ్కారీ శాఖ అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. 2024 డిసెంబర్ నెల చివరి మూడు రోజుల్లో రూ.736 కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరగ్గా.... 2025 డిసెంబర్ చివరి మూడు రోజుల్లో రూ.980 కోట్లకుపైగా విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ శాఖ చెబుతోంది. నూతన మద్యం విధానంలో భాగంగా కొత్తగా లైసెన్స్‌లు పొందిన దుకాణదారులు డిసెంబర్ నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్రంలోని మొత్తం 3,620 మద్యం దుకాణాలు, దాదాపు 1,100 బార్‌లు, పబ్‌లు, క్లబ్‌లు కలిసి డిసెంబర్ నెలలో రూ.4,920 కోట్ల విలువైన మద్యాన్ని డిపోల నుంచి కొనుగోలు చేశారు. డిసెంబరు 25 నుంచి నిన్న టి వరకు మద్యం విక్రయాలు విలువ రూ.1,350 కోట్లకుపైగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. డిసెంబరు 29న రూ.280 కోట్లు, 30న రూ.380 కోట్లు, 31న రూ.315 కోట్లకుపైగా విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ మూడు రోజుల్లోనే దాదాపు రూ.1000 కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరగడం గమనార్హం. మొత్తం 8.30 లక్షల కేసుల లిక్కర్, 7.78 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి.




## జనవరి 1న మళ్లీ పెరిగిన బంగారం ధరలు.. ఇక దరువు మొదలైనట్టేనా

కొత్త సంవత్సరం తొలి రోజునే బంగారం ధరల్లో పెరుగుదల కనిపించింది. గత మూడు రోజుల బేరిష్ ట్రెండ్‌కు బ్రేకులు చెబుతూ గురువారం పసిడి ధర స్వల్పంగా పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 11.00 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర నిన్నటితో పోలిస్తే స్వల్పంగా పెరిగి రూ.1,35,060కు చేరుకుంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర కూడా సుమారు రూ.150 మేర పెరిగి రూ.1,23,800కు చేరుకుంది. వెండి ధర మాత్రం మరింతగా తగ్గింది. కిలో వెండి రేటు నిన్నటితో పోలిస్తే సుమారు రూ.1000 మేర తగ్గి రూ.2,38,000కు చేరుకుంది. సుంకాల ప్రభావం, ఫెడ్ వడ్డీ రేటు కోతపై పెరుగుతున్న అంచనాలు, కేంద్ర బ్యాంకుల పసిడి కొనుగోళ్లు వంటివి బంగారానికి మళ్లీ డిమాండ్ పెంచుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే, నేడు ట్రేడింగ్ ఓ మోస్తరుగా ఉండటంతో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కూడా ఆ మేరకు పరిమితమయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అయితే రోజులు గడిచే కొద్దీ మళ్లీ వీటి ధరలు మళ్లీ పెరగడం పక్కా అని చెబుతున్నారు.


## యాదగిరిగుట్ట ఈవో రాజీనామా.. ఆమోదించిన సర్కార్




యాదగిరిగుట్ట, జనవరి1 : యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్రావు రాజీనామా చేశారు.. దేవాదాయ శాఖ కమిషనర్‌గా, ఆలయ ఈవోగా వెంకట్రావు అప్పట్లో పనిచేసిన విషయం తెలిసిందే. అయితే ఆయన రిటైర్‌మెంట్ తర్వాత యాదగిరిగుట్ట ఈవోగా నియమించింది తెలంగాణ ప్రభుత్వం. అయితే అనారోగ్య కారణాల ద ృష్ట్యా వెంకట్రావు రాజీనామా చేశారని తెలుస్తోంది. మరోవైపు రాజకీయ ఒత్తిడితోనూ ఆయన రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఆయన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. అయితే వెంకట్రావు రాజీనామా వ్యవహారం బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది.

అయితే ఈవో వెంకట్రావు రాజీనామాపై యాదగిరిగుట్ట దేవస్థానం నుంచి ఇంతవరకు ఎవరు స్పందించలేదు. కాగా ప్రభుత్వం ఈ పరిణామాన్ని గమనించి ఆలయ పరిపాలనలో అవసరమైన మార్పులు చేపడతున్నట్లు సమాచారం. దీంతో యాదగిరిగుట్ట ఆలయ కార్యక్రమాల కొనసాగింపు, భక్తుల సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేలా రాష్ట్ర సర్కార్ చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు: ఉత్తమ్



హైదరాబాద్: పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.80 వేల కోట్లు అవసరమని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినట్లు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చెప్పిందన్నారు. నీటి వాటాలపై అసెంబ్లీలో శుక్రవారం చర్చ జరగనున్న ద ృష్ట్యా 'నీళ్లు-నిజాలు' అంశంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కోసం మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఏపీ చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు, ఇతరపథకాలపై ఉత్తమ్ వివరణ ఇచ్చారు. "పాలమూరు ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం రూ. 27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.80 వేల కోట్లకుపైగా కావాలి. రూ.80వేల కోట్ల ప్రాజెక్టుపై రూ.27వేల కోట్లు ఖర్చు చేస్తే 90 శాతం పూర్తయినట్టా? మేం వచ్చాక రూ.7 వేల కోట్లు ఖర్చు చేశాం.

కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి తీయలేదని ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోంది" అని ఉత్తమ్ మండిపడ్డారు.

## ప్రజల గుండెల్లో కేసీఆర్ శాశ్వతం: కేటీఆర్

హైదరాబాద్: గెలుపోటములు తాత్కాలికమని.. ప్రజల గుండెల్లో కేసీఆర్ శాశ్వతమని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ తిరోగమనం ప్రారంభమైందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో పార్టీ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. "యూరియా కోసం రైతులు చలికి వణుకుతూ క్యూలైన్‌లో ఉన్నారు. భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటై మనపై కత్తులు దూస్తున్నాయి. మనల్ని తుదముట్టించేందుకు రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతవరకు మనల్ని ఎవరూ ఏం చేయలేరు. మనం విజయం సాధిస్తాం.. ధర్మం మనవైపు ఉంది" అని కేటీఆర్ అన్నారు.

**నదీ జలాలపై అవగాహన లేని ముఖ్యమంత్రి మాకు ఉపన్యాసాలు ఇస్తారా:** నదీ జలాలపై కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు ఉపన్యాసాలు ఇస్తారా అని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలనుకుంటే బీఆర్‌ఎస్‌కు కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సభలో సమాన హక్కులు ఇవ్వాలని, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. 'మేము మీ దగ్గర నుంచి ఏమి నేర్చుకోవాలి. చెక్‌డ్యాంలు




ఎలా ఫెయిల్ చేయాలో నేర్పిస్తారా. మేడిగడ్డ ఎలా పేల్చామో చెబుతారా. సుంకిశాల ఎలా కూల్చామో చూపిస్తారా. వట్టెం పంప్ హౌస్ ఎలా ముంచామో వివరిస్తారా. కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులన్నింటినీ కేఆర్ఎంబీకి ఎలా ధారాదత్తం చేశారో చెప్పబోతున్నారా. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఎకరానికైనా అదనంగా నీళ్లు అందించిందా' అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క చెరువునూ బాగు చేయలేదని, ఒక్క కాలువనూ మరమ్మత్తు చేయలేదని విమర్శించారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్.. హైదరాబాద్‌లో 2,731 కేసులు నమోదు

హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భారీగా వాహనాలను పట్టుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 2,731 మందిపై కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,198 మంది, సైబరాబాద్‌లో 928 మంది, రాచకొండ కమిషరేట్ పరిధిలో 605 మంది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.




## విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా.. డాక్టర్‌తో సహా 7 మంది అరెస్ట్

తిరువనంతపురం, జనవరి 1: విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నా ముఠా గుట్టు రట్టు అయింది. కేరళలోని తిరువనంతపురంలో మాదక ద్రవ్యాలను సప్లయ్ చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఒక డాక్టర్, బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (బీడీఎస్) విద్యార్థినితో సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా మాదకద్రవ్యాల నిరోధక ప్రత్యేక కార్యాచరణ బ ృందాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అద్దె ఇంట్లో నుంచి ఎండీఎంఏ, హైబ్రిడ్ గంజాయి , గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టు అయిన ఏడుగురిని డాక్టర్ విఘ్నేష్ దత్తన్, బీడీఎస్ విద్యార్థిని హలీనా, అసిమ్, అవినాష్, అజిత్, అన్సియా, హరీష్‌గా పోలీసులు గుర్తించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం నిందితుల్లో ఒకరైన అవినాష్ ఒక ఐటీ ఉద్యోగి కావాడం గమన్హారం. అలానే అసిమ్, అజిత్, అన్సియా గతంలో కూడా పలు మాదకద్రవ్యాల కేసులలో నిందితులుగా ఉన్నారని పోలీసుల విచారణలో వెల్లడైంది. పోలీసులు చేసిన ఆకస్మిక తనిఖీల్లో నాలుగు గ్రాముల ఎండీఎంఏ, ఒక గ్రాము హైబ్రిడ్ గంజాయి,100 గ్రాముల గంజాయి దొరికింది. నిందితులు విద్యార్థులకు హైబ్రిడ్ గంజాయిని గ్రాముకు రూ. 3,000 చొప్పున విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. అలానే రెండు కార్లు, రెండు బైక్‌లను మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో కనియాపురం తోప్పిల్ ప్రాంతంలో ఓ అద్దె ఇంట్లో ఉన్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలోనూ ఈ నిందితులను పట్టుకునే ప్రయత్నం చేయగా.. తమ కారుతో పోలీసు జీపును ఢీకొట్టి పారిపోయారు. ఆ సమయంలో వారిని అడ్డుకోవడానికి పోలీసులు చేసిన ప్రయత్నం విఫలమైంది. తాజాగా నిందితులు కనియపురం తోప్పిల్‌లో దాక్కున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇంటిని చుట్టు ముట్టి.. నిందితులను అరెస్ట్ చేశారు. ఈ డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిలో వైద్య విద్యార్థిని, ఐటీ ఉద్యోగి ఉండటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది.




## విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టివేత.. మహిళలు అరెస్ట్

ముంబై, జనవరి 01: నగరంలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి దాదాపు 32.79 కేజీల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ బంగారం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.19.15 కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు వివరించారు. ఆఫ్రికన్ దేశాల నుంచి ఈ ఇద్దరు మహిళలు వచ్చారని చెప్పారు. వీరిద్దరు వేర్వేరుగా విదేశాల నుంచి వచ్చారన్నారు. ఛత్రపతి శివాజీ విమానాశ్రయంలో దిగిన వీరు.. తీరు అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రయాణికులను అదుపులోకి తీసుకుని.. తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. సదరు మహిళల లోదుస్తులతోపాటు లగేజీలో భారీగా బంగారం దాచినట్లు గుర్తించామని కస్టమ్స్ అధికారులు వివరించారు. వీరిద్దరిని అరెస్ట్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి.. విచారిస్తున్నామని కస్టమ్స్ అధికారులు చెప్పారు.




## న్యూ ఇయర్ వేడుకలో విషాదం.. బిర్యానీ తిని ఒకరు మృతి..15 మందికి అస్వస్థత

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 31 రాత్రి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ గ్రాండ్‌గా జరుపుకున్నారు. పబ్బులు, క్లబ్బులు, ఫామ్ హౌస్, రిసార్ట్స్ కొంతమంది సొంత రూముల్లో న్యూ ఇయర్ సంబరాలు చేసుకున్నారు. కొత్త ఏడాదిలో కొన్నిచోట్ల విషాదాలు చోటు చేసుకున్నాయి. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా బిర్యాని తిని ఒకరు మ ృతి చెందగా, 15 మంది తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఈ విషాద ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని భవానినగర్‌లో జరిగింది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా 17 మంది మద్యం సేవించి చిల్ అయ్యారు. బిర్యానీ తిన్న పాండు(53) అస్వస్థతకు గురై చనిపోయాడు. మరో 15 మంది అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వాళ్లందరినీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. ఇదిలా ఉంటే.. హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

అనుమానితులను తనిఖీలు చేశారు. ఈ క్రమంలోనే నార్సింగ్‌లో డ్రగ్స్‌తో ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. రాజమండ్రికి చెందిన శ్రీనివాస్ కళ్యాణ్, గోవాకు చెందిన విజయ్ డ్రగ్స్ తీసుకున్నారని,వారిని టెస్ట్ చేయగా పాజిటీవ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.




## కొత్త సంవత్సరం వేళ.. స్విట్జర్లాండ్‌లో భారీ పేలుడు

నూతన సంవత్సరం వేళ స్విట్జర్లాండ్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ స్కీ రిసార్ట్ నగరం క్రాన్స్ మోంటానాలో గల ఓ బార్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు మృతి చెందినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. బార్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుగుతుండగా అర్ధరాత్రి 1.30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) ఈ పేలుడు చోటుచేసుకుంది. పేలుడు ధాటికి భారీగా మంటలు చెలరేగాయి. సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. స్విస్ ఆల్ప్స్ పర్వతశ్రేణుల నడుమ ఉన్న ఈ క్రాన్స్ మోంటానా నగరం ప్రముఖ పర్యాటక స్థలం. ఏటా డిసెంబరు-జనవరి సమయంలో ఇక్కడ పర్యాటకుల తాకిడి విపరీతంగా ఉంటుంది.

# వలువలు విలువలు వివాదం

## శివాజీ వ్యాఖ్యలతో మళ్లీ తెరపైకి వచ్చిన సాంస్కృతిక సంఘర్షణ



(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్) సమాజంలో మారుతున్న విలువలు, వ్యక్తిగత స్వేచ్ఛ పేరిట జరుగుతున్న అతివాదాలు, వాటిపై వ్యక్తమవుతున్న ప్రతిఘటనలు ఈ అన్నింటి మధ్య 'వస్త్రధారణ' మరోసారి కేంద్రబిందువుగా మారింది. ఇటీవల విడుదలైన దండోరా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కేవలం సినీ వేదికకే పరిమితం కాకుండా సామాజిక, సాంస్కృతిక చర్చగా మారాయి. "కప్పుకుంటే తప్పు విప్పుకుంటే గొప్ప" అన్న నేటి విరుద్ధ ధోరణిని ప్రతిబింబిస్తూ ముందే సమాజంలో వ్యక్తమవుతున్న భావజాలానికి శివాజీ వ్యాఖ్యలు అద్దం పట్టినట్టయ్యాయి. అయితే, ఆ వ్యాఖ్యల్లో ఉపయోగించిన పదజాలమే ఆయనను వివాదాల మధ్యకి నెట్టింది. హీరోయిన్ల వస్త్రధారణపై వ్యాఖ్యానిస్తూ రెండు చోట్ల అభ్యంతరకర పదాలు ఉపయోగించారన్న ఆరోపణలతో సినీ పరిశ్రమ నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ అంశం సామాన్య విమర్శగా ఆగిపోకుండా, మహిళా గౌరవం వ్యక్తిగత స్వేచ్ఛ-%సాంస్కృతిక విలువలు అనే మూడు కోణాల్లో చర్చకు దారి తీసింది. నందిని రెడ్డి, సుప్రియ యార్లగడ్డ, మంచు లక్ష్మీప్రసన్న, స్వప్న దత్, ఝాన్సీ తదితర ప్రముఖ మహిళా సినీ ప్రముఖులు 'వాయిస్ ఆఫ్ ద ఉమెన్' పేరుతో మూవీ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు లేఖ రాయడం ఈ వ్యవహారానికి తీవ్రతను చాటింది. ఇండస్ట్రీలో పనిచేస్తున్న వందలాది మహిళల భావోద్వేగాలకు ఇది ప్రతినిధిగా మారింది. మరోవైపు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సైతం సుమోటోగా స్పందించి, శివాజీకి నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 27న కమిషన్ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. ఇది కేవలం ఓ వ్యక్తిగత వ్యాఖ్య వ్యవహారంగా కాకుండా, మహిళల గౌరవానికి సంబంధించిన అంశంగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన ఘటనగా మారింది. ఇక సోషల్ మీడియా రంగం మాత్రం రెండు ధ్రువాలుగా విడిపోయింది. ఒక వర్గం శివాజీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తే, మరొక వర్గం "ఆయన ఉద్దేశం తప్పుగా అర్థం చేసుకున్నారు" అంటూ మద్దతుగా నిలిచింది. 'వస్త్రధారణ వ్యక్తిగత హక్కు అయినా, బహిరంగ వేదికపై దాని ప్రభావం గురించి మాట్లాడటం నేరం కాద'ని కొందరు అభిప్రాయపడ్డారు. ఈ మొత్తం పరిణామాల మధ్య శివాజీ స్వయంగా స్పందిస్తూ, మహిళలకు క్షమాపణలు చెప్పారు. 'మంచి ఉద్దేశంతో మాట్లాడిన మాటల్లో రెండు అనుచిత పదాలు దొర్లాయి. అందుకు విచారం వ్యక్తం చేస్తున్నాను' అంటూ సెల్ఫీవీడియో విడుదల చేశారు. ఇది వివాదాన్ని కొంతవరకు శాంతింపజేసినప్పటికీ, చర్చ మాత్రం కొనసాగుతూనే ఉంది. ఇక్కడ గమనించాల్సిన అసలు అంశం వేరే ఉంది. వస్త్రధారణ అనేది వ్యక్తిగత హక్కే కానీ అదే సమయంలో అది సమాజానికి ఒక సంకేతం కూడా. భారతీయ సంప్రదాయంలో వస్త్రం కేవలం అలంకారం కాదు.. అది సంస్కారం, గౌరవం, ఆత్మగౌరవానికి ప్రతీక. "వలువలే విలువలు" అన్న భావన అందుకే ఇప్పటికీ బలంగా నిలిచింది. అయితే, ఆ విలువలను కాపాడే క్రమంలో మహిళలపై నైతిక బంధనాలు మోపడం ఎంతవరకు సమంజసం? అలాగే, స్వేచ్ఛ పేరిట సంస్కృతిని అవహేళన చేయడం ఎంతవరకు సమర్థనీయం ఈ రెండింటి మధ్య సమతుల్యం సాధించడమే నేటి సమాజం ముందు ఉన్న అసలైన సవాల్.

శివాజీ వ్యాఖ్యల వివాదం ఒక వ్యక్తి మాటలకే పరిమితం కాదు. ఇది మన సమాజంలో నలుగుతున్న అంతర్గత సంఘర్షణకు ప్రతిబింబం. ఆధునికత సంప్రదాయం మధ్య పోరాటంలో ఎటు వైపు నిలవాలన్న ప్రశ్నను మళ్లీ మన ముందుకు తెచ్చిన ఘటనగా ఇది మిగులుతుంది.

**చివరికి చెప్పాల్సిందేమిటంటే..** వస్త్రం విలువ కాదు, విలువల మీదే సమాజం నిలబడుతుంది. స్వేచ్ఛ ఉండాలి కానీ అది గౌరవాన్ని తాకట్టు పెట్టే స్థాయికి వెళ్లకూడదు. సంప్రదాయం ఉండాలి కానీ అది అణచివేతగా మారకూడదు. ఈ సమతుల్యాన్ని సాధించగలిగినప్పుడే ఇటువంటి వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.


# ప్రతిష్టాత్మకం... భారత రత్న పురస్కారం... జనవరి 2న... భారత రత్న ప్రారంభం




భారతరత్న పురస్కారం భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారం. పురస్కారం కళ, సాహిత్య, విజ్ఞాన, క్రీడా రంగాలలో అత్యుత్తమ కృషికి ప్రదానం చేస్తారు. భారతరత్న పురస్కారం అత్యున్నత స్థాయిలో ప్రదర్శించిన కృషికి/చేసిన సేవకు గుర్తింపుగా ఎటువంటి జాతి, వృత్తి, స్థాయి, లింగ బేధాలను పాటించకుండా ప్రదానం చేయబడుతుంది. పురస్కారానికి ఎంపిక చేయాల్సిన జాబితాను ప్రధానమంత్రి రాష్ట్రపతికి సిఫారసు చేయవలసి ఉంటుంది. ఇది జనవరి 2, 1954లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ చేత పారంభింప బడింది. 1954, జనవరి 2వ తేదీన రెండు పౌర పురస్కారాలను ప్రారంభిస్తున్నట్లు భారత రాష్ట్రపతి యొక్క కార్యదర్శి కార్యాలయం నుండి ఒక ప్రకటన జారీ అయ్యింది. వాటిలో మొదటిది అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న కాగా రెండవది దానికన్నా తక్కువ స్థాయి గల మూడంచెల పద్మవిభూషణ్ పురస్కారం. పద్మవిభూషణ్ పురస్కారం ప్రథమ, ద్వితీయ, తృతీయ వర్గాలుగా విభజించారు. 1955, జనవరి 15న పద్మవిభూషణ్ పురస్కారాన్ని పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అనే మూడు వేర్వేరు పురస్కారాలుగా పునర్వర్గీకరించారు. భారతరత్న పురస్కారం ప్రకటించినట్లు ఎన్ని ప్రకటనలు వెలువడినా, కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వారు ప్రచురించే గెజిట్లో అధికారికంగా ప్రకటించిన తర్వాతనే ఈ పురస్కారం అధికారికంగా లభించినట్లు భావిస్తారు. పురస్కార గ్రహీతలకు రాష్ట్రపతి తన సంతకంతో కూడిన ఒక "సనదు (పట్టా), ఒక పతకం ప్రదానం చేస్తాడు. 1954 నిర్దేశాలు ప్రకారం 1 3/8 ఇంచుల (35 మిల్లీ మీటర్ల) వ్యాసార్థం కలిగిన వృత్తాకార బంగారు పతకాన్ని ఈ పురస్కార సమయంలో బహూకరిస్తారు. పతకం ముఖ భాగంలో సూర్యుని బొమ్మ ఉండి, కింది భాగంలో వెండితో "భారత రత్న" అని దేవనాగరి లిపిలో రాసి ఉంటుంది. వెనకవైపు మధ్యభాగంలో ప్లాటినం లోహంలో భారత చిహ్నం, కింది భాగంలో వెండితో భారత జాతీయ నినాదం "సత్యమేవ జయతే" అని రాసి ఉంటుంది. ఏడాది తరువాత దీని రూపాన్ని మార్చారు. అప్పుడు మార్చిన దానినే ఇప్పటికీ వాడుతున్నారు. ఇప్పటి మోడల్ ప్రకారం రావి ఆకు ఆకారంలో ఉండి 2 5/16 ఇంచులు (59 మి.మీ.) పొడవు, 1 7/8 ఇంచుల (48 మి.మీ.) వెడల్పు ఖఅని 1/%8 ఇంచుల (మి.మీ.) మందం కలిగి ఉండి ప్లాటినం చట్రం కలిగి ఉంటుంది. పతకం ముందు భాగంలో మధ్యలో సూర్యుని బొమ్మ చిత్రీకరించబడి ఉంటుంది. ప్లాటినం లోహంతో తయారు చేసిన ఈ బొమ్మ 5/8 ఇంచుల (16 మి.మీ.) వ్యాసార్థం కలిగి ఉ ండి, సూర్యుని కేంద్ర బిందువు నుంచి 5/6 ఇంచులు (21 మి.మీ.) నుంచి 1/2 దాకా (13 మి.మీ.) కిరణాలు విస్తరించి ఉంటాయి. ముందుభాగంలో భారతరత్న అన్న పదాలు, వెనుక వైపు భారత జాతీయ చిహ్నం, నినాదం సత్యమేవ జయతే 1954 డిజైన్ లోనే ఉంచేశారు. మెడలో వేయడానికి వీలుగా 2 ఇంచ్ వెడల్పు, 51 ఎం.ఎం. గల తెలుపు రిబ్బన్ ను పతకానికి కడతారు. 1957లో, వెండి పూత మార్చి ఎండిన కాంస్యం వాడటం ప్రారంభించారు. భారత రత్న పతకాలను కలకత్తాలోని అలిపోర్ ప్రభుత్వ ముద్రణశాలలో ముద్రిస్తారు. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ, పరమ వీర చక్ర, వంటి పౌర, సైనిక పురస్కారలకు ఇచ్చే పతకాలు కూడా ఇక్కడే ముద్రిస్తుంటారు. ఈ పురస్కారం క్రింద ఎలాంటి నగదు మంజూరు చేయరు. భారత రాజ్యాంగం యొక్క ఆర్టికల్ 18 (1) ప్రకారం ఈ పురస్కార గ్రహీతలెవ్వరూ తమ పేరు ముందు, వెనుక భారతరత్న అని పేర్కొనరాదు. భారతరత్న పొందిన పౌరులకు 7వ స్థాయి గౌరవం లభిస్తుంది (మొదటిది ఆరు – రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాష్ట్ర గవర్నర్లు, మాజీ రాష్ట్రపతులు, ఉపప్రధాన మంత్రి, ముఖ్య న్యాయాధీశులు). కానీ ఈ గౌరవం వలన ఎలాంటి అధికారాలు లేదా పేరు ముందు ప్రత్యేక బిరుదులూ రావు. సాధారణంగా భారతరత్న పురస్కార ప్రదాన సభ రాష్ట్రపతి భవన్, ఢిల్లీలో జరుగుతుంది. 1954 నాటి నిబంధనల ప్రకారం ఈ పురస్కారం కళలు, సాహిత్యం, విజ్ఞానం, ప్రజాసేవ రంగాలలో కృషి చేసినవారికి ఇచ్చేవారు. 2011, డిసెంబరులో ఈ నిబంధనలను మార్చి "మానవజాతి పాటుపడే ఈ రంగానికైనా" అనే పదాన్ని చేర్చారు. 1954 నాటి నిబంధనలు మరణానంతరం ఈ పురస్కారం ప్రకటించడాన్ని అనుమతించేవి కావు. కానీ 1955 జనవరిలో ఈ నిబంధనను సడలించారు. భారతరత్న పురస్కారం కేవలం భారతీయులకే ప్రదానం చేయాలన్న నిబంధన ఏమీ లేదు. ఈ పురస్కారాన్ని భారత పౌరసత్వం స్వీకరించిన మదర్ థెరీసాకు 1980లో, మరో ఇద్దరు విదేశీయులు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాను 1987లో, నెల్సన్ మండేలాకు 1990లో ప్రదానం చేశారు. ఈ పురస్కారం రెండుసార్లు రద్దు చేయబడింది. మొదటి సారి మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా గద్దెనెక్కిన తర్వాత 1977, జూలై 13వ తేదీన అన్ని పౌరపురస్కారాలను రద్దుచేశారు. తరువాత ఈ పురస్కారాలు 1980, జనవరి 25న ఇందిరాగాంధీ ప్రధాన మంత్రి అయిన తర్వాత పునరుద్ధరించబడ్డాయి 1992లో ఈ పురస్కారాల "రాజ్యాంగ సాధికారత"ను సవాలు చేస్తూ కేరళ, మధ్యప్రదేశ్ హైకోర్టులలో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఈ పురస్కారాలను రెండవసారి రద్దు చేశారు. ఈ వ్యాజ్యాలకు ముగింపు పలుకుతూ 1995 డిసెంబరులో సుప్రీం కోర్టు ఈ పురస్కారాలను మళ్ళీ పునరుద్ధరించింది. లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కు తన 40వ యేట ఈ పురస్కారం లభించింది. ఈ పురస్కారం లభించినవారిలో ఇతనే అతి పిన్నవయస్కుడు, మొట్టమొదటి క్రీడాకారుడు. కానీ 1958, ఏప్రిల్ 18వ తేదీన బొంబాయిలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ధోండో కేశవ కర్వేకు అతని 100వ జన్మదినం సందరరేగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఆయన జీవించి ఉండగా ఈ పురస్కారం అందుకున్నవారిలో అతి పెద్ద వయస్కుడు. 1966లో లాల్ బహదూర్ శాస్త్రి మొట్టమొదటి సారి మరణానంతరం ఈ పురస్కారాన్ని పొందాడు. ఈ పురస్కారానికి ప్రతిపాదనలు చేసే పద్ధతి లేనప్పటికీ, ప్రధానమంత్రి మాత్రమే రాష్ట్రపతికి ఏడాదికి గరిష'ంగా ముగ్గురిని మాత్రం సిఫారసు చేయవచ్చు. కానీ 1999లో ఈ పురస్కారాన్ని నలుగురు వ్యక్తులకు ప్రదానం చేశారు. భారత రత్న పొందిన వారిలో సర్వేపల్లి రాధాకృష?న్ 1954, చక్రవర్తుల రాజగోపాలాచారి 1954, డా.సి.వి. రామన్ 1954, డా. భగవాన్ దాస్ 1955, డా. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1955, జవహర్ లాల్ నెహ్రూ 1955, గోవింద్ వల్లభ్ పంత్ 957, ధోండో కేశవ కార్వే 1958, డా. బీ.సీ.రాయ్ 1961, పురుషోత్తమ దాస్ టాండన్ 1961, రాజేంద్ర ప్రసాద్ 1962, డా. జాకీర్ హుస్సేన్ 1963, పాండురంగ వామన్ కానే, 1963, లాల్ బహదూర్ శాస్త్రి (మరణానంతరం) 1966, ఇందిరాగాంధీ 1971, వీ.వీ.గిరి 1975, కే. కామరాజు (మరణానంతరం) 1976, మదర్ థెరీసా 1980, ఆచార్య వినోబా భావే (మరణానంతరం)1983, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ 1987, యం.జి.రామచంద్రన్ (మరణానంతరం)1988, బి.ఆర్. అంబేద్కర్ (మరణానంతరం)1990, నెల్సన్ మండేలా 1990, రాజీవ్ గాంధీ (మరణానంతరం) 1991, సర్దార్ వల్లభాయి పటేల్, (మరణానంతరం) 1991, మొరార్జీ దేశాయి 1991, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ (మరణానంతరం) 1992, జె.ఆర్.డీ. టాటా (1904–1993) 1992, సత్యజిత్ రే 1992, సుభాష్ చంద్ర బోస్ (తరువాత ఉపసంహరించ బడినది) 1992 ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ 1997 గుల్జారీలాల్ నందా 1997, అరుణా అసఫ్ అలీ (మరణానంతరం) 1997, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి 1998. సి.సుబ్రమణ్యాం 1998, జయప్రకాశ్ నారాయణ్ 1998, రవి శంకర్ 1999, అమర్త్య సేన్ 1999, గోపీనాథ్ బొర్డొలాయి 1999, లతా మంగేష్కర్ 2001, బిస్మిల్లా ఖాన్ 2001, భీమ్ సేన్ జోషి 2008, సచిన్ టెండూల్కర్ 2014, సి. ఎన్. ఆర్. రావు 2014, మదన్ మోహన్ మాలవ్య 2015, అటల్ బిహారీ వాజపేయి 2015, ప్రణబ్ ముఖర్జీ 2019, నానాజీ దేశముఖ్ 2019, హజారిక 2019 తదితరులు ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్... 9440595494**

# భారత శాస్త్ర విజ్ఞానానికి మార్గదర్శకుడు వసంత్ గోవారికర్
## జనవరి 2...వసంత్ గోవారికర్ వర్ధంతి



వసంత్ రాంచోడ్ గోవారికర్ (25 మార్చి 1933 – 2 జనవరి 2015) భారతదేశ అంతరిక్ష పరిశోధనను కొత్త స్థాయికి తీసుకువెళ్లిన ఒక ప్రఖ్యాత శాస్త్రవేత్త. ఆయన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థలో కీలకమైన బాధ్యతలు నిర్వహించి, దేశంలో శాస్త్ర విజ్ఞానానికి మార్గదర్శకుడిగా నిలిచారు. అంతరిక్ష పరిజ్ఞానం, వాతావరణ శాస్త్రం, వ్యవసాయం, జనాభా అంశాల్లో ఆయన చేసిన కృషి అత్యంత ప్రాముఖ్యం కలిగి ఉంది.

**ప్రారంభ జీవితం...** వసంత్ గోవారికర్ 1933 మార్చి 25న మహారాష్ట్రలోని పూణేలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యను కొల్హాపూర్‌లో పూర్తి చేసి, పూణేలో ఉన్న ఫెర్గూసన్ కాలేజీ నుండి ఇంజినీరింగ్ డిగ్రీ పొందారు. ఉన్నత చదువుల కోసం ఇంగ్లాండ్‌కు వెళ్లి బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. చిన్నతనం నుంచే శాస్త్ర రంగంపై ఉన్న ఆసక్తి ఆయన జీవితాన్ని శాస్త్రవేత్తగా మలచింది.

**కెరీర్...** ISROలో సేవలు... వసంత్ గోవారికర్ 1967లో భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థలో చేరారు. SLV (సాటిలైట్ లాంచ్ వెహికల్) అభివృద్ధి కార్యక్రమంలో ఆయన చేసిన కృషి భారత అంతరిక్ష శాస్త్రంలో గొప్ప మైలురాయిగా నిలిచింది. ఈ ప్రాజెక్టులో ఇస్రో వ్యవస్థాపకుడు డా. విక్రం సారాభాయి నాయకత్వంలో పనిచేసి, భారతదేశ ఉపగ్రహ ప్రయోగాల్లో ప్రధాన పాత్ర పోషించారు.

**శాస్త్రీయ సలహాదారుగా సేవలు...** 1991 నుండి 1993 వరకు, భారత ప్రధాని పి వి నరసింహ రావు కు శాస్త్రీయ సలహాదారుగా వసంత్ గోవారికర్ సేవలందించారు. ఈ సమయంలో, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మార్గదర్శక విధానాలను రూపొందించి, పరిశోధనలకు దారిచూపారు.

**వాతావరణ శాస్త్రం...** వసంత్ గోవారికర్ వాతావరణశాస్త్ర రంగంలోనూ ఎనలేని కృషి చేశారు. ఆయన రూపొందించిన "లాంగ్ రేంజ్ వాతావరణ ఫోర్కాస్ట్ మోడల్" ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ మోడల్ వ్యవసాయానికి అవసరమైన వాతావరణ సమాచారం అందించడంలో సహాయపడింది.

**వ్యవసాయ రంగంలో కృషి...** వసంత్ గోవారికర్ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడంలో ప్రధాన పాత్ర పోషించారు. ఆయన రూపొందించిన అగ్రో క్లైమాటిక్ జోన్ మ్యాపింగ్ వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో మరియు నీటి వనరుల సమర్థ వినియోగానికి మార్గదర్శకంగా మారింది.

**జనాభా సమస్యలపై దృష్టి...** జనాభా పెరుగుదల భారత దేశానికి పెద్ద సమస్యగా ఉన్నప్పుడు, గోవారికర్ దీనిపై చేసిన పరిశోధనలు కీలకమయ్యాయి. ఆయన రూపొందించిన డేటా మోడల్స్ ప్రభుత్వానికి ప్రణాళికలు సిద్ధం చేయడంలో సహాయపడ్డాయి.

**అవార్డులు గౌరవాలు...** వసంత్ గోవారికర్ చేసిన కృషి పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందించింది. పద్మశ్రీ అవార్డు (1991): శాస్త్ర సాంకేతిక రంగంలో చేసిన కృషికి భారత ప్రభుత్వం ఈ గౌరవాన్ని ప్రదానం చేసింది. వాతావరణ శాస్త్రంలో గ్లోబల్ అవార్డులు మరియు ఇతర సన్మానాలు అందుకున్నారు.

**వ్యక్తిత్వం సూర్తి...** వసంత్ గోవారికర్ సైన్స్‌ను సమాజానికి చేరువ చేయడంలో నిమగ్నమయ్యారు. ఆయన రాసిన పుస్తకాలు, ప్రాథమిక శాస్త్ర అంశాలపై చేసిన వ్యాసాలు శాస్త్రంపై ఉన్న పాఠశాల విద్యార్థుల ఆసక్తిని పెంచాయి.

**మరణం...** వసంత్ గోవారికర్ 2015 జనవరి 2న కన్నుమూశారు. ఆయన చేసిన విశిష్ట కృషి భారత శాస్త్ర రంగాన్ని మాత్రమే కాదు, ప్రపంచ స్థాయి పరిశోధనలను కూడా ప్రభావితం చేసింది. వసంత్ గోవారికర్ భారత అంతరిక్ష పరిశోధన, వాతావరణ శాస్త్రం, వ్యవసాయ రంగాల్లో నూతన మార్గాలను సృష్టించి, దేశానికి చిరస్మరణీయుడిగా నిలిచారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆయన చూపిన మార్గం భారతదేశ భవిష్యత్ శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలుస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్... 9440595494**

# సేవా నిరతికి ప్రతిరూపం కల్లూరి చంద్రమౌళి - జనవరి 2.. కల్లూరి చంద్రమౌళి వర్ధంతి



భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఎంతో మందికి సూర్తిగా నిలిచిన కల్లూరి చంద్రమౌళి, ఆంధ్రప్రదేశ్ ప్రజల గర్వకారణం. స్వదేశీ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆయన, స్వతంత్ర భారత నిర్మాణానికి తన సేవలతో సహకరించారు. జీవితాంతం ప్రజల సేవ కోసం కృషి చేసిన ఈ మహనీయుని జీవిత విశేషాలను వివరంగా పరిశీలిద్దాం.

**జీవిత ప్రాథమిక విషయాలు...** కల్లూరి చంద్రమౌళి ఆంధ్రప్రదేశ్‌లో ఒక సాధారణ కుటుంబంలో 1898 నవంబర్ 15న జన్మించారు. చిన్నతనంలోనే దేశభక్తి భావాలు కలిగిన వ్యక్తిగా అభివృద్ధి చెందారు. విద్యాభ్యాసం పూర్తి చేసిన అనంతరం, మహాత్మా గాంధీ మార్గదర్శకత్వం ఆయన జీవితానికి పునాదిగా నిలిచింది. గాంధీజీ చూపిన ఆహింసా సిద్ధాంతం, స్వాతంత్ర్య సమర పద్ధతులు చంద్రమౌళి ఆలోచనలకు ప్రేరణగా మారాయి.

**స్వాతంత్ర్య పోరాటంలో పాత్ర...** భారత స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేసిన ప్రముఖ నేతల్లో కల్లూరి చంద్రమౌళి ఒకరు. సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం: చంద్రమౌళి, సైమన్ కమిషన్ భారత ప్రజలకు అవసరం లేదని నిరసన తెలిపారు. ఉప్పు సత్యాగ్రహం: గాంధీజీ పిలుపుతో చంద్రమౌళి ఈ ఉద్యమంలో పాల్గొని ఉప్పు చట్టాలను ఉల్లంఘించారు. విదేశీ వస్త్ర బహిష్కరణ: విదేశీ వస్త్రాల వినియోగాన్ని వ్యతిరేకించి స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించారు. శాసన ఉల్లంఘన ఉద్యమం: స్వాతంత్ర్య సాధన కోసం చట్టాలను ఉల్లంఘించి ప్రజలలో చైతన్యం నింపారు. ఈ ఉద్యమాల కారణంగా ఆయన అనేకసార్లు జైలు శిక్ష అనుభవించారు. తన సంకల్పం క్షీణించకుండా, ప్రతి సారి మరింత దృఢంగా పోరాడారు.

**స్వాతంత్ర్యం అనంతర రాజకీయ జీవితం...** భారత స్వాతంత్ర్యం సాధించిన తర్వాత చంద్రమౌళి రాజకీయాల్లో ప్రవేశించి ప్రజల సేవకు అంకితమయ్యారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశారు. నిరక్షరాస్యతను నివారించేందుకు విద్యా కార్యక్రమాలు చేపట్టారు. హరిజనుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశారు. సంయుక్త మద్రాసు రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ మూడింటిలో మంత్రిపదవి నిర్వహించారు. దేవాదాయ శాఖా మంత్రిగా తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షునిగా పనిచేశారు. సమగ్ర పంచాయితీ రాజ్ చట్టం మొదటిసారి రూపొందించి మద్రాసు శాసన సభలో అమోదింపజేసిన వ్యక్తి. శ్రీశైలం, భద్రాచలం దేవాలయాల జీరో?ద్ధరణ గావించారు.

**భూదాన ఉద్యమంలో పాత్ర...** వినోభా భావే ప్రారంభించిన భూదాన ఉద్యమానికి కల్లూరి చంద్రమౌళి మద్దతు తెలిపారు. తాను స్వంతంగా భూమి దానం చేసి ఇతరులను కూడా భూదానానికి ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని రైతులకు భూమి అందించే ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.

**స్వాతంత్ర్య సైనిక్ సమ్మాన్...** కల్లూరి చంద్రమౌళి చేసిన విశేష సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ఆయనకు "స్వాతంత్ర్య సైనిక్ సమ్మాన్" పురస్కారం అందించింది. ఇది ఆయన త్యాగాలకు గౌరవ సూచకంగా నిలిచింది.

**మరణం...** కల్లూరి చంద్రమౌళి 1992 జనవరి 2న మరణించారు. తన చివరి రోజుల వరకు ప్రజల సేవలోనే ఉంటూ, సమాజానికి అనేక సూర్తిదాయక కార్యక్రమాలు అందించారు. ఆయన మరణించినప్పటికీ, తన సేవా గాథలతో భారతదేశ చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారు.

కల్లూరి చంద్రమౌళి జీవితం త్యాగం, నిబద్ధత, దేశసేవ అసమానం. భారత స్వాతంత్ర్య పోరాటంలో అనేక ఉద్యమాలలో చేసిన కృషి, స్వాతంత్ర్యం తరువాత సామాజిక సేవలో ఆయన చూపిన నిబద్ధత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర ఇవన్నీ భారత చరిత్రకు ఓ వెలుగు రేఖగా నిలిచాయి.

తన ఆదర్శాలతో యువతకు నిరంతరం ప్రేరణనిచ్చే కల్లూరి చంద్రమౌళి వంటి మహనీయుల జీవితం తరతరాలకు సూర్తిగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్... 9440595494**

# త్యాగానికి ప్రతిరూపం బత్తిని మొగిలయ్య - జనవరి 2...బత్తిని మొగిలయ్య గౌడ్ జయంతి




బత్తిని మొగిలయ్య గౌడ్ ఓరు గల్లుకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు. రజాకార్లను ఎదిరించి పోరాడి అమరుడైన వీరుడు. బత్తిని మొగిలయ్య గౌడ్ వరంగల్ తూర్పు కోట నివాసి. తల్లిదండ్రులు బత్తిని చెన్నమ్మ, మల్లయ్యలు, అన్న బత్తిని రామస్వామి గౌడ్... చెన్నమ్మ, మల్లయ్య దంపతుల ఐదవ సంతానంగా ఆ కాలపు దీరుడిగా ఖిల్లా ఓరుగల్లులో పాఠాలు నేర్చుకున్నాడు. మొగి లయ్య కోట బడిలో 4వ తరగతి వరకు చదివాడు. బత్తిని మొగి లయ్య గౌడ్, బత్తిని రామస్వామి గౌడ్ లిద్దరు ఆర్యసమాజ్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవారు. అన్న రామస్వామి, భూపతి కృష?మూర్తి, ఇతర కాంగ్రెస్ వాదులతో కలిసి కాంగ్రెస్, ఆర్య సమాజ్ సమావేశాలకు వెళ్లేవాడు, అన్నదమ్ములు అన్ని విషయాలలో తోడుగా ఉంటూ, గౌడ కుల వృత్తి అయిన తాళ్లు ఎక్కుతూ వ్యవసాయం చేసేవారు. గౌడ్ ల పరిస్థితి చాల దురరంగా ఉండే నాటి పరిస్థితులలో, నిజాం ప్రభువు కల్లు మీద, తాడిచెట్ల మీద పన్నులు వసూలు చేయడాన్ని, పన్నులు కట్టని గౌడులకు విధించే శిక్షలను ఆయన జీరి?ంచుకునే వాడు కాదు. నిజాం పోలీసులన్నా, రజాకార్లన్నా ఆయనకు తీవ్ర వ్యతి రేకత ఉండేది. స్వతంత్ర అభిలాషను విస్తృత పరిచే దిశగా పన్నెండవ జాతీ యాంధ్ర మహాసభలు 1946లో వరంగల్ లోని మడికొండలో జరిగాయి. రహస్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు జాతీయ జెండా ఎగుర వేయాలనేది సభల ఉద్దేశం. నిజాం రాష్ట్రంలో త్రివర? పతాకావిష్కరణ అధికారికంగా నిషేధించ బడింది. జెండా ఎత్తడం అంటే దెబ్బలకు, జైలుశిక్షకు, మరణానికి వెరవ కుండా చేసే సాహసోపేత కార్య క్రమమే. వరంగల్ కోటలో దేశభక్తి ప్రేరితులు అయిన యువకులు బత్తిని రామస్వామి గౌడ్, బత్తిని మొగిలయ్య గౌడ్, సంగరబోయిన కనకయ్య, సంగరబోయిన మల్లయ్య, నరిమెట్ల రామస్వామి, వడ్లకొండ ముత్తయ్య, పోశాల కనుకయ్య, ఆరెల్లి బుచ్చయ్య తదితరులు జెండా వందన కార్య క్రమాలను కోట ప్రజల సమక్షంలో నిర్వహించే వారు. స్టేట్ కాంగ్రెస్, కార్యకర్తలందరికి రహస్యంగా నైనా జెండా ఎగుర వేయాలనే ఆదేశా లిచ్చింది. స్టేట్ కాంగ్రెస్ ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం వరంగల్ లోని చైతన్యం కలిగిన యువకులు, కాంగ్రెస్ నాయకులు, ఆర్యసమాజ్ కార్యకర్తలు వరంగల్ కోటలో జెండా ఎగుర వేసే వారు. 11 ఆగస్టు 1946 ఆదివారం రోజు ఉదయం7.30 గంటలకు వరంగల్ తూర్పు కోటలో జెండా ఎగుర వేయడానికి వరంగల్, హన్మకొండ నుండి వచ్చి, కాంగ్రెస్ నాయకులు యం.యస్. రాజలింగం, టి.హయగ్రీవాచారి, భూపతి కృష?మూర్తి, మడూరి రాజలింగం, బత్తిని సోదరులు కలిసి కార్య క్రమాన్ని నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హయగ్రీవాచారి జెండాను ఎగురవేయగా, త్రివర? పతాకం వందనం చేసి పిల్లలు పెద్ద లంతా జై కొట్టారు. అప్పుడే సుమారు రెండు వందల మంది రజాకార్లు, వారి అనుయాయులు మారణా యుధాలతో ఖాసీం షరీఫ్ అనే రజాకార్ నాయకుని అధ్వ ర్యంలో, జెండా ఎత్తిన నాయకు లను చంపడానికి నిజాం అనుకూల నినాదాలను చేస్తూ జెండా ఎత్తిన ప్రాంతానికి చేరుకున్నారు. ఎగిరిన జెండాను చూసి, కోపం కట్టలు తెంచుకున్న రజాకార్లు, జెండాను దించి తొక్కి, తగలబెట్టి, అంతా కలిసి బత్తిని రామస్వామి గౌడ్ ఇంటి వైపు అరుస్తూ, తిడుతూ వెళ్ళారు. జెండా ఎత్తిన ప్రధాన నాయకులైన హయగ్రీవ చారి, భూపతి కృష?మూర్తి, పంచాయతి హవల్దారు కె.సమ్మయ్య, వెంకట్రాం నర్సయ్య, యం.యస్.రాజలింగం వీరందరూ బత్తిని రామస్వామి ఇంట్లో కూడి, భవిష్యత్తు జెండా వందన కాంగ్రెస్ కార్యక్రమాల గురించి చర్చించు కుంటున్నారు. ఆ ఇంటి చుట్టూ మోహరించిన రజాకార్లు ఇంట్లోకి వెళ్ళి వాళ్లను చంపే ప్రయత్నం చేసారు. లోపల ఉన్న భూపతి కృష?మూర్తి కాంపౌం డ్ కు గొళ్లెం పెట్టగా, రజాకార్లు రాళ్ళతో ఇంట్లోని వాళ్ళ మీద దాడి చేశారు. తలుపులు బద్దలు కొట్టి, జెండా ఎత్తిన నాయకులందరిని చంపాలని చూసారు. జెండా వందన కార్యక్రమంలో పాల్గొన్న మొగిలయ్య, అనంతరం తాళ్లెక్క డానికి తాటి వనానికి వెళ్లాడు. మొగిలయ్య భార్య లచ్చవ్వ 15 రోజుల బాలింత, పురిటి బిడ్డతో మంచంపై ఉంది. మొగిలయ్య భార్య లచ్చవ్వ, తల్లి చెన్నమ్మ ఈ దాడితో భీతిల్లి పోయారు. శని గారం పుల్లయ్య అనే ఆర్యసమాజ్ కార్యకర్త తాటి వనంలో ఉన్న మొగిలయ్యను కలిసి రజాకార్ల దాడి గురించి చెప్పాడు. దాడి గురించి విన్న మొగిలయ్య ఒక్క క్షణం నిశ్చేష్టుడై, మరుక్షణం తన ఇంటివైపు పరుగు తీసాడు. ఆ ఇంట్లో ఉన్న వాళ్లంతా వందల మంది రజాకార్ల చేతుల్లో చనిపోయే ట్టుగా ఉందని భావించి, తన ఇంటి వెనుక దర్వాజా నుండి రజాకార్ల కంటబడకుండ ఇంట్లోకి వెళ్ళి, మెరుపు వేగంతో ఇంటి సూరు లోని పదునైన కత్తిని తీసి, మెరుపులా రజాకార్ల మూకపై పడి యుద్ధం మొదలు పెట్టాడు. ఈ దాడికి నాయకత్వం వహించిన ఖాసీం షరీఫ్ తో సహా, రజాకార్లంతా చీమల పుట్ట చెదిరి నట్లుగా చెదిరి పోయారు. రజాకార్లు తిరిగి మొగిలయ్య పై మూకుమ్మడిగా రెండవ మారు దాడికి పాల్పడ్డారు. రెండవసారీ మొగిలయ్య వారిని తరిమివేశాడు, కానీ మూడవసారి దాడిలో ఖాసీం షరీఫ్ బల్లెంతో మొగిలయ్య వైపు వస్తున్నప్పుడు, మొగిలయ్య తన శత్రువును నరకడానికి తన ఎత్తిన కత్తిని తన ఇంటి ముందు గల పందిరి గుంజల మధ్య చిక్కుకుంది. ఇదే అదనుగా భావించిన షరీఫ్ తన బల్లెంతో మొగిలయ్య గుండెల మీద పొడిచాడు. అలా రజాకార్ల మూకుమ్మడి దాడిలో మొగిలయ్య అమరుడైనాడు. మొగిలయ్యను చంపిన ఖాసీం షరీఫ్ ని అతని అనుయాయులు, తమ భుజాలపై మోస్తూ ఇప్పటి వరంగల్ చౌరస్తాకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అప్పటి వరంగల్ తాలుకా దార్ (కలెక్టర్) అబ్దుల్ మోహిత్ మిల్ ఎదురేగి, హంతకు డైన ఖాసీం షరీఫ్ కు పూలమాల వేసి ఆలింగనం చేసుకున్నాడు. జెండా ఎత్తిన నాయకులకు ప్రాణభిక్ష పెట్టి, త్యాగనిరతి కి ప్రతిరూపంగా నిలిచి, 25 సంవత్సరాల వయస్సులోనే అమరుడైన నిష్కళంక దేశభక్తుడు బత్తిని మొగిలయ్య స్మృతి చిరస్మర ణీయంగా మిగిలి పోవాలని వరంగల్ నడిబొడ్డున గల జె.పి.ఎన్ రోడ్ లో 1954 లో మొగిలయ్య స్మారక భవనాన్ని ప్రజలు ఏర్పాటు చేసారు.


**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్... 9440595494**

## చురకలు
## సంపాదకీయం

# బాలీవుడ్ మూవీని చూసి హడలెత్తిపోతున్న చైనా!

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ నటిస్తూ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న మూవీ 'బాటిల్ ఆఫ్ గల్వాన్'. 'జంజీర్' ఫేమ్ అపూర్వలాఖియా దర్శకుడు. చిత్రాంగద సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ టీజర్‌ను సల్మాన్‌ఖాన్ పుట్టిన రోజు సందర్భంగా టీమ్ విడుదల చేసింది. బీహార్ రెజిమెంట్ 16వ బెటాలియన్‌కు సారథ్యం వహించిన కల్నల్ బి. సంతోష్‌బాబు చైనా ఆర్మీకి వ్యతిరేకంగా చేసిన వీరోచిత పోరాటం ఆధారంగా ఈ మూవీని రూపొందిస్తున్నారు. టీజర్‌కు అనూహ్య స్పందన లభించిన నేపథ్యంలో చైనా అధికారిక మీడియా 'గ్లోబల్ టైమ్స్' తన అక్కసు వెళ్లగక్కింది. చైనాపై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారని గగ్గోలు పెట్టింది. అంతే కాకుండా ఈ సినిమాపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ సినిమా జాతీయవాద మెలో డ్రామా అని ఆరోపించింది. గల్వాన్‌లో జరిగిన ఘర్షణలకు భారత బలగాలే కారణమంటూ తమ దేశాన్ని సమర్ధించుకునే ప్రయత్నం చేసింది. భారత బలగాలు తమ భూభాగంలోకి చొరబడి చైనా సైనికులపై దాడిచేశారంటూ అసత్యాలు వల్లవేసింది. అంతే కాకుండా తమ దేశానికి చెడ్డపేరు తెచ్చేందుకు భారత్ వాస్తవాలను వక్రీకరించి అంతర్జాతయ సమాజాన్ని తప్పుదోవ పట్టించిందంటూ బూటకపు వ్యాఖ్యలు చేసింది. చైనా సార్వభౌమ భూభాగాన్ని రక్షించుకోవాలనే మా సైన్యం ధృఢ సంకల్పాన్ని ఈ చిత్రం కదిలించలేదు' అంటూ చైనా సైనిక నిపుణులు సాంగ్ జొంగ్‌పింగ్ వ్యాఖ్యలను ఈ కథనంలో గ్లోబల్ టైమ్స్ ప్రస్తావించింది. దీనిపై చైనాకు భారత్ గట్టి కైంటర్ ఇచ్చింది. భారత్‌లో భావ వ్యక్తీకరణ స్వేఛ్ఛ ఉందని, తమ భావాలను కథలరూపంలో వ్యక్తపరచడం కూడా ఇందులో భాగమే అంటూ చైనా మీడియాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. 'బాటిల్ ఆఫ్ గల్వాన్' విషయంలో ఎవరికైనా సందేహాలు గానీ, ఆందోళన గానీ ఉంటే స్పష్టత కోసం భారత రక్షణ మంత్రిత్వ శాఖను సంప్రదించొచ్చు. ఈ సినిమా విషయంలో ప్రభుత్వం జోక్యం ఏమీలేదు' అంటూ ఘాటుగా స్పందించింది. ఐదేళ్ల క్రితం 2020 జూన్‌లో భారత్- చైనా సరిహద్దుల్లోని గల్వాన్ ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల మధ్య భీకరమైన ఘరణలు తలెత్తిన విషయం తెలిసిందే. భారత జవాన్లపై చైనా మెరుపు దాడికి దిగడంతో మన దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ వీరోచిత పోరాటంలో తెలంగాణకు చెందిన కల్నల్ బిక్కమల్ల సంతోష్ బాబుతో పాటు మరో 20 మంది సైనికులు వీరమరణం పొందారు. చైనా వైపు కూడా భారీ స్థాయిలో ప్రాణ నష్టం ఉన్నప్పటికీ ఆ లెక్కలని చైనా దాచిపెట్టింది. ఈ పోరాటంలో చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన 1200 వందల మంది పాల్గొన్నారని, వారితో అత్యంత తక్కువ మంది సోల్జర్‌లతో కలిసి సంతోష్‌బాబు వీరోచిత పోరాటం చేసి చైనాని మట్టికరిపించాడట. అదే సంఘటన స్ఫూర్తితో సల్మాన్ ఇప్పుడు 'బాటిల్ ఆఫ్ గల్వాన్'ని నిర్మిస్తుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. టీజర్‌తో సంచలనాలకు తెరలేపిన ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 17న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది.

# బహుముఖ ప్రజ్ఞాశాలి కాకాని చక్రపాణి - జనవరి 2... కాకాని చక్రపాణి వర్ధంతి



ఆధునిక తెలుగు కథ, నవలా సాహిత్యంలో తనదైన శైలిలో ప్రత్యేకతను సంతరించుకున్న రచయిత కాకాని చక్రపాణి. కథ, నవల, పరిశోధన, వ్యాసరచన అన్ని ప్రక్రియలలో అరుదైన, అసమాన ప్రావీణ్యం ఉన్న అతి తక్కువ మంది రచయితలలో కాకాని చక్రపాణి ఒకరు. ఆయన ఎన్నో నవలలు, వందలాది కథలు, విమర్శనా వ్యాసాలు రాశారు. కథలు, నవలలు, చరిత్ర గ్రంథాలు, ఇంగ్లీషు నుండి తెలుగులోకి, తెలుగు నుండి ఇంగ్లీషులోకి అలవోకగా అనువదించారు. మానవతే ప్రధాన ఇతివృత్తంగా... వ్యక్తుల మధ్య స్నేహం, దాంపత్య, కుటుంబ సభ్యుల మధ్య సంబం ధాలు, చక్రపాణి లాగా చిత్రించిన రచయితలు బహు అరుదు. హాస్యం, వ్యంగ్యం, వాస్తవికత, మానవతావాదంతో కూడుకొని ఉంటాయి ఆయన స ృజనాత్మకత రచనలు. ఆధునిక తెలుగు కథ, నవలా సాహిత్యంలో చక్రపాణి పాత్రలు నేల విడిచి సాము చేయక, ఎంతో సుపరిచితాలనిపిస్తాయి. కాకాని చక్రపాణి గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలో 1942, ఏప్రిల్ 26వ తేదీన శ్రీరాములు, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. మంగళ గిరి సి.కె.ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం ముగించి, ఉన్నత విద్యను గుంటూరులో కొనసాగించారు. హైదరాబాద్ లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో సుదీర్ఘ కాలం ఆంగ్ల భాషా బోధకుకులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. తెలుగు నవలా సాహిత్యంపై 'సోమర్సెట్ మామ్ ప్రభావం' అన్న అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి పట్టా పొందారు. రాజశేఖర చరిత్ర, అల్ప జీవి, మైదానం, చివరికి మిగిలేది, అసమర్థుని జీవయాత్ర వంటి గొప్ప తెలుగు నవలల్ని కాకాని చక్రపాణి ఆంగ్లంలోకి అనువదించారు. భారతీయ కథాభారతి అనే గ్రంథంలో కాకాని చక్రపాణి అస్సామీ, ఉర్దూ, ఒడియా, కన్నడం, కశ్మీరీ, కొంకిణి, గుజరాతీ, డోగ్రీ, తమిళం, నేపాలీ, పంజాబీ, బెంగాలీ, భారతీయ ఆంగ్లం, మణిపురి, మరాఠీ, మలయాళం, మైథిలీ, రాజస్థానీ, సంస్కృతం, సింధీ, హిందీ భారతీయ భాషల్లోని ప్రముఖ కథకుల కథలకు తెలుగు అనువాదం చేశారు. పోలీసు పంచాయితీ, పిచ్చివాళ్లు ఇదీ స్నేహమే, గుమ్మటం, శానటోరి యం, సంస్కరణ, ఓ హెన్రీ కానుకలు, ఆపద్బాంధవుడు, తాడుముక్క, నేరం చేసినవాడు, నౌకాయానం, అదుతేం తదితర అనువాద రచనలు వివిధ పత్రికలలో ప్రచురింపజేశారు. వేగుచుక్క, ఏడడుగులు, గోరంత దీపం, నూరు శిశిరాలు ది ఘోస్ట్, నువ్వు నాకొద్దు, నిప్పు, జోధలో శీల పరీక్ష, మహానగరంలో మాఫియా, కాటేసిన అన ృతం, అగ్నితీర్థం తదితర నవలలు రాశారు. థ్రిల్లింత, పతిత పావని, మనిషి, నివురు లాంటి కథా సంపుటాలు వెలువరించారు. రాజశేఖర చరిత్ర, చివరికి మిగిలేది, మైదానం, అల్పజీవి ఇంగ్లీషులోకి అనువాదం చేశారు.ఆయన సిద్ధాంత గ్రంథం ... సాహిత్య ప్రభావం. సాహిత్య ప్రభావపు భిన్నకోణాలపై తెలుగులో వెలువడిన తొలి సిద్ధాంత గ్రంథం. "తెలుగు నవలా సాహిత్యంపై సోమర్‌సెట్ మామ్ ప్రభావం" అన్నఅంశంపై పరిశోధన చేసారు. ఆ పరిశోధనలో భాగంగానే మామ్ రాసిన "ఆఫ్ హ్యూమన్ బాండేజ్" నవలను అనువదించారు. కాకాణి చక్రపాణి, అత్యుత్తమ పరిశోధకులలో ఒకరు. మధ్య యుగ ఆంధ్ర దేశం, గాంధీ అనంతర భారత దేశం, కుతుబ్ షాహీలు వంటి గ్రంథాలకు సహ రచయితగా వ్యవహరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య చరిత్రను అదుతేంగా చెప్పిన గ్రంథం 'గాంధీ అనంతర భారతదేశం'. కుతుబ్ షాహీల గ్రంథంలో 16, 17 శతాబ్దా లలో గోల్కొండ రాజధానిగా ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన కుతుబ్ షాహీ చక్రవర్తుల కాలపు రాజకీయ ఆర్థిక, సాంస్కృతిక వర?చిత్రాన్ని చక్రపాణి అదుతేంగా చిత్రించారు. ఆంధ్రభూమి దినపత్రికలో చాలా సంవత్సారాలు "కథలు - కాకర కాయలు" అనే శీర్షిక నిర్వహిం చారు. క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతూ తమ 75వ యేట 2017, జనవరి 2వ తేదీన మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్... 9440595494**

# విలక్షణ నటుడు తుత్తి సుబ్రహ్మణ్యం - జనవరి 2... ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం జయంతి

తుత్తి పదంతో చిరపరిచితులై, తెలుగు చలనచిత్ర సీమలో ఎ.వి.ఎస్ గా పిలువబడే ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం (జనవరి 2, 1957 - నవంబర్ 8, 2013) తెలుగు సినిమా హాస్యనటుడు, రచయిత, దర్శకులు, నిర్మాత, రచయిత, రాజకీయ నాయకుడు, మిమిక్రీ కళాకారుడు, జర్నలిస్టు, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఎ. వి. ఎస్ గుంటూరు జిల్లా తెనాలిలో 1957, జనవరి 2 న వీర రాఘవయ్య, శివ కామేశ్వరి దంప తులకు జన్మించాడు. వీఎస్ఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశాడు. కాలేజీ రోజుల్లోనే రంగస్థల ప్రవేశం చేశాడు. ఆ కళాశాల లెక్చరర్ నఫీజుద్దీన్ /ఎం.డి.సౌజన్య రాసిన నాటకాల్లో ఏవీఎస్ నటిస్తుండే వాడు. రసమయి సంస్థను రూపొందించి నవరస ప్రదర్శనలు ఏర్పాటు చేశాడు. ఆ తరువాత మిమిక్రీ కళాకారునిగా, పత్రికా రంగంలో మంచి జర్నలిస్టుగా పేరు తెచ్చుకున్నాడు. లలిత కళా సమాఖ్య పేరిట పట్టణానికి చెందిన పలువురు ప్రముఖుల సహకారంతో చిత్ర పరిశ్రమ, కళారంగంలోని మహా మహులతో ప్రదర్శనలు ఏర్పాటు చేసి సత్కారాలు, సన్మా నాలు నిర్వహిస్తుండే వాడు. శారద కళాపీఠం, నాగకళామందిర్ వంటి విఖ్యాత సంస్థలతో పలు నాటక ప్రదర్శనలు ఇప్పించాడు. ఈ క్రమంలో పరిచయమైన దర్శకుడు బాపు "మిస్టర్ పెళ్ళాం" సినిమాలో మంచి పాత్ర ఇచ్చి ప్రోత్సహిం చాడు. మొదటి సినిమాతోనే రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు అందు కున్నాడు. ఆంధ్రజ్యోతిలో పాత్రికే యుడుగా కెరీర్ ప్రారంభించిన ఏవీఎస్ మిస్టర్ పెళ్లాం సినిమా ద్వారా సినీరంగ ప్రవేశం చేశాడు. ఏవీఎస్ నటించిన ఆఖరి చిత్రం పవిత్ర. 19 ఏళ్లలో ఏవీఎస్ 500 చిత్రాల్లో నటించాడు. అంకుల్ సినిమాతో ఆయన నిర్మాతగా కూడా మారాడు. సూపర్ హీరోస్ చిత్రం ద్వారా దర్శకుడుగా మారిన ఏవీఎస్ నాలుగు సినిమాలకు దర్శకత్వం వహించాడు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ మా జనరల్ సెక్రటరీగా మూడు సార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఏవీఎస్‌కు 1980లో ఆశాకిరణ్మయి తో వివాహం జరిగింది. తెనాలిలో స్టేజి కార్యక్రమాల్లో పరిచయం కావడంతో ఆమెను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఎన్టీఆర్ నిర్మించిన 'శ్రీనాథ కవిసార్వభౌముడు'లో నటించి నప్పటికీ 'మిస్టర్ పెళ్లాం' ముందుగా విడుదలైంది. ఈ రెండు సినిమా లకూ బాపు దర్శకత్వం వహించడం విశేషం. తన మొదటి చిత్రానికే నంది అవార్డు సొంతం చేసు కున్నాడు. 'మిస్టర్ పెళ్లాం' ఘన విజయం సాధించడంతో ఏవీఎస్ నట జీవితం అనుకోని మలుపు తిరిగింది. హాస్య నటుడిగా, క్యారెక్టర్ యాక్టర్‌గా సుమారు 500 సినిమాల్లో నటించారు. 'మిస్టర్ పెళ్లాం'లో 'తుత్తి' పదంతో ఆయన పేరు తెలుగు ప్రేక్షకులకు చిరపరిచితమైంది. 'సూపర్ హీరోస్', 'ఓరి నీ ప్రేమ బంగారం కానూ', 'రూమ్ మేట్స్', 'అంకుల్', 'కోతిమూక' సినిమాలకు ఆయన దర్శకత్వం వహించాడు. కొన్ని సినిమాల్లో ప్రతినాయక తరహా పాత్రల్లోనూ మెప్పించాడు. మాయలోడు, మేడమ్, ఆమె, శభమస్తు, ఓహో నా పెళ్లంట, ధర్మ చక్రం, మా విడాకులు 'శుభలగ్నం', 'యమలీల', 'సమరసింహారెడ్డి', 'ఇంద్ర', 'కంటే కూతుర్నే కను', 'వినోదం' వంటి అనేక సినిమాల్లో తనదైన శైలిలో నటించి ప్రేక్షక జన హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు. టీవీ నటుడిగా, వ్యాఖ్యాతగానూ రాణించాడు. ఎ.వి.ఎస్ తన నటన ప్రతిభకు పలు ప్రభుత్వ, ప్రైవేట్ బహుమతులు అందుకున్నాడు. అంకుల్ , ఓరి నీ ప్రేమ బంగారం కానూ అనే రెండు సినిమాలు నిర్మించాడు. చిన్ననాడు కలిసి చదువుకున్న మిత్రులను ,చదువు చెప్పిన గురువులను, నటనకు ఓనమాలు దిద్దిన మార్గదర్శకులను ఆయన ప్రతి వేదికపైనా స్మరించుకునే వాడు. తెనాలికి రాష్ట్రానికి కళల రాజధానిగా గుర్తింపు తేవాలని ఆయన తపన పడ్డాడు. ఎన్నో వేదికలపై తీర్మానాలు చేసి ప్రభు త్వానికి పంపాడు. రాష్ట్రంలో నగరాలకే పరిమితమైన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ పండుగను అత్యంత వైభవంగా తెనాలిలో జరిపేందుకు ఏవీఎస్ చేసిన క ృషి మరువలేనిది. చలన చిత్ర పరిశ్రమకు చెందిన ఉద్దండులను రప్పించి ఆంధ్రా ప్యారిస్ గొప్పతనాన్ని చాటాడు. కళాతపస్వి కె.విశ్వనాథ్, నటులు మురళీ మోహన్ తదితరులకు బొల్లిముంత శివరామకృష? స్మారక కళా పురస్కారాన్ని అంద జేయడంలో భాగస్వామి అయి నాడు. రంగస్థల నటునిగా, మిమిక్రీ కళాకారునిగా తన జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలను చవిచూసిన ఏవీఎస్ కళాకారులను ప్రోత్స హిస్తూ ముందుకు నడిపించాడు. వివేకా విద్యా సంస్థలు, గ్లోబల్ ఆసుపత్రితో కలిసి రెండుసార్లు మెగా వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి ఉచిత వైద్య సేవలు అందచేశాడు. పట్టణంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని కలలు కన్నాడు. 'తుత్తి' మ్యానరిజం చేసిన, ఘటో త్కచుడు సినిమాలో 'రంగుపడుద్ది', శుభలగ్నం సినిమాలో 'గాలి కన పడుతుందా' వంటి డైలాగులతో ఆయన ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యాడు. తెనాలిలో ఉదయం పత్రికలో రిపోర్టరుగా చేరాడు. ఆ తరువాత ఒంగోలులో స్టాఫ్ రిపోర్టర్‌గా పని చేశాడు. విజయవాడలో ఆంధ్ర జ్యోతి పత్రికలో సబ్ ఎడిటర్‌గా, ఇన్‌చార్జిగా పనిచేసే దశలో చిత్ర పరిశ్రమకు వెళ్లాడు. అదే ఆయనకు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. దాదాపు 500 సినిమాల్లో నటించి హాస్యనటుడిగా పేరు సంపాదించాడు. నిర్మాతగా అంకుల్, దర్శకు నిగా సూపర్ హీరోస్, కోతిమూకలు సినిమాలు నిర్మించాడు. పౌరాణిక సినిమాల్లో శకుని, నారదుని పాత్రల్లోనూ నటించాడు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కార్యదర్శిగా పని చేశాడు. సినీనటుడు బ్రహ్మానందం ఆయన మంచి స్నేహితులు. ఆయన స్థాయికి చేరుకోవాలని లక్ష్యం ఉండేదని, నటుడు కమలహాసన్,



కమేడియన్ నగేష్ అంటే తనకు ఇష్టమని పలు సందరాల్లో ఏవీఎస్ చెపుతుండేవాడు. చిన్నబ్బాయి, దాసన్నా , బ్రహ్మ లోకం టు యమలోకం వయా భూలోకం, పవిత్ర , ఆలస్యం అమ ృతం, దేనికైనా రేడీ లక్కీ, తూనీగ తూనీగ, శుభప్రదం, ఝుమ్మంది నాదం, ఆలస్యం అమ ృతం, బెండు అప్పారావు, కింగ్ యమగోల మళ్ళీ మొదలైంది, మధుమాసం, గొడవ, బంగారం, శ్రీరామదాసు, జై చిరంజీవ, మహానంది, వీరి వీరి గుమ్మడి పండు, రాధా గోపాళం, సంక్రాంతి, అదిరిందయ్యా చంద్రం, శివశంకర్, వెంకీ, దొంగ దొంగది, ఆయుధం, గంగోత్రి, శివమణి, విజయం, ఎంత బావుందో, ముత్యం, ఆవారాగాడు, జాబిలమ్మ పెళ్ళి తదితర చిత్రాలలో విభిన్న పాత్రలలో రాణించాడు. మొదటి సినిమా మిస్టర్ పెళ్ళాం (1993) లో నంది ఉత్తమ హాస్య నటుడు, కోతి మూక చిత్రానికి ఉత్తమ నంది ఉత్తమ కథా రచయితగా, అంకుల్ చిత్రానికి ఉత్తమ నంది ఉత్తమ సహాయ నటులుగా పురస్కారాలు అందు కున్నాడు. పలు సాంస్కృతిక సంఘాల నుంచి అనేక అవార్డులు, ఘన సన్మానాలు పొందాడు. 2008లో ఆయన కుమార్తె దానం చేయడంవల్ల కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స జరిగింది. ప్రాణా పాయం నుంచి బయటపడ్డాక, తిరిగి కోలుకుని, పలు చిత్రాల్లో నటించాడు. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశాడు. రాజకీయ రంగంపైనా ఆసక్తి ఉండటంతో ఏవీఎస్ చాలాకాలంగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించారు. ఎన్నికల సమయంలో టిడిపి తరఫున ప్రచార సభల్లో చురుగ్గా పాల్గొన్నాడు. పార్టీ బలోపేత ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. తెనాలి నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలనే కోరిక తీరకుండానే వెళ్లిపోయాడు. కాలేయం వ్యాధి మళ్ళీ ముదర దంతో మణికొండలోని తన కుమారుడు ప్రదీప్ నివాసంలో 2013, నవంబరు 8 వ తేదీ రాత్రి కన్ను మూశాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్... 9440595494**

# హరికథా పితామహుడు ఆదిభట్ల - జనవరి 2... ఆదిభట్ల నారాయణదాసు వర్ధంతి



తెలుగువారి కళాసాహిత్య సంగీత చరిత్రలో సువరా?ధ్యాయాన్ని స ృష్టించిన అపురూప కళారూపం హరికథ. కేవలం ఒక్క కళాకారుడు సంగీత, సాహిత్య, న ృత్య, అభినయ కళాభినివేశంతో మ ృదంగం, వయోలిన్ వాద్య సహకారంతో శ్రోతలను ఆధ్యాత్మిక, కళాసాగరంలో ఓలలాడించే కళారూప స ృష్టి హరికథ. సంగీతం, సాహిత్యం మరియు న ృత్యాల మేళవింపుతో హరికథ ప్రక్రియని స ృజించి 'హరికథా పితామహులుగా, కథావాగ్గేయకారులు'గా ప్రఖ్యాతిగాంచారు ఆదిభట్ల నారాయణదాసు. ఆయన ప్రాచీన వాగ్గేయకారుల కోవకు చెందినవారు. కవిత్వం, సంగీతం, నాట్యం అనే మూడు రంగాలలోనూ తనకున్న ప్రతిభను జోడించి నారాయణదాసు హరికథ అనే కళను అత్యున్నత శిఖరాలకు చేర్చారు. మూడింటి కలయికకూ భక్తి అనే భావం ప్రాణంగా హరికథలు రచన చేసి, తెలుగు నాటనే కాక ఇతర రాష్ట్రాలలో కూడా హరికథా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలను పొందిన కళాకారుడాయన. హరికథ' అనే పేరువింటే నారాయణదాసు, నారాయణదాసుగారు పేరువింటే 'హరికథ' తెలుగు రాష్ట్రములలో వెంటనే సూరిస్తాయి. నారాయణదాసుగారు జగత్ప్రసిద్ధులైన హరికథ పితామహులు, కారణ జన్ములు, విద్వత్కవీంద్రులు, భక్తాగ్రణ్యులు. తాము జీవితంలో భక్తినీ, రక్తినీ, ముక్తినీ పుష్కలంగా పొంది తమను దర్శించిన వారికీ, విన్నవారికీ, శుశ్రూష ఒనర్చినవారికీ వాటిని ప్రసాదించిన మహానుభావులు. వేదశాస్త్ర పురాణేతిహాసాదులలోని సర్వసారజ్ఞులు. సంగీత, సాహిత్య, కవితా, న ృత్య వాద్యములలో అసమాన ప్రజ్ఞాధురీణులు, కళాప్రపూరు?లు, సర్వస్వతంత్రులు. శృంగారరస భరితులు, సరస్వతీ అంశ సంభవులు, గాన గంధర్వులు. హరికథారచనకు, ప్రచారానికి మార్గదర్శకులు. పంచముఖి, షణ్ముఖివంటి అసాధ్యములైన తాళములలో రచనలుచేసి, గానంచేసి విద్వాంసుల మన్ననలు పొందిన ఘనవిద్వాంసులు. సహజ పాండిత్య మండితులై సంగీతము, సాహిత్యము, నాట్యము, పాత్రాభినయము, కవిత్వము, వేదాంతము, వ్యాకరణము, జ్యోతిష్యము, ఆయుర్వేదము ఆది విద్యలలోబీ సంస్కృతము, ఆంధ్రము, హిందీ, ఉర్దూ, పారసీకము, అరబ్బీ భాషలయందు అసమానమైన పాండిత్యమును సంపాదించారు. తారకం, హరికథామ ృతం అనే సంస్కృత కావ్యాలను రచించి జర్మను పండితుల మెప్పు పొందారు. ఎళీళీగ్వేదాన్ని స్వర సహింతంగా అచ్చ తెనుగు లోనికి అనువదించి వేదంలోని విజ్ఞానాన్నీ, మంత్రమహిమని తెలుగువారికి తెలియచేసారు. ఆంగ్లభాషనుండి వివిధ కవుల రచనలు కొన్ని కొన్నిటిని విశ్లేషించి షేక్స్పియర్ నాటక రంగములోని ఘట్టములను హ ృద్యముగా తెలుగులోకి అనువదించారు. ఆయన గాత్ర నిస్వనంలో మైకు, లౌడ్ స్పీకర్లు సహజంగానే అమరి ఉన్నాయంటారు. కంఠం ఎత్తిపాడితే అయిదువేల శ్రోతలకైనప్పటికీ అవలీలగా అందే గాత్ర సౌలభ్యం ఉండేదట. శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగష్టు 31న ఆంధ్రప్రదేశ్ లోని నాటి పార్వతీపుర సమీప అజ్జాడ అనే గ్రామంలో (ప్రస్తుతం విజయనగరం జిల్లా) వేంకటచయన, లక్ష్మీనరసమాంబలకు జన్మించారు. ఆయన అసలు పేరు సూర్య నారాయణ. హరికథకుడిగా ప్రసిద్ధి చెందాక ఆయన నారాయణ దాసుగా మార్చుకున్నారు. ఏకసంధాగ్రహిగా, చిరు ప్రాయంలోనే పద్యాలు, శ్లోకాలు విని కంఠస్థం చేసేవారు. కేవలం ఐదేళ్ళ వయసులో నే భాగవతంలోని పద్యాలు ఎన్నో చెప్పేవారట. హరికథ అంటే ఏమిటో తెలియని కాలంలో తెలుగు రాష్ట్రములలో దాన్ని రుచి చూపడమేకాక పలువురికి ఉపదేశించిన మహోపా ధ్యాయులు. కవిత్వం చెప్పే నైపుణ్యంకూడా ఉండేది. పోతన భాగవతము వలన ప్రభావితులై, ఎన్నో హరికథలను రచించారు. కథాకాలక్షేపము విలక్షణ మైనది. స్వవిరచిత కథతో, కవిత్వము, పాటలతో పామరులను సైతం చమత్కారమగు మాటలతోను మెప్పించేవారట. మైసూరు మహారాజు దర్బారులో తన వీణావాద్య కౌశల్యంచే మహారాజు మెప్పుపొంది సన్మానాలు అందుకొన్నారు. మహారాజు గాత్రాన్ని ఫోనో గ్రాముద్వారా రికార్డు చేయించుకొని తరచూ వినేవారట. విజయరామ గాన కళాశాల ప్రథమ ప్రధానాచార్య (1919లో) పదవిలో 17 ఏళ్లు పని చేశారు. జానకీశపథము, రుక్మిణీ కళ్యాణము, గజేంద్ర మోక్షము, ప్రహ్లాదచరిత్ర, ధ్రువోపాఖ్యానము, మార్కండేయోపాఖ్యానము, భీష్మ చరిత్రము, సావిత్రీ చరిత్రము, యదార్థ రామాయణము మున్నగు హరికథలు, హరికథలు రచించారు. పెక్కు శతకములను (శ్రీరామచంద్రశతకము, కాశీ శతకము), కావ్యములను (ఉమర్ ఖయాం, బాటసారి), జగజ్జ్యోతి అనే వేదాంత గ్రంథమును, తారకమను శ ృంగార ప్రబంధమును, 'నవరసతరంగిణి' అను సంగీతశాస్త్ర గ్రం థమును రచించినారు. భారత కోకిల' సరోజినీదేవి నాయుడు, 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాకూర్, సుప్రసిద్ధ గాయనీమణి జానకిబాయీ, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష?న్, వంటి మహనీయుల ప్రశంసలనందుకొన్న ప్రతిభాశాలి. ఆయన రచించిన 'జానకీ శపథం' (ఉత్తర రామచరిత్ర) హరికథ ఒక సంగీత కళాఖండం. అందులో ఆయన పూర్వాంగ, ఉత్తరాంగములకు చెందిన 35 రాగాలను తీసి, వాటిలో కీర్తనలు వ్రాసారు. ఆ కీర్తనలు గానం చెయ్యడం సామాన్య సంగీత కళాకారులకు కష్ట సాధ్యం. కలకత్తానుండి కన్యాకుమారి వరకు దాసు దేశ పర్యటనలు చేసేవారు. చిన్న గ్రామాలు, పట్టణములు, సంస్థలు విద్వత్సభలలో, దేవాలయాలలో, రాజ దర్బారులలో, అంతఃపురాలలో దాసుగారు చేసిన హరికథా కార్యక్రమాలు వేలకువేలు ఉన్నాయి. సామాన్యులు మొదలుకొని ప్రతిభావంతులు, అష్టావధాన శతావధానులు చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, కాశీ కృషమాచార్యులు, జంధ్యాల పాపయ్యశాస్త్రి, సర్వేపెల్లి రాధాకృష (రాష్ట్రపతి)... ఒక్క రేమిటి అన్ని వర్గాల వారు వేలాద దాసుగారి హరికథా గానానికి, కవితాశక్తికి, సంగీత - లయల పాండిత్యానికి, ముగ్ధులై ఆనందిచేవారట. సుమారు ఆరున్నర దశాబ్దాల సంగీత, సాహిత్య, హరికథా కళా ప్రస్థానంలో ఆయన అందుకోని సన్మానం లేదేమో.

రాజ సన్మానాలూ, పౌర సన్మానాలూ, బిరుదు ప్రదానాలూ, గజారోహణలు, సువర? ఘంటాకంకణ ధారణలూ, గండపెండేర ధారణలూ ఇలా ఎన్నెన్నో గౌరవాలు ఆయనకు లభించాయి. దైవ సంకల్పమో, యాద ృఛికేమో గాని, త్యాగరాజు మరణించిన తిథి పుష్య బహుళ పంచమినాడే, 1945 జనవరి 2న, నారాయణ దాసు దేహా న్ని వదలి వెళ్లడం విశేషం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్... 9440595494**

# కూటమి కట్టి.. వాగులు లూటీ చేసి

సిరిసిల్ల : జిల్లాలో స్థానిక అవసరాలకు మానేరు, మూలవాగుల్లో రెవెన్యూశాఖ వే బిల్లుల ద్వారా ఇసుక అనుమతులు ఇస్తున్నారు. జారీ చేసిన రోజు మధ్యాహ్నంలోపే ఇసుక తవ్వకాలు.. తరలింపునకు అవకాశం. వే బిల్లు జారీ వరకే రెవెన్యూ అధికారుల పని. ఇక గ్రామాల్లో కూటమిగా మారిన రవాణాదారుల ఇష్టారాజ్యం. వాగుల నుంచి ఇసుక తరలిస్తుండగా సమీపంలోని పంట పొలాల్లో పైపులైన్లు.. విద్యుత్తు మోటార్లు.. తీగలు దెబ్బతింటున్నాయి. వే బిల్లు గడువు ముగిసేలోపు ఎక్కువ మొత్తంలో తరలించాలని ఇళ్ల మధ్యలో నుంచి ఇసుక ట్రాక్టర్లను అతివేగంగా నడపంతో ప్రమాదాలు జరగడంతోపాటు రహదారులు శిథిలమవుతున్నాయి.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలో నిర్మాణ రంగం ఊపందుకుంది. మానేరు, మూలవాగుల్లోని క్వారీల్లో తవ్వకాలపై కనీస నిబంధనలు పాటించడంలేదు. వేబిల్లులు జారీ చేసిన రోజున పగలు.. మిగతా రోజుల్లో రాత్రిళ్లు తవ్వకాలు జరుపుతారు. ఈ పరిస్థితి తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వేములవాడ, కోనరావుపేట మండలాల్లో ఎక్కువగా ఉంది. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్ ఇసుకక్వారీ నుంచి వెళ్తున్న ట్రాక్టర్లతో చుట్టుపక్కల కాలనీవాసులు ట్రాక్టర్ల వేగం.. దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో ఇసుక ట్రాక్టర్లతో తమ పొలాల్లోని సాగునీటి పైపులు, విద్యుత్తు వైర్లు దెబ్బతింటున్నాయని ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అలాగే కోనరావుపేట మండలం కనగర్తి, వేములవాడ మండలం మల్లారంలోనూ ఇదే పరిస్థితి.

మూలవాగులో ఈ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలతో సమీపంలోని పంచాయతీల మంచినీటి పథకాలు, వ్యవసాయ బావుల్లోని నీరు అడుగంటి పోయి ఫిబ్రవరి నుంచే చుట్టుపక్కల వ్యవసాయ బావుల్లో నీటి ఎద్దడి ఏర్పడుతుందని తవ్వకాలను వ్యతిరేకిస్తున్నారు.

వేములవాడ శివారులో మహాలక్ష్మి, తిప్పాపూర్ పెద్దమ్మ ఆలయాల సమీపంలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇళ్ల మధ్య నుంచి వెళ్తున్న వాహనాల శబ్దాలకు



నిద్రపట్టడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

ముస్తాబాద్ మండలం అవునూరు, తుర్కపల్లి మధ్యలో క్వారీ నుంచి ఇసుక రవాణాకోసం చుట్టూ ఉన్న పొలాలకు ఇబ్బందులు ఎదురవుతాయని ఇసుక రవాణాదారులంతా కలిసి దారికి అవసరమైన స్థలం కొనుగోలు చేశారు.

**చెక్‌డ్యాంలకు శాపం**

మానేరు, మూలవాగుపై 24 చెక్‌డ్యాంలను నిర్మించారు. పరిసరాల్లో నిర్ణీత దూరం మేరకు ఇసుక తవ్వకాలు నిషేధం. తవ్వకాలతో ఖాళీ అయిన ప్రాంతంలో వరద ప్రవాహ సమయంలో భారీగా మేటలు వేసే అవకాశం ఉంది. ఇది దిగువన ఉన్న చెక్‌డ్యాంపై ఒత్తిడిని పెంచుతుంది. దీంతో చెక్‌డ్యాం కొట్టుకుపోయే అవకాశం ఉంటుంది. ఇక్కడ పేరుకే అనుమతి ఉన్న క్వారీల నుంచి అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతోంది. రాత్రి 12 గంటల నుంచి తెల్లవారే వరకు తవ్వకాలు నిరాటంకంగా కొనసాగుతాయి. దీంతో రహదారులు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి.

# విద్యుత్తు పొదుపన్నదే లేదు!

ఇల్లెందు : రెండేళ్లుగా పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో పాలన గాడితప్పింది. ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యల్లో వీధి దీపాలు, నీటి సమస్యలు అధికంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల దీపాలు 24 గంటలూ వెలుగుతున్నాయి. డీపీ సిస్టమ్ బోర్ల ద్వారా నీటి సరఫరాకు ఓ సమయం అంటూ లేకపోవడంతో ఇష్టానుసారంగా మోటార్లను ఆన్ చేస్తునారు. అవసరం తీరిన తర్వాత వాటిని బంద్ చేయటమే విస్మరిస్తున్నారు. ఫలితంగా విద్యుత్తు దుబారా అవుతుండటంతో పంచాయతీ ఖజానాపై భారం పడుతోంది.

**నూతన సర్పంచులు దృష్టి సారిస్తే..**

పలు పంచాయతీల్లో దీపాలకు ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయించాల్సి ఉంది. కొన్ని చోట్ల ఉన్నప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నిత్య వెలుగులతో పెట్టిన ముణ్నాళ్లకే మొరాయిస్తున్నాయి. డీపీ సిస్టమ్ బోర్ల నిర్వహణలో కూడా సమయపాలన లేదు. ఇందుకోసం ఉదయం, సాయంత్రం సమయం కేటాయించాలి. ఆపరేటర్‌ను నియమిస్తే ఒకవైపు విద్యుత్తు బిల్లులు, మరోవైపు బోరు మోటార్ల మరమ్మతులు తగ్గి పంచాయతీ ఖజనాపై భారం తగ్గుతుంది. ఈ ప్రధాన సమస్యలపై నూతన సర్పంచులు దృష్టి సారించాల్సి ఉంది.

వీధి దీపాలు, డీపీ బోర్ల సర్వీస్‌లకు సంబంధించి విద్యుత్తు బిల్లులు భారీగానే బకాయిలు ఉన్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. నూతన పాలకవర్గాలు ఏర్పాటు కావడంతో పంచాయతీలకు కూడా నిధులు వచ్చే అవకాశం ఉన్నందున బిల్లులు వస్తాయని ఆశిస్తున్నాం. మహేందర్, ఎస్‌ఈ, భద్రాద్రి కొత్తగూడెం

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు

ధర్మారం : మండలంలోని నందిమేడారానికి చెందిన లబ్ధిదారు శంకరమ్మ ఇల్లు ఇది. స్లాబ్ నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకోగా కొన్ని రోజులుగా ఇసుక లేక స్లాబ్ ఆగిపోయింది. ఎవరిని సంప్రదించినా ఇసుక అందుబాటులో లేకపోవడంతో చేసేదేమీ లేక ఎదురు చూస్తున్నారు. ఇలా ఒక్కరే కాదు చాలా మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులు ఇసుక లేక ఆగిపోయాయి. పథకం ప్రారంభం నుంచి లబ్ధిదారులకు అవసరమైనంత ఇసుక లభ్యమయ్యేలా చొరవ చూపిన అధికారులు.. ప్రస్తుత సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పలు చోట్ల ఇసుక కష్టాలు నెలకొన్నాయి. వివిధ దశల్లోని ఇళ్లకు ఇసుక లభించక పనులు నెమ్మదిస్తున్నాయి. దీంతో లబ్ధిదారులు ఇసుక కోసం అవస్థలు పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యే వరకు ఆసక్తిగా ఉన్న లబ్ధిదారులు తీరా మంజూరయ్యాక పనులు ప్రారంభించడం లేదు. జిల్లాలో ముగ్గు పోయాల్సినవి ఇంకా 478 ఇళ్లు ఉన్నాయి. కొందరు కట్టరాయి దశ(ప్లింత్ బీమ్) బిల్లు వచ్చాక పనుల జోలికి వెళ్లడం లేదు. దీంతో పంచాయతీ కార్యదర్శులు, గృహనిర్మాణశాఖ అధికారులు లబ్ధిదారులను కలిసి పనులు చేయాలని సూచిస్తున్నా ఆశించిన ప్రగతి కనిపించడం లేదు.

# కొత్త ఏడాదిలోనైనా.. మారేనా..!



హుజూర్‌నగర్ : సీఎంఆర్ సేకరణ ఈ ఏడాది ఒడుదొడుకుల మధ్య కొనసాగింది. తాజాగా వానాకాలం ధాన్యాన్ని కూడా ఇటీవలే మిల్లులకు కేటాయించారు. తీసుకున్న ధాన్యం సకాలంలో ఇవ్వక ఈ సంవత్సరం కొందరు మిల్లర్లు కేసులపాలై అప్రతిష్ఠ మూటగట్టుకున్నారు. నూతన సంవత్సరంలోనైనా అన్ని సమస్యలను అధిగమించి లక్ష్యాలను పూర్తి చేస్తారన్న విశ్వాసంతో అధికారులు ఉన్నారు. సీఎంఆర్ ధాన్యం తీసుకుని ఇవ్వని మిల్లర్లను అధికారులు బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. వారికి కొంతకాలంగా ధాన్యం కేటాయించడం లేదు. మరికొందరు పేర్లు, ఊర్లు మార్చి పాత మిల్లులను లీజుకు తీసుకుని కేటాయింపులు చేసుకున్నారు. పూర్తిగా బ్లాక్ లిస్ట్‌లో ఉండి ధాన్యం కేటాయింపులు లేని మిల్లర్లను ఆదుకోవాలని రైస్‌మిల్లర్స్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉన్న బకాయిలలో 25 శాతం అన్ని రకాల పెనాల్టీలతో చెల్లిస్తే కేటాయింపులు చేయాలని ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. 2022–23 యాసంగి ధాన్యం మిల్లులకు ఇచ్చిన తరువాత వివిధ కారణాలతో ప్రభుత్వం సీఎంఆర్ చేయించకుండా ఆ ధాన్యాన్ని వేలం వేసింది. అలా 66 మంది మిల్లర్ల వద్ద ధాన్యం ఉండిపోయింది. ఆ ధాన్యాన్ని వేలంలో పాడిన గుత్తేదారుకు ఇవ్వాలని ఎన్ని నోటీసులు ఇచ్చినా మిల్లర్లు స్పందించలేదు. అందులో 8 మందిపై కేసులు నమోదయ్యాయి. 8 మంది నుంచి రావాల్సిన ధాన్యం ఖరీదు రూ.273 కోట్లు. జిల్లాలోని మిల్లర్లు 2019–20 నుంచి 2024–25 వరకు గన్నీ సంచులు తిరిగి ఇవ్వడం లేదు. మిల్లుల నుంచి దాదాపు 7 నుంచి 8 కోట్ల గన్నీ సంచులు రావాల్సి ఉంది. వీటిని రాబట్టేందుకు ప్రభుత్వం ఇటీవలే మిల్లర్లకు నోటీసులు జారీ చేసింది. ఎవరెవరు ఎంత బాకీ ఉన్నారనే లెక్కలు తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి రేషన్ దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్నారు. సన్నబియ్యం వచ్చే సమయానికి ఉమ్మడి జిల్లాలో రేషన్ దుకాణాలలో, గోదాములలో దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. వాటిని వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 9 నెలల తరువాత వాటికి మోక్షం లభించి కొత్త సంవత్సరంలో వేలం వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# 'పురా'యత్తం




సంగారెడ్డి: పుర ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పురపాలికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అధికారులు సేకరిస్తున్నారు. ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు అందడంతో ఆ దిశగా ఎన్నికల సంఘం అడుగులు వేస్తోంది. లోక్‌సభ ఎన్నికల జాబితా ప్రకారం ఓటర్ల వివరాలను సేకరించారు. తాజాగా పోలింగ్ కేంద్రాల సమాచారం, వసతుల వివరాలు పురపాలిక శాఖ నుంచి తీసుకున్నారు. పునర్విభజన చేసిన వార్డుల వారీ ఓటర్ల జాబితాలు రూపొందించాలని ఆదేశాలు అందాయి.

**జహీరాబాద్‌పై సందిగ్ధం**

జహీరాబాద్‌కు సంబంధించి సమీపంలోని గ్రామాలను విలీనం చేయడంపై ఆయా గ్రామాల ప్రజలు కోర్టుకెళ్లారు. గతంలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. రెండు దఫాలుగా ఎన్నికలు జరగలేదు.

**ముఖ్యాంశాలు**

ఉమ్మడి మెదక్ జిల్లాలో 20 పురపాలికలున్నాయి

2025 జనవరి 25 నుంచి పురపాలక సంఘాల పాలకవర్గాల గడువు ముగిసింది. సిద్దిపేట బల్దియాకు 2026 ఏప్రిల్ వరకు గడువు ఉంది. ః జహీరాబాద్ సంబంధించి కోర్టు కేసుల నుంచి బయటపడితే ఈసారి పట్టణంలో ఎన్నికలు జరుగుతాయి.

పదేళ్ల పాటు రిజర్వేషన్లు అమల్లో ఉంటాయని భారాస ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీ ఎన్నికల మాదిరి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మార్చే అవకాశం కనిపిస్తోంది.

పార్టీల గుర్తులపై పోలింగ్ ఉంటుంది.

**ప్రధాన పార్టీల గురి**

పురపాలికల్లో పాగా వేసేందుకు ప్రధాన పార్టీలు ముందు నుంచే గురిపెట్టాయి. ఇప్పటికే కాంగ్రెస్ ఓ అడుగేసి సంగారెడ్డి పురపాలికకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ అభ్యర్థులను ప్రకటించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ బల్దియాలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇటీవల సిద్దిపేట జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ విచ్చేసి వ్యూహాలపై శ్రేణులకు సూచనలు చేశారు. భారాసలో ముఖ్య నాయకులతో మాజీ మంత్రి హరీశ్‌రావు అంతర్గతంగా చర్చిస్తున్నారు. భాజపాలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జిల్లాల అధ్యక్షులు సైతం తమకు బలమున్న పట్టణాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.

# పైసలు ఊరికినే పోవు!

కరీంనగర్ : మీ క్రెడిట్ కార్డు లిమిట్‌ను పెంచుతామని కరీంనగర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి కాల్ వచ్చింది. ట్రూకాలర్‌లోనూ అతనికి ఖాతా ఉన్న బ్యాంక్ పేరు రావడంతో నమ్మేశాడు. అపరిచిత వ్యక్తి ఓ వైపు కాల్ మాట్లాడుతూనే మరో వైపు చరవాణి వాట్సాప్‌నకు ఒక లింక్ పంపాడు. అందులోని కొన్నింటిని సెలెక్ట్ చేయమని చెబుతుండటంతో బాధితుడు అలాగే చేశాడు. తీరా ఫోన్ పెట్టేసిన కొద్దిసేపటికే తన ఖాతాలో ఉన్న రూ.82 వేలు హుష్‌కాకి అయ్యాయి. రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెడుకున్న సొమ్ము పరులపాలవడంతో రోడ్డుమీదే బోరుమన్నాడు.

కరీంనగర్ టవర్ సర్కిల్‌లోని చిరువ్యాపారి రూ.2 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. రోజుకు అరగంట పాటు పార్ట్‌టైం జాబ్ చేసుకోవచ్చని ఓ నకిలీ ట్రేడ్ కంపెనీ పేరిట వచ్చిన ఆఫర్‌కు ఆయన ఆకర్షితుడయ్యాడు. ఇన్‌స్టాగ్రామ్‌ను లైక్ చేసినందుకు మొదట రూ.150 పంపారు. తరువాత మీరు జాక్‌పాట్ కొట్టారని.. మరో లింక్ పంపారు. 22 బొమ్మల టాస్క్‌లను పూర్తి చేస్తే ఒక్కోదానికి రూ.50 చొప్పున ఇస్తామనడంతో చెప్పినట్లు చేశాడు. దీంతో రూ.1100 పంపారు. ఇలా కొంత నగదు ఖాతాలో పడటంతో నేరగాళ్లు అడిగినంత పెట్టుబడి పెట్టాడు. మూడింతల మొత్తం వస్తుందని ఆశపడిన అతనికి ఫోన్ స్విఛాఫ్ రూపంలో సమాధానమొచ్చింది.

రోజుకు ఏడుగురు...

ఒక్క కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో రోజులో సగటున ఏడుగురు సైబర్ మోసాల బారిన పడుతున్నారు. మూడేళ్ల కిందటితో పోలిస్తే ఈ సంఖ్య రెండింతలైంది. 2023లో రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు మోసపోయామని నేషనల్ సైబర్ రిపోర్టింగ్ ప్లాట్‌ఫామ్(ఎన్‌సీఆర్‌పీ)కు ఫిర్యాదు చేసేవారు. కానీ 2025లో జిల్లాలో డిసెంబరు 26వ తేదీ నాటికి 2,437 మంది పలురకాలుగా మోసపోయామనే ఫిర్యాదును సంబంధిత వెబ్‌సైట్‌కు అందించారు. ఇలా అందించిన వాటిలో 280 కేసులు నమోదయ్యాయి. నిబంధనల ప్రకారం రూ.25 వేలకుపైగా మొత్తం పోగొట్టుకున్న బాధితులకు సంబంధించి మాత్రమే ఎఫ్‌ఐఆర్ కడతారు. మిగతావి ఫిర్యాదుగా



స్వీకరిస్తారు. కరీంనగర్‌లో ఇటీవల లక్షకుపైగా మొత్తం పోగొట్టుకున్నవారే ఎక్కువగా ఉండటం బాధాకరమైన విషయం.!

మోసపోవద్దు!

ఎట్టిపరిస్థితుల్లో ఇతరులకు ఫోన్లో వివరాలు చెప్పొద్దు.

చరవాణికి వచ్చే ఏపీకే ఫైల్స్ లింక్‌ను తెరవకూడదు.

మోసపోతే తక్షణమే 1930కి కాల్ చేసి వివరాలు చెప్పాలి.

ఓటీపీని బ్యాంక్ అధికారులు ఫోన్‌లో అడగరనేది గుర్తించాలి.

తక్కువ ధర, ఇతర ఆఫర్‌లు, ఉద్యోగాల పేరిట మోసపోవద్దు.

ఫోన్ సెట్టింగ్‌లో అన్నింటికి అనుమతివ్వకుండా జాగ్రత్తపడాలి.

ఏ తరహా మోసం...

యూపీఐ– 461

నెట్‌బ్యాంకింగ్– 188

డెబిట్ కార్డు– 64

డిపాజిట్ – 28

ఈ–వ్యాలెట్– 25

వ్యాపారం– 15

# సాంకేతిక సొబగులు.. ఆధునిక కోర్సులు

నల్గొండ : ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పట్టభద్రులకు అత్యాధునిక ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. దీనికోసం ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా ఉన్న ఆరు ఐటీఐ కళాశాలలను ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) లుగా మార్చి నూతన పరికరాలు, కోర్సులు అందుబాటులో తెచ్చింది.

**కృత్రిమ మేధ**

కంప్యూటరైజ్డ్ న్యూమెరికల్ కంట్రోల్ (సీఎన్‌సీ), అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైన్ ఇన్‌మెకానికల్, ఇండిస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చుర్ టెక్నీషియన్, త్రీడీ ప్రింటింగ్, స్ప్రే పెయింటింగ్, ఎలక్ట్రానిక్ వాహనాల మెకానిక్, మాన్యుఫాక్చర్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులను ప్రవేశపెట్టారు. భవిష్యత్తులో డిమాండ్‌కు అనుగుణంగా మరో 20 రకాల అత్యాధునిక కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం అన్నిచోట్ల పాఠ్యాంశాల బోధన జరుగుతుండగా త్వరలో ప్రాక్టికల్స్ నిర్వహణ, ఉద్యోగమేళా కార్యక్రమాలను చేపట్టనున్నారు.

**ఎక్కడెక్కడంటే..** నల్గొండలో రెండు, హాలియా, డిండి, భువనగిరి, ఆలేరు, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, జాజిరెడ్డిగూడెంలలో ఒక్కొక్కటి చొప్పున కళాశాలలున్నాయి. 1,500 మంది ప్రవేశాలు పొందుతున్నారు.

**త్రీడీ ప్రింటింగ్**

నల్గొండ ఏటీసీ కేంద్రంలో రూ.85లక్షల విలువైన త్రీడీ ప్రింటింగ్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. దీంతో రాతిశిల్పాల స్థానంలో దేవుని ప్రతిమలు తయారు చేస్తారు. గతంలో రాయిని తొలిచి ఉలితో చెక్కితే ఆకృతి వచ్చేది. ప్రస్తుతం కంప్యూటర్ సహితంగా మనకు



కావాల్సిన ఆకారంలో ప్రోబ్లాక్ నల్లటి పదార్థంతో బొమ్మలు, భారీ విగ్రహాలు తయారు చేసే వీలుందని ఈ కోర్సు బోధకులు బాలు చెబుతున్నారు.

**స్ప్రే పెయింటింగ్**

పాత వాహనాలు రంగు వెలిస్తే షోరూంలలో, మెకానిక్ దుకాణాల వద్ద అస్తవ్యస్తంగా రంగులు వేసేవారు. దీంతో రంగులు వృథాగా నేలపాలయ్యేవి. ఆ బండికి ఎంత రంగు, ఏ మేరకు కోటింగ్ అంశాలను కంప్యూటింగ్ టెక్నాలజీతోనే సులభంగా చేసేలా ఈ యంత్రం ద్వారా విద్యార్థులకు బోధిస్తున్నారు. ఒక్కో వాహనాన్ని పది నిమిషాల్లోనే తళుక్కుమనేలా తయారు చేసేస్తుంది.

**ఆటోమేటిక్ ఐరన్ కటింగ్**

అత్యాధునిక కంప్యూటరైజ్డ్ న్యూమరికల్ కంట్రోల్(సీఎన్‌సీ) ద్వారా విరిగిన వాహనాలకు అవసరమయ్యే ఇనుప గొట్టాలు, పరికరాల తయారీకి ఉపయోగపడుతుంది. కావాల్సిన విధంగా ఇనుమును కోతపెట్టేలా కంప్యూటర్‌లో సెట్టింగ్ చేసుకుంటేచాలు ఈ యంత్రం సెకన్లలో కచ్చితమైన కొలతలతో విడగొడుతుంది. కార్మికులు శ్రమ తప్పుతుందని బోధకులు చెబుతున్నారు.

# మాయదారి మాంజా వాడొద్దు

తూప్రాన్: ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సంక్రాంతి పండగ సెలవుల్లో యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేస్తుంటారు. పోటీ పడుతుంటారు. ఇందుకోసం సంప్రదాయ దారం మాత్రమే వినియోగించాలి. అవి తెగిపోతున్నాయనే ఉద్దేశంతో కొందరు చైనా మాంజాలు, ఇతర నిషేధిత దారాలు వాడుతున్నారు. పతంగులు ఎగురవేసే క్రమంలో ఇవి కూడా కొన్ని సార్లు తెగిపోయి అటుగా వెళ్లిన వాహనదారులు, ప్రజల మెడకు చుట్టుకోవడంతో గాయపడుతున్నారు.

**నిఘాతోనే అడ్డుకట్టకు అవకాశం**

అన్ని ప్రధాన పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ సంక్రాంతి పండగ సందర్భంగా పతంగుల విక్రయాల దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటిలో జోరుగా నిషేధిత దారాన్ని అమ్ముతున్నారు. పిల్లలు, యువకులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ఆ దారాన్ని బహిరంగంగా వదిలేయడంతో ప్రజలతో పాటు పక్షులకూ ముప్పు వాటిల్లుతోంది. పోలీసులు, అధికారులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి చైనా మాంజా విక్రయాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.



**ఈ సూచనలు పాటిస్తే మేలు**

చైనా మాంజాపై నిషేధం ఉన్నందున సంప్రదాయ ధారాన్ని మాత్రమే వినియోగించాలి.

భవనాలు, మేడలు, ఇతర ఎత్తైన ప్రదేశాల నుంచి గాలి పటాలు ఎగుర వేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. చుట్టూ పిట్టగోడ ఉన్నవి మాత్రమే ఎంచుకోవాలి.

విద్యుత్తు స్తంభాలు, రహదారులపై గాలి పటాలు ఎగురవేయవద్దు. మైదాన ప్రాంతాలే ఉత్తమం.

పిల్లల వెంట తల్లిదండ్రులు ఉంటూ.. జాగ్రత్తలు తెలియజేయాలి.

కఠిన చర్యలు తీసుకుంటాం

–నరేందర్‌గౌడ్, డీఎస్పీ, తూప్రాన్

ప్రభుత్వం నిషేధించిన చైనా మంజాను వినియోగించినా, విక్రయాలు చేపట్టినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వ్యాపారులపై నిఘా ఉంచాం. ఎవరైనా నిషేధిత దారం విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇప్పటికే అక్కడక్కడ వీటిని అమ్ముతున్నట్లు తెలియడంతో సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రధాన రహదారిపై తనిఖీలు చేపట్టి ఇతర ప్రాంతాల నుంచి రవాణా కాకుండా చూస్తాం.

# ఆక్రమించి సింగారం

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో సింగారం చెరువును చదును చేస్తున్న విషయాన్ని ఈనెల 28న 'సింగారం చెరువును చెర పడుతున్నారు' శీర్షికన వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. చెరువును ధ్వంసం చేసినందుకు, అక్రమంగా ప్రవేశించినందుకు కేసులు నమోదు చేశారు. పట్టాదారు సూర్యప్రకాశరావుకు నోటీసు జారీ చేయాలని నిర్ణయించారు. ఆయన అందుబాటులో లేరని పోలీసులు తెలిపారు. శిఖం పట్టా భూమార్పిడికి ప్రభుత్వంలో ఎవరూ సహకరించారనే విషయంపై సీఎంఓ నివేదిక కోరింది.

**ఉన్నతాధికారుల ఒత్తిడి**

మొయినాబాద్ మండలం నజీబ్‌నగర్ పరిధిలో సర్వేనంబరు 3, 4లో నూకారపు సూర్యప్రకాశరావుకు భూములున్నాయి. దీనిలో సింగారం చెరువు కూడా ఉంది. 80 ఎకరాల చెరువు విస్తీర్ణానికి శిఖం పట్టా ఉంది. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదు. కట్ట తెంపి చదును చేసి చెరువును పూడ్చటం ప్రారంభించారు. సమాచారం అందుకున్న సాగునీటి అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంయుక్త తనిఖీ చేశారు. 15 రోజుల కిందట పట్టాదారు సమక్షంలో విచారణ జరిపి ఎఫ్‌టీఎల్ పరిధిలో 80 ఎకరాలకుగాను 73.14 ఎకరాలు, మిగిలిన బఫర్‌జోన్ కింద ఉందని నోటీసు జారీ చేసి పనులు నిలిపివేశారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో పనులు యధావిధిగా కొనసాగాయి. దాదాపు 819



మీటర్ల పొడవు ఉన్న కట్టను చదును చేశారు.

**20 షెడ్లలో పౌల్ట్రీఫారాలు**

సర్వేనంబరు 3, 4లో 80 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదు. ఈభూములను తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు పొంది చెల్లించకపోవడంతో వీటిపై ఇంజక్షన్ ఆర్డర్లు జారీ అయ్యాయి. ఈ భూముల్లో దాదాపు 20 షెడ్లలో పౌల్ట్రీఫారాలు నిర్మించారు. నిబంధనలు ఉల్లంఘించారు.

**రూ.40 లక్షలతో పునర్నిర్మాణం**

ధ్వంసం చేసిన కట్టను నీటిపారుదల శాఖ అధికారులు రూ.40 లక్షలతో పునర్నిర్మిస్తున్నారు. పదిరోజుల్లో పూర్తి చేసేలా గుత్తకు ఇచ్చారు. ఎస్‌ఈ రాజేందర్, డీఈఈ వెంకటరమణ, ఏఈ భరత్‌కుమార్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, ఎంఆర్ఓ గౌతంకుమార్ పరిశీలించారు.

# విశాల నగరం.. సేవలు గగనం!

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ విశాల నగరంగా ఆవిర్భవించింది. అరకొర సిబ్బందితో కొనసాగుతున్న పుర, నగరపాలికలు జీహెచ్‌ఎంసీలో విలీనమయ్యాయి. ప్రస్తుతం ఆయా స్థానిక సంస్థల పరిధిలోసేవలు అందించడం బల్దియాకు కష్టంగా మారింది.

**విస్తీర్ణం మూడు రెట్లకుపైగా..**

పాత జీహెచ్‌ఎంసీ 650 చ.కి.మీ పరిధిలో ఉండేది. 27 పట్టణ స్థానిక సంస్థ(యూఎల్‌బీ)ల విలీనంతో విస్తీర్ణం 2,053 చ.కి.మీటర్లకు పెరిగింది. విలీన ప్రాంతాల్లో 7.5 లక్షల నిర్మాణాలు, 34 లక్షల జనాభా ఉన్నట్లు అంచనా.

**అంతటా అదే పరిస్థితి**

పారిశుద్ధ్య విభాగంలో సూపర్‌వైజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్మికులు సరిపోను లేరు. పాత జీహెచ్‌ఎంసీ పరిధిలోనూ కార్మికుల కొరత ఉంది. 1,500 మందిని నియమించుకునేందుకు ప్రభుత్వం ఏడాది కిందట అనుమతి ఇచ్చినా.. అధికారులు చర్యలు తీసుకోలేదు.

నిర్మాణ అనుమతులు జారీ చేసే టౌన్‌ప్లానింగ్ విభాగం తీవ్రమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందే.. ఇన్‌ఛార్జి సహాయ ప్రణాళికాధికారులుగా పని చేస్తున్నారు. సర్కిల్‌లో ఓ సహాయ ప్రణాళికాధికారి(ఏసీపీ), ఎస్ఓ(సెక్షన్ ఆఫీసర్), ఇద్దరు చైన్‌మెన్లు ఉండాలి. ప్రస్తుతం 20 ఏసీపీలు, సుమారు 100 మంది టీపీఓ, ఎస్ఓ స్థాయి అధికారులు అవసరముందని అంచనా.

కాలనీల్లో రోడ్లు నిర్మించాలన్నా.. వరద నాలాలపై వంతెనలు కట్టాలన్నా.. సర్కిల్ ఒకరి చొప్పున ఉండే కార్యనిర్వాహక ఇంజినీరు (ఈఈ) ద్వారా టెండరు పిలిచి.. గుత్తేదారును ఎంపిక చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పలు శివారు సర్కిళ్లలో ఈఈలు లేరు. ప్రధాన నగరంలోని ఇంజినీర్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా ఇవ్వలేదు. ఫలితంగా.. గ్రామాల్లో రహదారుల నిర్మాణం, ఇతరత్రా పనులు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ వద్ద వంద మంది మాత్రమే వార్డు ఇంజినీర్లు ఉన్నారు.

విలీన ప్రాంతాల్లోని మున్సిపల్ అధికారులు, సిబ్బంది: 8,000

పాత జీహెచ్‌ఎంసీ పరిధిలో..: 22,000

# ఎన్నాళ్లీ సమస్య?

హైదరాబాద్: బృహత్ నగరంలో ఏ కాలనీలో చూసినా మురుగు కనిపిస్తోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పరిశుభ్ర నగరంగా ఏడు నక్షత్రాల(సెవెన్‌స్టార్) గుర్తింపు పొందినా.. మురుగు నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రస్తుతం శివారు మున్సిపాలిటీలను విలీనం చేసుకుని దేశంలోనే అగ్రస్థాయి నగరంగా ప్రాధాన్యం సంతరించుకున్నా.. అధికారుల అలసత్వం కారణంగా కంపు వీడడం లేదు. యూజీడీ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) లీకేజీలపై ఫిర్యాదులు చేస్తే.. అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారుల నివాస ప్రాంతాల్లోనే మురుగు రోడ్లపై పారుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పరిష్కారం కాని ఫిర్యాదులు 25 శాతం

మురుగు వ్యవస్థ(యూజీడీ)ను జలమండలి నిర్వహిస్తోంది. వచ్చే ఫిర్యాదుల్లో కనీసం 25 శాతం కూడా పరిష్కరించడం లేదు. ఒకవేళ పరిష్కరించినా మూణ్నాళ్ల ముచ్చటే. నగరంలో ప్రస్తుతం జనాభా 1.34 కోట్లకు చేరుకుంది. శివారు మున్సిపాలిటీలను మినహాయిస్తే.. కోటి వరకు ఉంది. నగరంలో 10 వేల కిలోమీటర్ల పొడవైన యూజీడీ నిర్మించారు. వాటిలో 8 వేల కిలోమీటర్లు రెండు, మూడు దశాబ్దాల కిందటవే. కొత్తగా ఏర్పాటవుతున్న గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల కాలనీల్లో వారే యూజీడీ ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రతి ఇంటి కనెక్షన్ ద్వారా వచ్చిన మురుగు యూజీడీ ద్వారా మురుగు శుద్ధి కేంద్రం(ఎస్‌టీపీ)కి చేరుతుంది. అక్కడ ఆ నీటిని శుభ్రపరిచి మూసీ నదిలోకి వదులుతారు. ఇలాంటి ఎస్‌టీపీలు 50 మాత్రమే ఉన్నాయి. ఇవీ లెక్కలుజలమండలి లెక్క ప్రకారం రోజూ నగరంలో 1950 ఎంఎల్‌డీల మురుగు వెలువడుతోంది. ప్రస్తుతం పెరిగిన జనాభా అవసరాల ప్రకారం ఇది 2,500 ఎంఎల్‌డీ వరకు ఉంటుందని అంచనా. నగరంలో ఉన్న 45 ఎస్‌టీపీల ద్వారా రోజుకు 1878 మిలియన్ లీటర్ల మురుగు శుభ్రపరుస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవ లెక్కల ప్రకారం ఇంకా 30 శాతం మురుగును శుభ్రపరచడం లేదు. ఇదంతా యూజీడీల్లో పేరుకుపోతోంది. పేరుకుపోయిన మురుగుతో ప్రవాహం సాఫీగా సాగక.. మ్యాన్‌హోళ్ల ద్వారా పైకి చిమ్ముతోంది. రోడ్లే మురుగు కాలువలు అవుతున్నాయి. ఇళ్లలోని ప్లాస్టిక్ కవర్లు, వంట వ్యర్థాలు యూజీడీలోనే వేస్తుండటంతో సమస్య మరింత జటిలమవుతోంది.

# శ్రీరాంహిల్స్ తొలి హౌసింగ్ సొసైటీ



ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొట్టమొదటి హౌసింగ్ సొసైటీ కాలనీ ఏదో తెలుసా? ఖమ్మం నగరంలోని 'శ్రీరాంహిల్స్'. హౌసింగ్ బోర్డుగా కూడా దీన్ని పిలుస్తుంటారు. పచ్చని చెట్లు, విశాల రోడ్లతో కనిపించే ఈ కాలనీలో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, ఉన్నతోద్యోగులు, వ్యాపారులు నివసిస్తున్నారు. కాలనీ ఆవిర్భావం మొదలు నిర్వహణ వరకూ పలు విశేషాలున్నాయి.

శ్రీరాంహిల్స్ కాలనీ నిర్మాణానికి 2007, జులై 7న శంకుస్థాపన చేశారు. ధంసలాపురం సర్వే నం.49లో సుమారు 42 ఎకరాల ప్రభుత్వ భూమిలో గృహనిర్మాణ శాఖ(హౌసింగ్ బోర్డు) ఆధ్వర్యంలో నిర్మాణాల ప్రతిపాదన చేపట్టారు. టెండరు పద్ధతిలో ఐవీఆర్‌సీఎల్ సంస్థ దక్కించుకుని సుప్రభాత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు పనులు అప్పగించారు. 150, 200, 256, 260, 300, 477 చ.గజాల స్థలాల్లో ఆరు రకాలుగా మొత్తం 367 ఇళ్లు నిర్మించారు. 2010 నుంచి దశల వారీగా ఇళ్ల అప్పగింత ప్రారంభమై 2012 నాటికి పూర్తయ్యింది. వందలాది కుటుంబాలు నివసించే శ్రీరాంహిల్స్‌లో కాలనీ సహకార సంఘం కార్యాలయం ఉంది. నీటి కరవు లేకుండా ఐదు బోర్లు వేశారు. దూరాన ఉన్న ధంసలాపురం పెద్ద చెరువు నుంచి దాత సహకారంతో బోరు, పైపులైను వేయించారు. కాలనీలో గుట్టపై 6లక్షల లీటర్ల సామర్థ్యంగల సంపు నిర్మించి ఇళ్లకు నీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరూ కాలనీ వాసులకు అందుతున్నాయి.రెండు ప్రధాన, 22 అంతర్గత రహదారులు.. అన్నీ బీటీ రోడ్లే. ఎక్కడా మురుగు కనిపించకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించారు. ఎస్‌టీపీ ట్యాంకు నిర్మించి మురుగు నుంచి శుద్ధి చేసిన 2లక్షల లీటర్ల నీటితో పార్కులు, వీధుల్లో చెట్లకు నీరందిస్తున్నారు. వర్షపు నీటి నిర్వహణకు అండర్ గ్రౌండ్ నిర్మాణం చేపట్టారు. 14 నియంత్రికల సాయంతో భూగర్భ విద్యుత్తు లైను కేబుల్ వేసి విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. కాలనీలో నాలుగు పార్కులు నిర్వహి స్తున్నారు. దాతల సహకారంతో సీతారామ కళాప్రాంగణాన్ని నిర్మించి దైవ, సాంస్కృతిక కార్యక్రమాలకు వినియోగి స్తున్నారు. కాలనీ నివాసులతో ప్రతి రెండేళ్లకోసారి కమిటీని ఎన్నుకుం టున్నారు. ఇప్పటివరకున్న తొమ్మిది కమిటీలూ ఏకగ్రీవంగానే ఎన్నికవడం విశేషం.

# వారి 'కాంక్షలు' వేరే..



కొత్తగూడెం : సైబర్ నేరగాళ్లు సాంకేతికతను ఉపయోగిస్తూ రెచ్చిపోతున్నారు. ఏదోరీతిన మోసం చేయడమే పనిగా పెట్టుకుని ప్రజల సొత్తును కాజేయడమే లక్ష్యంగా సాగిపోతున్నారు. స్మార్ట్‌ఫోన్లు ఉపయోగిస్తున్న వారే వారి వలలో చిక్కుకుని రూ.లక్షలు చేజార్చుకుంటున్నారు. నిన్నమొన్నటి వరకు యాప్‌లు, ఉద్యోగాలు, బ్యాంకుల పేరిట నేరాలకు పాల్పడిన కేటుగాళ్లు ఇప్పుడు పండుగలు, పబ్బాలను వేదికగా చేసుకునేందుకు సిద్ధమయ్యారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొత్త సంవత్సరం ప్రవేశించనున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు తప్పుడు (మ్యూల్) ఖాతాలను ప్రారంభిస్తున్నారు. దీని ఆధారంగా 'నూతన సంవత్సర శుభాకాంక్షలు' పేరుతో గాలం వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఫోన్‌లో కొత్త ఏడాది విషెస్ తెలుపుతూ మెసేజ్‌లు ఇస్తారు. పొరబాటున దాన్ని ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతా దగ్గరి నుంచి మొదలుకుని వ్యక్తిగత సమాచారం వరకు హాక్ చేసే కొత్త ట్రిక్కులతో సైబర్ నేరగాళ్లు ముందుకు రాబోతున్నట్లు పోలీసులు హెచ్చరిస్తుండటం గమనార్హం. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ వచ్చే ఫేక్ మెసేజ్‌లలో 'డాట్ ఏపీకే' పదం కన్పిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నూతన సంవత్సరాన్ని చేదు జ్ఞాపకాలతో ప్రారంభించకుండా అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ప్రచార బోర్డులు అందుబాటులో ఉంచారు.

**సంబంధం లేకున్నా...**

సంబంధమే లేకుండా సైబర్ నేరాల్లో అమాయకులు భాగస్వాములవుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ఖాతాల నుంచి తమ ఖాతాల్లోకి డబ్బులు రావడం వల్ల అలాంటి వారి బ్యాంకు ఖాతాల్లోని నగదును అధికారులు హోల్డ్‌లో పెడుతున్నారు. ఫలితంగా తమ డబ్బును పొందేందుకు బ్యాంకులు, సైబర్‌క్రైమ్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది.న్యూగొల్లగూడేనికి చెందిన ఓ మహిళ ఖాతాకు 2022లో రూ.350 ఎవరో గుర్తు తెలియని ఖాతా నుంచి జమ అయ్యాయి. అది సైబర్ నేరగాడు చేసిన నిర్వాకం కావడం వల్ల ఆమె ఖాతాలో జమ అయిన డ్వాక్రా డబ్బులు రూ.1,50,000 బ్యాంకు అధికారులు హోల్డ్‌లో పెట్టారు. సైబర్ క్రైమ్ అధికారులను ఆశ్రయించడంతో వారం రోజుల తరువాత సమస్య పరిష్కారమైంది. కొత్త ఏడాదిలో సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా పలు కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నట్టు ఎస్పీ బి.రోహిత్‌రాజు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

2025లో సైబర్ నేరాల వివరాలు


జిల్లాలో నమోదైన కేసులు: 196

కోల్పోయిన నగదు: రూ.8 కోట్లు

అధికారులు ఫ్రీజ్ చేసిన నగదు: రూ.1.45 కోట్లు

బాధితులకు అందచేసిన మొత్తం: రూ.22.63 లక్షలు

# రైతు వేదిక.. భద్రత లేదా ఇక



పాల్వంచ : జిల్లాలో రైతులకు, వ్యవసాయాధికారులకు అనుసంధానంగా మారిన రైతు వేదికలకు రక్షణ కరవైంది. చాలాచోట్ల ఊరికి దూరంగా, శివారు ప్రాంతాల్లో ఉండటంతో దొంగల బెడద ఎక్కువైంది. నిఘా నేత్రాలు లేకపోవడంతో వాటిల్లో విలువైన సొత్తు అపహరణకు గురవుతోంది.

**విషయమేంటి?**

జిల్లాలో 67 రైతు వేదికలున్నాయి. వీటిల్లో ప్రస్తుతం 58 వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో రాష్ట్ర స్థాయి అధికారులు, రైతులతో ముఖాముఖి మాట్లాడి సాగులో సందేహాలను నివృత్తి చేస్తున్నారు. దృశ్యమాధ్యమ రూపంలో అన్నదాతలతో మాట్లాడేందుకు వీలుగా 62 అంగుళాల టీవీ, స్పీకర్లు, ఇన్వర్టర్లు, కంప్యూటర్లు అందుబాటులో ఉంచారు. ఇవీ ఆయా క్లస్టర్ ఏఈవోల నియంత్రణలో ఉంటాయి.

**ఎందుకు ఇలా...?**

1. రైతు వేదికలు ఊరుకు దూరంగా విసిరేసినట్లు ఉండటంతో పర్యవేక్షణ కరవవుతోంది.
2. ఎక్కడా సీసీ కెమెరాలు లేవు. దీంతో రాత్రిళ్లు దొంగలు సునాయాసంగా చోరీకి పాల్పడుతున్నారు. విచారణపై దృష్టి సారించకపోవటంతో వారికి అడ్డేలేకుండా పోతోంది.
3. రూ. 3లక్షల వ్యయంతో ఎలక్ట్రానిక్స్ వస్తువులకు ఏర్పాటు చేస్తున్నారు. కానీ రూ.వేలు ఖరీదు చేసే నిఘా నేత్రాల ఏర్పాటును విస్మరిస్తున్నారు.

**మచ్చుకు కొన్ని..**

నవంబరు 11న పాల్వంచ మండలం పాండురంగాపురం రైతు వేదికలో రూ.2లక్షల టీవీ చోరీకి గురైంది. అంతకు ముందు ఆగస్టులో స్పీకర్, ఇన్వర్టర్ అపహరణకు గురైంది. నెలలు గడుస్తున్నా విచారణ కొలిక్కి రాలేదు. పోలీసులు ఇంటి దొంగ పనేనని తేల్చినా, జిల్లా వ్యవసాయాధికారులు రెండుసార్లు విచారణ చేసినా ఎవరు చోరీ చేశారో గుర్తించలేదు. ఇల్లెందు మండలం చల్లసముద్రంలో టీవీ అపహరణకు గురికాగా పక్కన ఓ ఇంట్లో అమర్చిన సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుణ్ని గుర్తించారు.

జూలూరుపాడు మండలం పడమటి నర్సాపురంలో కంప్యూటర్ అపహరణకు గురైంది. ఇప్పటికీ ఆచూకీ లేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదులు చేసి విచారణ చేయిస్తున్నాం.

బాబు, జిల్లా వ్యవసాయాధికారి

# రద్దీ ఛార్జీలతో కాలుష్యం కట్టడి


హైదరాబాద్: రోజూ తిరిగే 85 లక్షల వాహనాలు, నిత్యం కొత్తగా రోడ్డెక్కుతున్న వాహనాలతో నగర రహదారులు కిక్కిరిసిపోతున్నాయి. అవసరమున్నా లేకున్నా వాహనాలు రోడ్డెక్కిస్తుండటంతో నగరవాసులు ఏటా 85 గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారని ఓ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. ప్రజా రవాణాను వినియోగించడమే ఏకైక పరిష్కార మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగత వాహనాలు వీడి ఆర్టీసీ, మెట్రోలో ప్రయాణించాలంటే లండన్ తరహాలో నగరంలో 'రద్దీ పన్ను' (కంజెషన్ టాక్స్) విధించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బెంగళూరులో ఈ విధానం అమలుపై చర్చ జరుగుతోంది.

**ఏమిటీ కంజెషన్ టాక్స్..**

ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోకి వాహనాలు వెళ్లేందుకు విధించే రోజువారీ ఫీజు లేదా టోల్ ఇది. వ్యక్తిగత, ప్రైవేటు వాహనాలను వినియోగించకుండా,మెట్రో బస్సులు ఉపయోగించేలా ప్రోత్సహించేందుకు లండన్‌లో ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. జోన్ బౌండరీలో, లోపల ఆటోమెటిక్ నంబరు ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు ఉంటాయి. ఇవి వాహనం నంబరు ప్లేట్‌ను ఆటోమెటిక్‌గా గుర్తించి ఫొటో తీస్తాయి. ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ లండన్ వ్యవస్థ అన్నీ నంబరు ప్లేట్లను పరిశీలించి జోన్‌లోకి వచ్చిన వాహనాలు ఛార్జీ చెల్లించాయా లేదా పరిశీలిస్తాయి. మినహాయింపు ఇచ్చిన ఈవీ వాహనాలు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటే మినహాయింపు వర్తిస్తుంది. 2003 నుంచి దీనిని అమలు చేస్తుండటంతో 30 శాతం వరకు ట్రాఫిక్ తగ్గింది. సెంట్రల్ లండన్ జోన్‌లో వ్యక్తిగత వాహనాలతో వెళ్లేవారికి రోజుకు 15 పౌండ్ల చొప్పున ఛార్జీ విధిస్తున్నారు. సింగపూర్, స్టాక్‌హోమ్, న్యూయార్క్‌లోనూ ఈ విధానం అమలవుతోంది.

**బెంగళూరులో ప్రతిపాదనలు**

ట్రాఫిక్ సమస్య ప్రధానంగా ఉన్న బెంగళూరులోనూ కంజెషన్ ఛార్జీలు




విధించాలన్న ప్రతిపాదనలున్నాయి. 2025 సెప్టెంబర్‌లో కర్ణాటక ప్రభుత్వం 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ ప్రతిపాదన అమలుపై చర్చించింది. ఔటర్ రింగ్‌రోడ్డుపై రద్దీ వేళల్లో ఒక్కరే ఉన్న (సింగిల్ ఆక్యుపెంట్) కార్లకు ఛార్జీ విధించాలని అందులో పేర్కొంది. ఫాస్టాగ్ ద్వారా ఆటోమెటిక్‌గా ఛార్జీలు వసూలు చేసేలా, కార్‌పూలింగ్‌కు మినహాయింపు ఇవ్వాలని యోచిస్తున్నారు.

**1000 మంది ప్రయాణికులకు..**

మెట్రో రైలులో 1000 మంది ప్రయాణించొచ్చు. అదే బస్సులో 40 నుంచి 50, కారులో నలుగురు, ద్విచక్ర వాహనంలో ఇద్దరు వెళ్లొచ్చు. ఇదే 1000 మంది ప్రయాణించడానికి 20 నుంచి 30 బస్సులు, 250 కార్లు, 500 ద్విచక్ర వాహనాలు అవసరమవుతాయి. ఈ వాహనాలన్నీ రోడ్లపై చేరటంతో వేగం తగ్గుతోంది. కాలుష్య ఉద్గారాలు పెరుగుతున్నాయి.

**భాగ్యనగరంలో రద్దీ ప్రాంతాలు..**

గచ్చిబౌలి, పంజాగుట్ట, బేగంపేట, కూకట్‌పల్లి, మాదాపూర్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కొండాపూర్, మెహిదీపట్నం, అత్తాపూర్, టోలిచౌకి, దిల్‌సుఖ్‌నగర్, నార్సింగి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, లింగంపల్లి.

# అక్రమాల స్టాంప్

నల్గొండ : అధిక ధరలకు నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల విక్రయాలు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో జోరుగా సాగుతున్నాయి.

**ఎందుకు ఇవి..**

ఆస్తుల రిజిస్ట్రేషన్, బ్యాంక్ సంబంధిత లావాదేవీలు, స్థిరాస్తి ఒప్పంద పత్రాలు, విద్యార్థుల ఉపకార వేతనాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, అఫిడవిట్ తయారీ తదితర అవసరాలకు.

**గతంలో ఇలా..** గతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని కౌంటర్లలోనే డబ్బులు ఇచ్చి నేరుగా నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు తీసుకునే అవకాశం ఉండగా.. ప్రస్తుతం ఆ విధానం అమల్లో లేదు. ప్రభుత్వం దాదాపు మూడేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని తీసుకునే విధానాన్ని చేపట్టింది.

ఎక్కెడక్కడంటే..

నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, చండూరు, నకిరేకల్, నిడమనూరు, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, బీబీనగర్, భువనగిరి, మోత్కూరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్

**దందా ఇలా..**

మార్కెట్లో లభ్యమయ్యే రూ.20 నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌కు రూ.40 నుంచి రూ.50 వరకు, రూ.50 స్టాంప్ పేపర్‌కు రూ.80–100, రూ.100 స్టాంప్ పేపర్‌కు రూ.150–180 వరకు విక్రయిస్తూ అక్రమాలకు



పాల్పడుతున్నారు.

వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చే 5 శాతం కమీషన్ తీసుకొని వెండర్లు విక్రయాలు చేపట్టాల్సి ఉంది.

మహారాష్ట్ర, నాసిక్ ప్రాంతంలో స్టాంపు పేపర్ల తయారీ చేస్తుండగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రభుత్వమే గుత్తేదారుల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ పత్రాలు ఆయా జిల్లాలోని కార్యాలయాలకు వచ్చిన సమయంలో కొందరు ఉద్యోగులు ముందు గానే 'ఆయా స్టాంప్ వెండర్ల'కు సమాచారం ఇచ్చి పెద్దమొత్తంలో స్టాంప్ పత్రాలు కొనుగోలు చేయించి 'కృత్రిమ కొరత' సృష్టిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

–నగేశ్, సబ్ రిజిస్ట్రార్, నల్గొండ

స్టాంప్ వెండర్ల దగ్గర నుంచి కాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నేరుగా కొనుగోలు చేయవచ్చు. స్టాంప్ పత్రాలు సరిపడా ఉన్నాయి. మా సిబ్బందితో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశాం. బయట స్టాంప్ వెండర్ల దగ్గర కూడా ఉన్న ధరతోనే కొనుగోలు చేయాలి. మా సిబ్బంది ఎవరైనా వెండర్లకు సహకరించినట్లు ఫిర్యాదు, సాక్ష్యాలు సమర్పిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు

చురకలు



# మరో 70 ఎకరాలు.. రూ.7 వేల కోట్ల లక్ష్యం!

హైదరాబాద్: కోకాపేట నియోపొలిస్ లేఅవుట్‌లో ప్లాటు కాసుల వర్షం కురిపించడంతో కొత్త ఏడాదిలో మిగతా భూమినీ వేలం వేసే దిశగా హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ నెలలో నియోపొలిస్ లేఅవుట్‌లో 3 దఫాలుగా 29 ఎకరాలను ఆన్‌లైన్‌లో వేలం వేసిన సంగతి తెలిసిందే. ఊహించిన దానికంటే బిల్డర్ల నుంచి స్పందన వచ్చింది. ఎకరాకు అత్యధికంగా రూ.151 కోట్లు పలికింది. మొత్తం 29 ఎకరాలకు రూ.3,862.8 కోట్ల ఆదాయం సమకూరింది. ఇదే లేఅవుట్‌లో ఉన్న 70 ఎకరాలను కూడా విక్రయించాలని యోచిస్తోంది. ఇదే భూమిని పదేళ్ల క్రితం ఐటీ ఎస్ఈజడ్‌కు కేటాయించారు. మొత్తం 11 కంపెనీలకు ఈ భూమిని



లీజుకు ఇచ్చారు. ఇంతవరకు ఒక్క కంపెనీ కూడా ఆ భూమిలో సంస్థలను ఏర్పాటు చేయలేదు. ఇప్పటికే కొని కంపెనీలు లీజు నుంచి విరమించుకున్నట్లు హెచ్ఎండీఏకు సమాచారం ఇచ్చాయి. కంపెనీలకు ఇచ్చిన గడువు కూడా ముగియడంతో భూమి మొత్తం హెచ్ఎండీఏ ఆధీనంలో ఉంది. ఇందులో భారీ రహదారులు ఇతర మౌలిక వసతులు కల్పించారు. ఆ సంస్థల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. అది పరిష్కారమైతే ఈ భూమిపై పూర్తి హక్కులు హెచ్ఎండీఏకు రానున్నాయి. అప్పుడు ఇబ్బంది లేకుండా విక్రయించేందుకు అవకాశం ఉన్నట్లు తెలిసింది.


**భారీ ఆదాయంపై హెచ్ఎండీఏ కన్ను**

ఎకరాకు రూ.100 కోట్లు పలికినా 70 ఎకరాలకు రూ.7 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. అనుకున్న దానికంటే స్పందన వస్తే రూ.8 వేల కోట్లు దాటినా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు. 2047 రైజింగ్ తెలంగాణలో భాగంగా నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రజారవాణాకు మెట్రో విస్తరణ, బీఎస్‌టీఆర్, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి నిధుల సమస్య వెంటాడుతోంది. వేలంతో వచ్చే నిధులను వీటికి వెచ్చించాలని ఆలోచిస్తోంది. మియాపూర్, జవహర్‌నగర్ భూముల తరహాలో ఖాళీగా ఉంచితే ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి.

# ప్రాణవాయువుకు ప్రాణం పోద్దాం

హైదరాబాద్: రెవెన్యూ రికార్డుల ప్రకారం మహానగరంలో 800 చెరువులున్నాయి. ఇందులో చాలావరకు కాలుష్య కాసారాలుగా మారిపోగా మరికొన్ని వ్యర్థాలతో డంపింగ్‌యార్డులుగా మారిపోతున్నాయి. పారిశ్రామిక, గృహ వ్యర్థాలను నేరుగా పంపుతుండటంతో నీటిలో కరిగిన ఆక్సిజన్ (డీవో) పరిమాణం పడిపోతోంది. పీసీబీ నివేదిక ప్రకారం.. సుమారు 40 చెరువుల్లో ఆశించిన స్థాయిలో డీవో లేదు. చాలా చెరువుల్లో 0.3–2.8 మధ్య నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో సహజ, యాంత్రిక పద్ధతుల్లో ఆక్సిజన్ పెంచే పద్ధతులను అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

తగ్గడానికి కారణాలివే.. గుర్రపు డెక్క పెరగడం, కలుషిత నీరు



జలాశయాల్లో చేరడం, వాతావరణంలో మార్పులు, నీటి మట్టం తగ్గడం. **ఇవి పాటించాలి..** ప్యాడిల్ వీల్ లేదా స్ప్రే ఎరేటర్లు వాడాలి. నీటి ఉపరితలాన్ని పెంచి ఫౌంటేన్‌లను ఏర్పాటు చేయాలి. హార్న్‌వార్ట్, వాటర్ లిలీలు మొక్కలను నీటిలో పెంచితే నీటిలో ఆక్సిజన్ స్థాయిని పెంచడంతోపాటు ఆల్గే పెరగకుండా రక్షిస్తుంది. గుర్రపు డెక్కను తొలగించాలి. వ్యర్థ, కలుషిత జలాలను నిలువరించి తాజా నీరు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

# పోషకాహార లోపంతో రెట్టింపు సమస్యలు

హైదరాబాద్ : 'దేశంలో ఓ వైపు పిల్లల్లో పోషకాల లేమి.. మరోవైపు కౌమారదశ, పెద్దల్లో అధిక బరువు, ఊబకాయం పెరుగుతోంది. ఇది మధుమేహం, గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి జీవక్రియ సంబంధిత రుగ్మతలకు దారితీస్తోంది. ఈ సమస్యలకు మూల కారణం అనారోగ్యకర ఆహారపు అలవాట్లే' అని జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) డైరెక్టర్ డాక్టర్ భారతీకులకర్ణి అన్నారు. ఎన్ఐఎన్‌లో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ ఆవిష్కరణలపై జరిగిన రెండు రోజుల సదస్సు సందర్భంగా ఆమె మాట్లాడారు.

సాంకేతిక ఆవిష్కరణలతోనే..

దేశం ఎదుర్కొంటున్న పోషకాహార సమస్యలకు వేగంగా, శాస్త్రీయంగా, సాంకేతికంగా పరిష్కరించే దిశగా ఓ ప్రయత్నం చేశాం. వీటి పరిష్కారానికి ఆవిష్కరణలు ఎంతో దోహదం చేస్తాయి. ఇప్పటికే అభివృద్ధి చేస్తున్న సాంకేతికత పరిజ్ఞానాలను గుర్తించి మెరుగుపర్చడం, వారికి మెంటర్‌షిప్ అందించడం, శాస్త్రవేత్తలతో కలిసి సాంకేతికత ధ్రువీకరించడం, వేగవంతం చేయడం ద్వారా ప్రజల్లోకి తీసుకురావాల ని ఎన్ఐఎన్ ప్రయత్నం చేస్తోంది. పోషకాహారానికి సంబంధించి ఆవిష్కరణ కోసం పరిశోధనలు చేయడానికి కూడా ఆవిష్కర్తలకు సహాయం చేస్తాం.

అందుబాటులో ఉండేలా..

పోషకాల లేమి ఉందని తెలిసినా వాటిని భర్తీ చేసే ఆహారం అందుబాటులో లేకపోవడంతో చాలామంది తీసుకోలేకపోతున్నారు. ఆరోగ్యకర ఆహారాన్ని సరసమైనదిగా చేయడంలో పరిష్కారాల కోసం అన్వేషిస్తున్నాం. వీటితోపాటు ఎంత పరిమాణంలో తీసుకోవాలి..? ఆహారంలో పోషకాలను అంచనా వేసే దగ్గర్నుంచి.. రక్త నమూనాల్లో పోషక బయో మార్కర్ల వరకు.. వ్యక్తిగత ఆహారపు అలవాట్లను విశ్లేషించే, మెరుగైన డైట్‌ప్లాన్ చెప్పే యాప్స్ కావాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా, తక్కువ ఖర్చుతో రక్తహీనత వంటి లోపాలను గుర్తించే చిన్న పరికరాలు అవసరం ఉంది. ఏఐ ఆధారిత పరిష్కారాలు సైతం ఉపయోగపడతాయి.

# చేయి తడిపితేనే దస్త్రం కదిలేది!



గోదావరిఖని : రెండు నెలల కిందట కరీంనగర్‌కు చెందిన ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకుడిని అనిశా అధికారులు పట్టుకొన్నారు. ఔషధ దుకాణాలకు సంబంధించిన వ్యవహారంలో లంచం డిమాండ్ చేయడంతో అనిశా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గత నెలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో తూనికలు కొలతల అధికారిణి అనిశా వలకు చిక్కారు. లంచం డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేశారు. ఉన్నత ఉద్యోగం.. లక్షల్లో వేతనం.. అయినా బల్లకింద చేయిపెట్టకుంటే వారికి మనసొప్పదు. అదనంగా సంపాదించాలన్న ఆశ.. ఎదుటి వారి బలహీనతలను సొమ్ము చేసుకోవాలన్న దురాలోచన.. ప్రజలను పీడించి వసూలు చేస్తున్న వారిలో ఉన్నతాధికారుల సంఖ్య ఎక్కువగా ఉంది. సాధారణ ఉద్యోగులు కూడా అవినీతి నిరోధక శాఖ(అనిశా) వలలో చిక్కారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో పట్టుబడిన వారిలో ఎక్కువ మంది అధికారి హోదాలో ఉన్న వారే అధికం. చేయాల్సిన పని వారి చేతుల్లోనే ఉండటంతో వివిధ శాఖల అధిపతులు లంచం ఇవ్వనిదే దస్త్రం కదల్చమని డిమాండ్ చేస్తున్నారు. ఏటా లంచావతారులు పెరుగుతుండగా అందులో అధికారుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

**ఈ ఏడాది 23 మంది**

ఈ ఏడాది ఇప్పటి వరకు 23 మందిని అనిశా అధికారులు పట్టుకున్నారు. లంచం డిమాండ్ చేసిన వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసులు నమోదు చేశారు. పట్టుకున్న 23 మందిలో 16 మంది అధికారులే ఉన్నారు. మిగతా వారు కింది స్థాయి ఉద్యోగులున్నారు. అధికారి హోదాకు చెందిన వారే లంచాలు డిమాండ్ చేసి అనిశాకు చిక్కారు.

**మారని తీరు**

అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను వలపన్ని పట్టుకుంటున్న అనిశా అధికారులు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఈ కేసుల్లో చిక్కుకున్న వారికి శిక్షలు ఖరారవుతున్నాయి. అయినా లంచం అడగడంలో మార్పు రావడం లేదు. రెవెన్యూ, సర్వే, రవాణా, రిజిస్ట్రేషన్, మునిసిపల్ శాఖలు అవినీతికి కేంద్రాలుగా మారుతున్నాయి. వీటిపై మరింత దృష్టి సారిస్తే అవినీతిని నియంత్రించే అవకాశం ఉంటుంది.

అవినీతిని అడ్డుకోండిలా

టోల్‌ఫ్రీ నంబరు : 1064

వాట్సప్ నంబరు : 94404 46106

ఫేస్‌బుక్ : తెలంగాణ ఏసీబీ

ట్విట్టర్(ఎక్స్) : తెలంగాణ ఏసీబీ

# అక్షరాల ఒడి.. కొలువుల దారి



సిరిసిల్ల : ఏళ్ల తరబడి విజ్ఞానాన్ని పంచుతూ.. పోటీ పరీక్షల అభ్యర్థులను అక్కున చేర్చుకుంటోంది. జిల్లా కేంద్ర గ్రంథాలయం. 2018 నుంచి పాఠకులకు ఈ గ్రంథాలయం పాఠకులకు అందుబాటులోకి వచ్చింది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ డిజిటల్ సేవలను అందిస్తోంది. అందుకే నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని పంచుతూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. రెండేళ్లలో ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగార్హత పరీక్షల్లో 120 మంది యువతీయువకులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

సదుపాయాలు

గ్రంథాలయంలో 20 కంప్యూటర్‌లు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్, బ్యాంకు ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేవారు వాడుతున్నారు.

అయిదు రీడింగ్ హాళ్లల్లో హైస్పీడ్ ఉచిత వైఫై సదుపాయం. ఒకేసారి 500 మంది చదువుకోవచ్చు.

యువతీ యువకులు, పిల్లలకు వేర్వేరుగా రీడింగ్ గదులు ఉన్నాయి. సభ్యత్వం తీసుకున్న ఉద్యోగార్థులు రూ.1500 విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకోవచ్చు (కాంపిటిటీవ్ పుస్తకాలు ఇంటికి ఇవ్వరు). జిల్లా నలుమూలల నుంచి నిత్యం 300 మంది వరకు వస్తుంటారు. పోటీ పరీక్షల ప్రకటనలు విడుదలైతే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. పురపాలకశాఖ అందించే రూ.5 భోజనాన్ని నిత్యం 150 మంది సద్వినియోగం చేసుకుంటున్నారు.

మ్యాగజైన్లు : 25 నెలకు దినపత్రికలు : 15 (తెలుగు, ఆంగ్లం)

పుస్తకాలు : 32,169

సభ్యత్వ రుసుము : రూ.300 సభ్యులు : 3,070

ప్రతినెలా కొత్తగా సభ్యత్వం తీసుకునేవారు : 10

సెలవు రోజులు : ప్రతి శుక్రవారం

**అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్‌గా..**

నేను ఖేలో ఇండియాలో ఉద్యోగం చేస్తున్న సమయంలో 2023లో ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు వరుస ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆ ఉద్యోగం మానేసి గ్రంథాలయంలో ఏడాది పాటు గ్రూప్స్‌కు సిద్ధమయ్యాను. గ్రూప్–1లో 470 ర్యాంకు వచ్చింది. ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. తర్వాత గ్రూప్–3, 4 వచ్చాయి. తర్వాత గ్రూప్–2లో అసిస్టెంట్ సబ్‌రిజిస్ట్రార్‌గా అవకాశం వచ్చింది. ప్రస్తుతం కామారెడ్డిలో పని చేస్తున్నాను. భువన, సిరిసిల్ల

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి..**

చెన్నైలో సాఫ్ట్‌వేర్‌గా ఏడాదిన్నర ఉద్యోగం చేశాను. 2022లో రాష్ట్రంలో పోలీసుశాఖ నోటిఫికేషన్ వెలువడగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి సిరిసిల్లకు వచ్చాను. ఉదయం ప్రైవేటు పాఠశాలలో తరగతులు చెబుతూ సాయంత్రం గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. సివిల్ కానిస్టేబుల్, ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగాలు వచ్చాయి. చివరగా సివిల్ ఎస్సైలోనూ ఉత్తీర్ణత సాధించాను. ప్రస్తుతం కరీంనగర్‌లో పని చేస్తున్నా.

సాయి కృష్ణ, సిరిసిల్ల

# కుంటలకేం తెలుసు.. కబ్జా చేస్తున్నారని?



సిరిసిల్ల : వీర్నపల్లి మండలం వన్‌పల్లిలోని రామలక్ష్మణుల కుంట ఇది. సుమారు 21 ఎకరాల్లో చెరువు విస్తరించింది. రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి ఎఫ్‌టీఆర్ పరిధిలోకి ఎత్తుగా మట్టిని నింపాడు. పరిశీలించిన అధికారులు ఆక్రమణలను సర్వే ద్వారా గుర్తించారు. ఇప్పటికీ ఆ మట్టిని తొలగించలేదు. ఈ చెరువు ద్వారా పొలాలకు నీరందించే కాలువలు సైతం కనుమరుగయ్యాయి. కాలువ వెంబడి రైతులు ఆక్రమించడంతో ఆనవాళ్లు కనిపించడం లేదు. ఈ చిత్రంలో కనిపిస్తోంది కంచర్లలోని పోతరాయిని చెరువు. చెరువు సమీపంలోని రైతులు మట్టిని నింపడంతో గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించి ఆక్రమణలను గుర్తించి పనులను నిలిపివేశారు. ఇటీవల ఓ రైతు ఇలా చెరువులోకి రాళ్లను వేసి కమతాలను విస్తరించారు.

మెట్ట ప్రాంతమైన జిల్లాలో వ్యవసాయానికి ప్రత్యక్షంగా పరోక్షంగా గొలుసుకట్టు చెరువులే ప్రధాన ఆధారం. నిర్లక్ష్యానికి గురైన నీటి వనరులు ఆక్రమణల బారిన పడుతున్నాయి. కొద్దికొద్దిగా విస్తీర్ణం తగ్గుతూ నీటి నిల్వలపై ప్రభావం పడుతోంది.

**శాఖల సమన్వయ లోపమే శాపం**

జిల్లా పరిధిలో 656 చెరువులు, అందులో 218 సర్‌ప్లస్ ట్యాంకులు ఉన్నాయి. భూములను స్వచ్ఛందంగా రైతులు చెరువుల నిర్మాణాలకు అప్పగించారు. అప్పట్లో అంతగా విలువ లేని భూములను స్వాధీనం చేసుకోవడంలో అంత శ్రద్ధ చూపలేదు. భూములను ఇచ్చిన రైతులకు పట్టాలు ఉన్నాయి. ప్రస్తుతం వివాదాలకు దారి తీస్తున్నాయి.

గతంలో నీటి సరఫరాకు వినియోగించిన పంట కాలువలు సైతం చాలాచోట్ల కనుమరుగయ్యాయి.

వాస్తవానికి నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలిస్తున్నా చర్యల విషయంలో శాఖాపరమైన అధికారాలు లేవు. కబ్జాలు, ఆక్రమణలను రెవెన్యూ అధికారులకు సమర్పించాల్సి వస్తోంది.

వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో కబ్జాకు గురైన స్థలాలు నిర్మాణాలకు అనుకూలంగా మారుస్తుండగా పల్లెల్లో మాత్రం సాగు చేసేందుకు కమతాలుగా మారుస్తున్నారు. చెరువు పరిసరాల్లో భూములున్న రైతులు కమతాల ఎత్తు పెంచడంతో ఫలితంగా చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్), నీటి నిల్వ సామర్థ్యం తగ్గి కరకట్టలకు ప్రమాదంగా మారుతున్నాయి.

సమన్వయంతో పరిశీలించి హద్దులు నిర్ణయించాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో సాధ్యం కాలేదు. పరిశీలనలకు పరిమితమైన యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో జాప్యంతో చెరువులు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి.

# రంగనాథా.. నీ భూమికి రక్షణ ఏదయా..!

రాయదుర్గం : గోపనపల్లి రంగనాథ ఆలయ భూమికి రక్షణ కరవైంది. సమీపంలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్న బిల్డర్లు.. ఆలయ భూమిలోంచి అక్రమంగా రోడ్డు వేస్తున్నారు. దేవాలయానికి సర్వే నం.268లో 13.18 ఎకరాల స్థలం ఉంది. ఈ జాగాకు రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. సమీపంలోని బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్న వారు.. గతంలోనూ రాత్రికి రాత్రి సీసీ రోడ్డు నిర్మించగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు తొలగించారు. తాజాగా రెండు రోజులుగా రోడ్డు వేసేందుకు నేల చదును చేశారు. 350 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో రోడ్డు



నిర్మించేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో రూ.100 కోట్ల విలువైన స్థలం పోయే అవకాశం ఉంది. కొన్నాళ్లుగా ఈ తంతు కొనసాగుతున్నా, అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం– ఆంజనేయులు, ఈవో

క్షేత్రస్థాయిలో పర్యటించి.. చదును చేసిన స్థలాన్ని పరిశీలించాం. అది ఆలయ భూమి. అందులో రోడ్డు నిర్మించినా, ఆక్రమించేందుకు యత్నించినా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. సర్వే చేపట్టి ఆలయ స్థల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతాం.

# పోలింగ్ కేంద్రాలు.. పరిష్కరించాలి సమస్యలు

గంభీరావుపేట : జిల్లాలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించింది. కొన్నిచోట్ల ర్యాంపులు లేకపోవడం, ఉన్నచోట్ల దెబ్బతిని కనిపించడం, ఇరుకు గదులు, పరిసరాల్లో అపరిశుభ్రత తదితర సమస్యలు కనిపించాయి. యుద్ధప్రాతిపదికన సమస్యలన్నీ పరిష్కరిస్తేనే ఎన్నికల క్రతువు సజావుగా సాగే ఆస్కారం ఉంటుంది.

**కొనసాగుతున్న నిర్మాణాలు**

ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ర్యాంపుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మండలంలో 22 గ్రామాలకు 202 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో జడ్పీ బాలికల పాఠశాల–6, జడ్పీ బాలుర పాఠశాలలో–8 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. బాలుర పాఠశాలలో ఇప్పటికే 2 ర్యాంపులు ఉండగా మరో ర్యాంపు నిర్మాణం చేపడుతున్నారు.

**కానరాని ర్యాంపులు**

గంభీరావుపేట మండలంలో 22 పంచాయతీలకు 202 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. దోసల గూడెం ప్రాథమిక పాఠశాలలో ర్యాంపు లేదు. మండలంలో చాలాచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒక్కో గదిలో రెండు, మూడు పోలింగ్ కేంద్రాలు



బోయినపల్లి మండలంలో 212 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో గదిలో రెండు నుంచి మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గదులు సరిపోని చోట వరండాలు, సమీపంలోని వినియోగంలో లేని గదుల్లో సైతం ఏర్పాటు చేశారు. ర్యాంపులు లేనిచోట్ల ఏర్పాటుపై దృష్టి సారించాల్సి ఉంది. దుంద్రపల్లి పాఠశాలలో ఎనిమిది కేంద్రాలకు రెండు గదుల్లో ఆరు.. వరండాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

**వృద్ధులకు ఇబ్బందే..** కోనరావుపేట మండలంలో 26 గ్రామాల్లో 238 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కొన్నిచోట్ల గదుల కొరత ఉంది. దీంతో వరండాలు, వంట గదుల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. 12 పోలింగ్ బూతులు ఉన్న చోట కూడా ఒకే ర్యాంపు ఉండగా మరికొన్ని చోట్ల అసలు ర్యాంపులే లేవు. వరండాల్లో ఫ్లోరింగ్ బండలు పగిలి చిందరవందరగా ఉన్నాయి. వృద్ధులు, దివ్యాంగులు పట్టుకోవటానికి గోడ కానీ, రెయిలింగ్ కానీ లేదు.

# ఈ–పాలన.. ఎప్పుడో..?

నల్గొండ : గ్రామాల్లో ప్రజలకు పంచాయతీల ద్వారానే పౌర సేవలు అందించాలని, ఏ ఒక్కరూ తమ అవసరాల కోసం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఈ– పంచాయతీ విధానం అమలు చేసి అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఇంటి, నీటి పన్ను వసూళు,, భవన నిర్మాణ అనుమతులు కూడా ఆన్‌లైన్ ద్వారానే ఇవ్వాలని ఆదేశించింది. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఇది కార్యరూపం దాల్చలేదు.

**అంతర్జాల సదుపాయం ఉన్నా..**

పంచాయతీ భవనాలకు అంతర్జాల సదుపాయం లేదని ఇన్నాళ్లు మాట దాటవేస్తూ వచ్చారు. ఇప్పుడు అందుబాటులోకి వచ్చినా ఈ–పాలన అమలుకు చర్యలు తీసుకోవడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,783 గ్రామపంచాతీలున్నాయి.

70 శాతం పంచాయతీ భవనాలకు తెలంగాణ ఫైబర్ నెట్ సంస్థ భూభాగం గుండా ఓఎఫ్‌సీ లైన్ వేసి అంతర్జాల సదుపాయం కల్పించింది. పంచాయతీ భవనాల్లో సర్వర్ ప్యానల్ బాక్సులు, భవనాలపై సోలార్ ఎనర్జీ పాయింట్లను ఏర్పాటు చేసింది.

1,177 పంచాయతీల్లో అంతర్జాల సదుపాయం అందుబాటులోకి వచ్చింది. అయినా ఈ–పాలన సేవలు ప్రారంభించడం లేదు.

**కంప్యూటర్లు మాయం**

చాలా పంచాయతీల్లో గత ప్రభుత్వం సరఫరా చేసిన కంప్యూటర్లు లేవు. కొన్ని పంచాయతీ భవనాల్లో ఉన్నా ఇవి పని చేయడం లేదు. దుమ్ము పట్టి పనికి రాకుండా పోయాయి. అంతర్జాల సదుపాయం కల్పించిన పంచాయతీ భవనాల్లో కంప్యూటర్లు, ఉండి చెడిపోయి ఉంటే వాటికి మరమ్మతులు చేయించి ఈ–పాలన అమలుకు కృషి చేయవచ్చు. ఆ ప్రయత్నమూ జరగడం లేదు.

## సహనం వహించు..
## ప్రశాంతంగా స్వామిని దర్శించు..!

సింహాచలం : ముక్కోటి ఏకాదశికి సింహాచలం క్షేత్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణం, ధ్వజస్తంభం, ఉత్తర గోపురం, ఉత్తర ద్వారాలకు పుష్పాలంకరణ చేశారు. ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు రానుండటంతో పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. ఇటీవల సింహాచలం ఆలయం రద్దీగా మారుతోంది. ఈ నేపథ్యంలో క్యూలైన్లలో తోపులాటలు, రద్దీకి ఆస్కారం లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి దర్శనాలు కల్పించేలా చూడాలని నిపుణులు చెబుతున్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి కేవలం ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులను మాత్రమే అనుమతిస్తున్నారు. టికెట్లు దొరకని వారి పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత క్యూలైన్‌లో, ఉచిత ప్రసాదం పంపిణీ వద్ద, ప్రసాదం పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉంది. గత ఘటనలను దృష్టిలో పెట్టుకుని తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసి తోపులాటలు జరగకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసు సిబ్బంది పరిమితంగా ఉండటంతో సెక్యూరిటీ గార్డులు, సిబ్బందిని సమకూర్చాలని ఇప్పటికే



పోలీసులు కోరారు.

**భక్తులు సహనంతో ఉండాలి..:** ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులు సహనం, సమన్వయంతో ఉండాలని పోలీసులు, ఆలయ అధికారులు కోరుతున్నారు. మెరుగైన దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు చేశామని తోపులాటలు, తగాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని సిబ్బందికి తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

**ట్రాఫిక్ నియంత్రణే కీలకం**

సింహగిరిపై తగినంత పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాల రద్దీ భక్తులను ఇబ్బంది పెడుతోంది. ఉత్తర ద్వార దర్శనం వేళ వేలాదిగా వాహనాలు వస్తాయి. దీనికి తోడు ప్రముఖుల తాకిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొండపైకి వాహనాల రాకపోకలు, పార్కింగ్ సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంది. భక్తుల కోసం కొండ కింద నుంచి పైకి 20 ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు తెలిపారు.

## అతి త్వరలో ఆరంభం

అనకాపల్లి : అడ్డురోడ్డు కూడలిని రెవెన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ఖరారు చేయడంతో నూతన ఏడాది ఆరంభం నుంచే పరిపాలన మొదలు పెట్టేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జిల్లాల, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, మార్పుచేర్పులకు సంబంధించి అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో తుది ఆమోదం లభించడంతో నక్కపల్లి స్థానే అడ్డురోడ్డును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఖరారు చేశారు. ఈ మేరకు కొత్త సంవత్సరం నుంచే పరిపాలన మొదలు పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆర్‌డీఓ పరిపాలన కోసం మంత్రి అనిత ఆదేశాలతో అడ్డురోడ్డు మార్కెట్ సమీపంలోని పంచాయతీ కార్యాలయం, రైతు సేవా కేంద్రాలను అధికారులు, కూటమి నాయకులు పరిశీలించారు.



ప్రస్తుతం ఇక్కడ మాత్రమే ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. డివిజన్ ఏర్పాటు చేసి, తర్వాత సొంత భవన నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయం మండల కేంద్రమైన ఎస్.రాయవరంలో ఉంది. ఈ రెండింటికి మధ్య పది కిలోమీటర్ల దూరం ఉంటుంది. భవిష్యత్తులో దీన్ని ఆర్‌డీఓ కార్యాలయం వద్దకే తీసుకువచ్చేలా చూస్తే ప్రజలకు రాకపోకల భారం తగ్గనుంది. ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఈ ప్రాంత వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం వివిధ వ్యాపారాలతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎంతో కీలకమైన ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటవుతుండటంతో అడ్డురోడ్డుతో పాటు చుట్టు పక్కల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. ప్రస్తుతం కార్యాలయం ఏర్పాటుతో తాత్కాలికంగా నర్సీపట్నం ఆర్డీఓనే ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తారా? మరెవరికైనా బాధ్యతలు అప్పగిస్తారానేది తెలియాల్సి ఉంది.

## పేరుకే.. అత్యవసర విభాగం!

అనంతపురం : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగంలో పడకల ఏర్పాటు కలగా మారింది. నాలుగు నెలల కిందట రూ.8 లక్షలు వెచ్చించి విస్తరణ పనులు చేపట్టిన అధికారులు ఇప్పటి వరకు ఆదిశగా ఆలోచించిన పాపానపోలేదు. విస్తరణ పనుల్లోనూ వైద్యులు, సిబ్బంది ఉండేందుకు అవసరమయ్యే క్యాబిన్లు ఏర్పాటు చేశారు. తర్వాత ఎనిమిది పడకలు పట్టేందుకు మాత్రమే ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉంది. రోగుల సేవలపై ప్రభావం ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలతో, ప్రమాదాల్లో గాయపడి, ఇతరత్రా అత్యవసరం పరిస్థితుల్లో వస్తే ప్రాణాలు పోయే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఇంత ప్రాధాన్యం ఉన్న విభాగంలో ప్రస్తుతం మూడు వెంటిలేటర్లు, 14 ఆక్సిజన్, మూడు సాధారణ పడకలు ఉన్నాయి. రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి తెల్లవారు జాము వరకూ 200 మందికి పైగా ఓపీ సేవలు పొందుతుంటారు. పడకలు లేక ఒకే పడకపై ఇద్దర్ని ఉంచి సేవలందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులపై వరుస కథనాలు ఇవ్వడంతో ఉన్నతాధికారులు విస్తరణ పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించి అనుమతి ఇచ్చారు. కొరవడిన అధికారుల సమన్వయంక్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల మధ్య సమన్వయం లేకపోవటంతో కేవలం విభాగాలను ఏర్పాటు చేసి వదిలేశారు.

# ఉద్యానవనమాయ



ఆదోని : పుర అధికారుల పర్యవేక్షణాలోపంతో గడువు తీరినా.. నేటికీ డంపింగ్ యార్డుల్లో చెత్తకుప్పలు తొలగలేదు. గుట్టలుగా పేరుకుపోయాయి. అనుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో పాటు ప్రజారోగ్యంపై ప్రభావం చూపనుంది. మరోసారి టెండర్లు పిలిచి, చెత్త శుద్ధి పనులు అప్పగించాలని నిర్ణయించారు. దీంతో వ్యర్థాల కుప్పలు లెక్కకట్టే పనులు ఆరంభించారు. నిధుల సమస్యలు అధిగమించేందుకు ప్రత్యేక ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని భావిస్తున్నారు.

**టన్ను చెత్తశుద్ధికి రూ.900**

గత ప్రభుత్వం వైకాపా హయాంలో మున్సిపాలిటీల్లో తట్టెడు చెత్త శుద్ధి చేయలేదు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేక దృష్టి సారించింది. తొలగింపు బాధ్యతలు సౌరాష్ట్ర కంపెనీకి అప్పగించారు. టన్ను చెత్తశుద్ధికి రూ.800–900 చెల్లించేలా ఒప్పందం చేసుకొన్నారు. ఈ ఏడాది జులై నుంచి శ్రీకారం చుట్టారు. ప్రజారోగ్య విభాగం పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. ఆదోని పట్టణంలో పదివేల టన్నుల చెత్తశుద్ధి పనులు సౌరాష్ట్ర కంపెనీకి అప్పగించారు. ఎమ్మిగనూరులో 40 వేలు, డోన్‌లో 50 వేలు, నంద్యాలలో 80 వేల టన్నుల చెత్తను శుద్ధి చేశారు. నంద్యాలలో శుద్ధి చేసిన దాంట్లో ఇంకా 30 వేల టన్నులు తరలించాల్సి ఉంది.

అన్ని పురపాలికలు ఒకే కంపెనీకి పనులు అప్పగించడం, దీంతో శుద్ధి అనంతరం వచ్చేవి మండే స్వభావం కలిగినవి పరిశ్రమలకు కుప్పలు, తెప్పలుగా చేరుకుంటున్నాయి. దీంతో అక్కడి పరిశ్రమల్లో స్థలం లేక ఖాళీ అయ్యే వరకు పంపొద్దని సూచిస్తున్నారు.

**వాతావరణ కాలుష్యం**

పట్టణాలు, నగరాలకు డంపింగ్ యార్డులు దగ్గరగా ఉండటంతో.. భూ, వాయు, జల కాలుష్యం ఏర్పడుతోంది. ఏళ్లుగా శుద్ధి పనులు చేయక, చెత్తను నిల్వ చేయడంతో వర్షానికి తడిసి, ఎండకు ఎండి.. భూమిలో పది మీటర్ల లోతులో కలిసిపోయాయి.

యంత్రాంగం సరైన లెక్కలు వేయకపోవడం, తవ్వే కొద్దీ గుట్టలుగా చెత్త బయటకు వస్తోంది. ఇక్కడ పచ్చదనం పెంచాలంటే కనీసం పది మీటర్లు మేర మట్టిని తొలగించి, కొత్త మట్టి తెచ్చి పోస్తే.. తప్ప ఉద్యానవనాలుగా మారే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఆదోనిలో 45 వేలు, ఎమ్మిగనూరులో 60 వేలు, డోన్‌లో 30 వేలు, నంద్యాలలో 30 వేలు టన్నులకు పైగా వ్యర్థాలు పోగయ్యాయి.

# లీకులు చూడరు.. లాకులు వేయరు



నంద్యాల : రబీ వచ్చేసింది.. ఈ సీజన్లో ప్రతి నీటి చుక్కను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాలి.. ఉమ్మడి జిల్లాలో ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. సాగు నీటి వినియోగంపై లస్కర్ల పాత్ర కీలకం.. కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తను తొలగించడం లేదు.. డిస్ట్రిబ్యూటర్ల నిర్వహణను పట్టించుకోవడం లేదు. నీటి యాజమాన్య పద్ధతులు అత్యవసరం. లస్కర్ల పర్యవేక్షణ లేకపోవడం ప్రతిబంధకంగా మారింది.

**ఏం చేయాలి.. ఏం చేస్తున్నారు**

ప్రతి 1,200 ఎకరాలకు సాగునీటి సరఫరాకు లేదా 12 కి.మీ.ల పొడవునా కాల్వ నిర్వహణకు ఒక లస్కర్ తప్పనిసరిగా ఉండాలి. వీరంతా తమ పరిధిలో రెగ్యులేటర్ నియంత్రణను పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రధాన కాల్వలు, గేట్ల నిర్వహణను లస్కర్లు చూసుకోవాల్సి ఉంది. గేట్లు ఎత్తి దించేందుకు వీలుగా గ్రీజింగ్ చేయాలి. షట్టర్లను పర్యవేక్షిస్తూ లోపాలుంటే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలి. కాలువల లోపలి భాగంలో, గట్లపై ముళ్లపొదలు, కంప చెట్లు పెరగకుండా చూసుకోవాలి. రెండు జిల్లాల్లో ఏ ప్రాజెక్టుల పరిధిలోనూ లస్కర్లు విధులు సక్రమంగా నిర్వహించడం లేదు.

**దస్త్రంలోనే హాజరు**

కేసీ, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, హెచ్ఎన్ఎస్ఎస్ తదితర కాల్వల పరిధిలో 492 మంది లస్కర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది శ్రీశైలం రిజర్వాయరు ముంపు బాధితులే ఎక్కువగా ఉన్నారు. వీరికి నెలకు రూ.20 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. ప్రతి నెలా రూ.1950 కోత విధిస్తున్నారు.

జిల్లాకు చెందిన చాలా మందిని వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు, దువ్వూరు, కడప ప్రాంతాల్లో నియమించారు. వీరికి వచ్చే రూ.20 వేల వేతనంతో ఆ ప్రాంతాలకు వెళ్లలేక జిల్లాలోనే ఉంటూ వ్యవహారం నడిపిస్తున్నారు.

ఎక్కడుంటారో తెలియదు

కేసీ కాల్వ పరిధిలో 240 మంది, ఎల్లెల్సీలో 116 మంది లస్కర్లు విధుల్లో ఉన్నట్లు దస్త్రాలు చెబుతున్నాయి. వీరిలో చాలా మంది జిల్లాలోనే లేరు. ఇతర ప్రాంతాల్లో మరో ఉద్యోగం చేస్తున్నారు.

ఎల్లెల్సీ కింద కోడుమూరు సబ్ డివిజన్‌లో 64 మంది, ఆదోనిలో 13, ఆదోని–2లో 13, ఎమ్మిగనూరులో 17, జీడీపీ సబ్ డివిజన్‌లో 9 మంది పనిచేస్తున్నట్లు దస్త్రాల్లో ఉండగా వీరిలో 40 శాతం మంది కూడా విధుల్లో లేరు.

కేసీ కాల్వ పరిధిలోని 240 మందిలో కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో ఆరుగురు, నంద్యాలలో 42 మంది, ఆళ్లగడ్డలో 21 మంది, వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 23 మంది ఏళ్లుగా విధులకు రావడం లేదు.

హెచ్ఎన్ఎస్ఎస్‌లో పనిచేస్తున్న 45 మంది, ఎస్సార్బీసీలో పనిచేస్తున్న 41 మంది కనీసం అటువైపు చూడటం లేదు.

శ్రీశైలం ముంపు బాధితులనే ఎల్లెల్సీలో కింద తుంగభద్ర ప్రాజెక్టు వివిధ సబ్ డివిజన్లలోని ఆదోని, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో నియమించారు. అంతదూరం వెళ్లలేక 'ఒప్పందం' చేసుకుంటున్నారు.

# 'ఓపి'క నశిస్తోంది!

పుట్టపర్తి: జిల్లాలో చలితీవ్రత పెరుగుతుండటంతో ఆసుపత్రులకు రోగుల రద్దీ పెరుగుతోంది. కొన్నిచోట్ల అందుకనుగుణంగా సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని కదిరి, మడకశిర, ధర్మవరం ప్రాంతీయ ఆసుపత్రులు, హిందూపురం జిల్లా ఆసుపత్రిని బృందం పరిశీలించింది. హిందూపురం ఆసుపత్రి మినహా మిగిలినచోట్ల వివిధ సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

వేచి ఉండలేక..కేంద్రం: ధర్మవరం ఏరియా ఆసుపత్రి

వచ్చిన రోగులు: 1,150 మంది

ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో రోజూ 800 మందికి పైగా ఔట్ పేషెంట్లు వస్తుంటారు. సోమవారం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఓపీ చీటీలు ఒక్కచోటే రాస్తుండటంతో ఒక్కో రోగికి 30 నుంచి 40 నిమిషాలు పడుతోంది. వైద్యుల వద్ద కూడా మరో 40 నిమిషాల వరకు పడుతోంది. దీంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఓపీ చీటీలు రాసే కేంద్రాల సంఖ్య పెంచాల్సి ఉంది.

పరీక్షలకు అవస్థలు

కేంద్రం: కదిరి ఏరియా ఆసుపత్రి

వచ్చిన రోగులు: 499

జ్వరాలు, జలుబు, దగ్గుతో రోగులు ఆసుపత్రికి వచ్చారు. వైద్యుల హాజరు పర్వాలేదు. రక్త పరీక్షల కేంద్రం వద్ద కొంత ఆలస్యం అవుతోంది. ఈసీజీ, ఎక్స్‌రే పరీక్షలు చేయాల్సినచోట ఐదుగురు నిపుణుల్లో నలుగురు మానేశారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఇరుకు గదుల్లోనే వైద్యం

కేంద్రం: మడకశిర ఏరియా ఆసుపత్రి

వచ్చిన రోగులు: 200 నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవనం పూర్తికాకపోవడంతో ఇరుకు గదుల్లోనే సేవలందిస్తున్నారు. దీంతో అటు వైద్యులు, సిబ్బంది, ఇటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ శస్త్రచికిత్సలు నిర్వహించకపోవడంతో ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినవారిని హిందూపురం జిల్లా ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. గర్భిణులకు సాధారణ కాన్పులు మాత్రం చేస్తున్నారు.

సేవలు పర్వాలేదు

కేంద్రం: హిందూపురం జిల్లా ఆసుపత్రి

వచ్చిన రోగులు: 941గత కలెక్టర్ చేతన్ కృషితో ఇక్కడ ఓపీ కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో సమస్య తొలగింది. రక్త పరీక్షలు చేయడంలో ఆలస్యం అవుతుంది. పిల్లల ఆసుపత్రిలో రోజూ ఐదు నుంచి ఎనిమిది వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. 200 పడకలు ఉండగా.. 300 పడకల స్థాయిలో రోగులు వస్తున్నారు. ఉన్నంతలో సిబ్బంది సేవలందిస్తున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం– ఎధుసూదన, డీసీహెచ్ఎస్

ధర్మవరంలో ఓపీ కేంద్రాలు పెంచుకోవాలని ఇప్పటికే సూచించాం. స్థలం సమస్య ఉన్నందున ఆలస్యమైంది. మంత్రి దృష్టికి తీసుకెళతాం. కదిరిలో స్కానింగ్ కేంద్రాల్లో నిపుణుల కొరత సమస్య పరిష్కరిస్తాం. మడకశిరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే రోగులకు సమస్య ఉండదు. ఈ సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

## నిల్వలున్నా.. నిర్వహణ నీరుగారుతోంది

నాయుడుపేట : తెలుగుగంగ బ్రాంచి కాలువలపై ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడటం, నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల్లో 1.33 లక్షల ఎకరాలకు తెలుగుగంగ ఐదు, ఏడు బ్రాంచి కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ఈ ఏడాది సోమశిల, కండలేరు జలాశయాలకు పూర్తిస్థాయిలో నీటిమట్టం చేరడంతో రెండు నెలలుగా సాగునీరు విడుదల చేస్తున్నారు.

**నిండిన చెరువులకే మళ్లీ..**

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిండిన చెరువులకు మళ్లీ నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పలుచోట్ల మధ్యలో కట్టలు తెగి నీరు వృథాగా పోతోంది. రైతులకు అవస్థలు తప్పడం లేదు.

**అధ్వానంగా కాలువలు**



బ్రాంచి కాలువల నిర్మాణం పూర్తయి 25 ఏళ్లు కావొస్తున్నా పూడిక తీయలేదు. కొన్ని ప్రాంతాల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

కొందరు గట్లు ధ్వంసం చేయడంతో కాలువల్లో నీరు సాఫీగా వెళ్లడం లేదు. ఏడో బ్రాంచి కాలువ పరిధిలో పుదూరు, మిట్టకండ్రిగ, సీఎన్‌పేట, శ్రీనివాసపురం ప్రాంతాల్లో, ఐదు బ్రాంచి కాలువ పరిధిలో కొనేటిరాజుపాళెం, ముమ్మయపాళెం, ఓజిలి ప్రాంతాల్లో మైనరు కాలువలు మరమ్మతులకు గురయ్యాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ప్రధాన కాలువ నుంచి బ్రాంచి కాలువలకు సరఫరా చేసే నీటిని డీఈ, ఏఈ స్థాయిలో ఉన్న ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. ప్రణాళికాబద్ధంగా మేజరు, మైనర్ కాలువల ద్వారా చెరువులు, ఆయకట్టు భూములకు నీటిని సరఫరా చేయాలి. నీరు వృథా కాకుండా చూడాలి.

## కొండెక్కిన స్మార్ట్‌సిటీ

తిరుపతి : తిరుపతిలో స్మార్ట్‌సిటీ ఊసే లేకుండా పోయింది. తిరుపతి నగరపాలక సంస్థ ఆర్థిక సుస్థిరత సాధించే లక్ష్యంతో కేంద్రం దీన్ని ప్రకటించింది. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం పనులు ప్రారంభించినా.. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఐదేళ్లలో రాష్ట్రం వాటా పైసా కూడా విడుదల చేయలేదు. అప్పటికే ఖాతాల్లో ఉన్న సొమ్ములనూ ఊడ్చేసింది. దీంతో అసంపూర్తి ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కేంద్రం స్మార్ట్‌సిటీ పథకాన్ని రద్దు చేయడంతో ఆ ప్రాజెక్టులన్నీ దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అసంపూర్తి పనులు చేయడానికి రూ.405 కోట్లు అవసరం. తితిదే నుంచి స్మార్ట్‌సిటీ పథకానికి రావాల్సిన రూ.53 కోట్లు కూడా అందలేదని తెలుస్తోంది.

**ఆగిపోయినవి ఇవే..**

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ రూ.180 కోట్లు, సిటీ ఆపరేషన్ సెంటర్ రూ.94.50 కోట్లు, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సెంటర్ రూ.52.50 కోట్లు, రూ.30 కోట్లతో నిరంతర నీటి సరఫరా తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు ప్రాజెక్టుతో పాటు వినాయకసాగర్‌లో అదనపు అంతస్తులు, కూరగాయల మార్కెట్, వ్యాయామశాల, విద్యుత్ దీపాలంకరణ ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయి. గొల్లవానిగుంట పునరుద్ధరణ పనులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల వినాయకసాగర్‌లో రూ.3 కోట్ల విలువైన ఈత కొలను, గ్లోగార్డెన్ పనులు పూర్తి చేశారు.

**తప్పుకొంటూ, తప్పించుకుంటూ...**

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు పూర్తి చేయడం అసాధ్యమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఒక్కో ప్రాజెక్టు నుంచి అధికారులు తప్పుకొంటున్నారు. తూకివాకంలో రూ.22 కోట్లతో చేపట్టిన 6 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తి కాగా.. ఇప్పటికే రూ.14.30 కోట్లు బిల్లులు కూడా చెల్లించారు. పనులు చేయడంలో గుత్తేదారు నిర్లక్ష్యంతో టెండరు రద్దు చేశారు.

కరకంబాడి రోడ్డులో రూ.2 కోట్లతో కూరగాయల మార్కెట్ నిర్మాణం ప్రాజెక్టు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గుత్తేదారు టెండరు రద్దు చేశారు.



గొల్లవానిగుంటలో వద్ద రూ.2 కోట్ల స్టేడియం, రూ.2 కోట్ల క్రికెట్ మైదానాన్ని స్మార్ట్‌సిటీ నుంచి శాప్‌నకు అప్పగించారు.

వినాయకసాగర్‌లోని రూ.1.76 కోట్ల విలువైన మల్టీపర్పస్ హాల్, రూ.2 కోట్ల విలువైన యోగా కేంద్రం, రూ.1.86 కోట్ల చిన్నారుల ఆటస్థలం ప్రాజెక్టులను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

దిష్టిబొమ్మల్లా భవనాలు

మొత్తం ప్రాజెక్టులు: 97

ప్రాజెక్టు విలువ: రూ.1586 కోట్లు

పూర్తయినవి: 83

విలువ: రూ.1148 కోట్లు

అసంపూర్తి: 14


విలువ: రూ.438 కోట్లు

# 'దయా'లసిస్ చూపాలి

ఆళ్లగడ్డ : ఉయ్యాలవాడ మండలం మాయలూరుకు చెందిన ఓ వ్యక్తి మూత్రపిండాలు దెబ్బతిన్నాయి. దయాలసిస్ చేయించుకునేందుకు 108లో నంద్యాల వెళ్లేవారు. గతేడాది చివరి నుంచి సేవలు రద్దవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తన భార్యను వెంట తీసుకెళ్లాల్సి వస్తోంది. మాయలూరు నుంచి కోవెలకుంట్లకు చేరుకుని 30 కి.మీ. దూరంలో ఉన్న నంద్యాల వెళ్లాల్సి వస్తోంది.

మూత్రపిండాల పనితీరు మందగించి దయాలసిస్ (రక్త శుద్ధి) చేసుకునే రోగులకు గతంలో 108 ద్వారా ఉచిత రవాణా సేవలందేవి. గతేడాది నవంబరు నుంచి బాధితులకు ఈ సేవలు అందడం లేదు. ఫలితంగా రోగులే వ్యయప్రయాసలకోర్చి దయాలసిస్ కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

**పదుల సంఖ్యలో బాధితులు**



ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు సర్వజన ఆసుపత్రి, ఆదోని, నంద్యాల ప్రభుత్వ వైద్యాలయాల్లో దయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 108 వాహనాలు 54 వరకు ఉన్నాయి. ప్రతిరోజూ సుమారు 30 నుంచి 40 మంది బాధితులు రక్త శుద్ధి చేయించుకుంటుంటారు. 108 అందుబాటులో ఉంటే వాహనంలో ఆక్సిజన్ అందించి రోగికి సాంత్వన చేకూర్చి తీసుకెళ్తుంటారు. ప్రస్తుతం సేవలు ఆగిపోవడంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారింది.

**ఇబ్బందులు తొలగించాలి**

ఉచిత ప్రయాణ సౌకర్యం ఆగిపోవడంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వం బాధితులకు ప్రతి నెలా రూ.10 వేలు అందజేస్తోంది. ఇది మందులకే సరిపోతోంది. ఈ పరిస్థితుల్లో దయాలసిస్ కోసం జిల్లా ఆసుపత్రులకు వెళ్లడం కష్టంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం స్పందించి 108 వాహనాలను బాధితులకు అందుబాటులోకి తీసుకొస్తే వారి ఇబ్బందులు తొలగుతాయి.

# కదిలే రైలును కమ్మేసిన నిప్పు

అనకాపల్లి : 'టాటా-ఎర్నాకుళం' ఎక్స్‌ప్రెస్‌లో అగ్నికీలలు రేగి రెండు బోగీలు దగ్ధమైన ఘటన సంచలనం కలిగించింది. ఈ రైలులోని బీ1, ఎం2 బోగీలకు నిప్పంటుకోవడం గమనించి హుటాహుటిన రైలులోని ప్రయాణికులందరినీ కిందకు దించేశారు. ఓపక్క వణికించే చలి.. మరోపక్క ఏం జరుగుతోందో.. ఎప్పటికి తిరిగి బయలుదేరతామో తెలియని అయోమయ పరిస్థితులతో ప్రయాణికులంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. నష్టం మరింత పెరగకుండా నివారించడం, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు అందించడంలో యంత్రాంగం సఫలమైంది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రైల్వే, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించారు. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సొనాకియా, ప్రత్యేక రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, రైల్వే డీఐజీ బి.సత్యఏసుబాబు, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ దగ్గరుండి సహాయక చర్యలు పర్యవేక్షించారు. అగ్నిమాపక సిబ్బంది ఆగమేఘాలపై తరలివచ్చారు. ఎలమంచిలి నుంచి శకటం వెనువెంటనే చేరుకుంది. దీనికితోడు అనకాపల్లి నుంచి రెండు, నక్కపల్లి నుంచి ఒకటి చొప్పున అగ్నిమాపక వాహనాలు రప్పించారు. వీరంతా దాదాపు రెండుగంటలపాటు నిర్విరామంగా శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

పోలీసులు : సుమారు రెండు వేలమంది ప్రయాణికులతో స్టేషన్ ఆవరణ కిక్కిరిసింది. స్థానిక సీఐ ధనుంజయరావు సహాయక చర్యలకు ఆటంకం లేకుండా ప్రయాణికులు అందరినీ బయటకు పంపించారు. ఎవరైనా గాయపడితే వెంటనే వైద్యసేవలందించేలా అంబులెన్స్‌లు రప్పించారు.

రైల్వే: రైలు నుంచి పూర్తిగా కాలిపోయిన బోగీలతోపాటు పాక్షికంగా కాలిపోయిన బోగీలను తప్పించారు. ఆ బోగీల్లో ప్రయాణికులను తరలించడానికి మూడు పల్లెవెలుగు బస్సులను రప్పించారు. అందులో వీరిని సామర్లకోట తరలించారు. మిగిలిన ప్రయాణికులను ఎక్కించుకుని రైలు బయలుదేరింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా రైళ్ల రాకపోకలకు పెద్దగా ఆలస్యం కాకుండా పక్కట్రాక్‌పై నుంచి రాకపోకలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. 3.20 గంటలకు తొలిగా తిరుపతి-బిలాస్‌పూర్ రైలు ఎలమంచిలి స్టేషన్‌కు చేరుకుని తిరిగి పయనమైంది.

**సమగ్ర విచారణ చేస్తున్నాం**

సత్య ఏసుబాబు, డీఐజీ, రైల్వే

ఎలమంచిలి స్టేషన్‌కు కొన్ని నిమిషాల్లో రైలు చేరుతుండగా.. సిబ్బంది మంటలను గుర్తించి స్టేషన్‌లో నిలుపుదల చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని ప్రమాదాన్ని తగ్గించారు. మంటలు చెలరేగడానికి కారణాలపై సమగ్ర విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తాం.

**టీటీఈ నిద్ర లేపారు**

సూర్యప్రకాష్, విశాఖపట్నం

సేలం వెళ్లడానికి దువ్వాడలో రైలు ఎక్కాను. రైలు అప్పటికే బాగా ఆలస్యంగా రావడంతో ఎక్కిన వెంటనే పడుకున్నాను. బి1 లో ప్రయాణిస్తున్న నన్ను టీటీ వచ్చి రైలు కాలిపోతోంది, అత్యవసరంగా దిగిపోవాలని చెప్పారు. అప్పటికే బోగీలో మంటలు పెద్దగా వస్తున్నాయి. తలదగ్గరపెట్టుకున్న హ్యాండ్ బ్యాగ్ మాత్రమే తీసుకుని సీటుకింద ఉన్న లగేజి వదిలేసి బయటకు పరుగు తీశాను. నావెనుక చాలామంది కంగారుగా దిగారు. చిన్నతొక్కిసలాట జరిగింది. టీటీఈ సకాలంలో లేపడంతో ప్రాణాలతో బయటపడ్డాం.

**కట్టుబట్టలే మిగిలాయి...**

మస్తగిరి బిస్వాజ్, టాటానగర్‌భార్య, ఇద్దరు పిల్లలతో టాటానగర్ నుంచి ఎర్నాకుళం బయలుదేరాం. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయాం. దుస్తులు, డబ్బులు టికెట్లు అన్ని బ్యాగ్‌లో ఉన్నాయి. బోగీలో మంటలు వస్తున్నాయని కోచ్ బాయ్ కంగారుగా వచ్చి చెప్పాడు. ఇద్దరం చెరో బిడ్డను పట్టుకుని పరుగుపరుగున కిందికి దిగాం. తక్కువ సమయంలో మంటలు వ్యాపించాయి. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. చేతిలో రూపాయి లేదు. టికెట్లు, ఆధార్ కార్డులు, బ్యాగ్‌లో పెట్టిన ఫోన్ కాలిపోయాయి. భార్య బిడ్డలను స్టేషన్ బయట దించి మళ్లీ బోగీ వద్దకు వెళ్లాను. బ్యాగులు తెచ్చుకుందామని చూసినా బోగీ ఎక్కడుందో కనిపించనంత దట్టంగా పొగ వ్యాపించింది. ప్రాణాలు పోతాయని సాహసం చేయలేదు.

**అరుపులు విని లేచాను...**ఎస్.కె.రెహమాన్ ఎం1 బోగీలో ప్రయాణికుడు. పశ్చిమబెంగాల్లో ఉంటున్న నేను పాల్‌ఘాట్ వెళ్లడానికి ఈ రైలు ఎక్కాను. బయలుదేరిన దగ్గర నుంచే ఆలస్యంగా నడుస్తోంది. దువ్వాడలో భోజనంచేసి పడుకున్నాను. గాఢ నిద్రలో ఉండగా బోగీలో ఒక్కసారిగా అరుపులు, కేకలు వినిపించడంతో ఉలిక్కిపడి లేచాను. అప్పటికే ఒకవైపు నుంచి బోగీలో మంటలు వస్తున్నాయి. దట్టంగా ఉన్న పొగతో దిగడానికి కూడా దారి సరిగా కనిపించలేదు. చాలా ఇబ్బంది పడ్డాం. మరో పదినిమిషాలు లోపల ఉంటే అదోరకమైన వాసనతో వచ్చే ఆ పొగకి అక్కడే చనిపోయే వాళ్లం.

# మేమింతే... మారమంతే



తాడేపల్లిగూడెం : రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి పెచ్చుమీరుతోందనడానికి ఈ ఉదంతాలే నిదర్శనం. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై మూడేళ్లలో 357 ఫిర్యాదులు వచ్చాయంటే అక్రమార్కుల హవా ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొగల్తూరు, ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బందిపై చర్యలు తీసుకొని అనిశా సోదాలు చేస్తున్నా వసూళ్ల పర్వం ఆగడం లేదు. సమస్యలు పరిష్కారం కావడం లేదు.

**ఇదే అవకాశమని..** సామాన్యులకు ఇబ్బందులు లేకుండా వారసత్వ ఆస్తిని కుటుంబ సభ్యుల పేరిట నామమాత్రపు ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇదే అదనుగా కొందరు వసూళ్లకు తెరతీశారు. లేనిపోని కొర్రీలు సృష్టిస్తూ ఆస్తి విలువ ఆధారంగా ఒక్కో డాక్యుమెంటుకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

**ప్రైవేటు వ్యక్తుల హవా**

తాడేపల్లిగూడెం, నరసాపురం, పెనుగొండ తదితర సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగుతోందని, చేతులు తడిపితే గానీ పనులు కావడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ అధికారిపై పలు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆస్తి విలువను బట్టి రిజిస్ట్రేషన్ విలువలో రెండు శాతం వరకు డిమాండ్ చేయడంతో పంచాయితీ ఎమ్మెల్యే వరకు వెళ్లింది. దీనిపై జిల్లా ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రోజులకోసారి సబ్ రిజిస్ట్రార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని.. ఫిర్యాదులపై తక్షణం విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. లేఅవుట్ వేసిన 266.6 చదరపు గజాల మా స్థలాన్ని వేరొకరు వారి కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, న్యాయం చేయాలని 2022లో జిల్లా రిజిస్ట్రారు కార్యాలయంలో ఫిర్యాదు చేశాను. 2023లో మళ్లీ ఫిర్యాదు చేయగా పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల వెళ్లి అడగ్గా మీ దరఖాస్తు కనిపించడం లేదు, మళ్లీ ఫిర్యాదు చేయాలన్నారు.

జోగి నర్సింహులు, పాలకొల్లు

నా భార్య ఇటీవల కాలం చేసింది. ఆమె నుంచి సంక్రమించిన ఆస్తిని కుమార్తె, కుమారుడు పేరిట రాసేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా రూ.35 వేలు వసూలు చేశారు.

కూనపురెడ్డి వీరవెంకట విజయరంగారావు, నరసాపురం

పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో వేర్వేరు సర్వే నంబర్లలో 0.56 సెంట్లు, 0.49 1/2 సెంట్లు 45 ఏళ్లుగా అనుభవంలో ఉన్న వ్యవసాయ భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేరొకరి పేరుమీద నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారు.

తమ్మా శివరామిరెడ్డి, గుంటూరు జిల్లా

# సాగు.. 'కాడి'న పడక



నంద్యాల : రబీ సీజన్‌లో పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. మూడు నెలలవుతున్నా పురోగతి కానరావడం లేదు. తుంగభద్ర జలాశయం నుంచి నీరు వదలడం లేదని జలవనరుల శాఖ అధికారులు తేల్చి చెప్పడంతో కర్నూలు జిల్లా పరిధిలో పలువురు రైతులు వరి సాగుకు వెనుకడుగు వేస్తున్నారు. గతంలో రబీ సీజన్‌లో వేరుసెనగ విత్తన కాయలను రాయితీపై ఇచ్చేవారు.. ఈసారి ఇవ్వకపోవడంతో సాగుపై ప్రభావం చూపింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీలో 2.81 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా ఇప్పటివరకు 1.96 లక్షల హెక్టార్లలోనే వివిధ పంటలు సాగయ్యాయి. 83,315 హెక్టార్లలో రైతులు సాగు చేపట్టలేదు. ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతినడం.. పెట్టుబడులు పెరిగిపోవడం.. గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో 'కాడి' గాడిన పడలేదు.

**28,737 హెక్టార్లలో విత్తు పడక..**

రబీ పంట కాలం మరో నెలలో ముగియనుంది. వర్షాధారం కింద సాగుకు అవకాశం లేకుండా పోయింది.. ఉమ్మడి జిల్లాలో పప్పుశనగ ప్రధానంగా సాగవుతుంది. ఈ సీజన్‌లో కర్నూలులో 38,239, నంద్యాలలో 52,518 కలిపి మొత్తం 90,757 హెక్టార్లలోనే సాగైంది. 1.19 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా.. 28,737 హెక్టార్లలో విత్తు పడకపోవడం గమనార్హం.

గతంలో 1.70 లక్షల హెక్టార్లలో పప్పుశనగ సాగవగా.. ఈసారి దారుణంగా పడిపోవడం గమనార్హం.

**సాధారణంకన్నా పడిపోయి..**

రబీలో రెండో ప్రధాన పంట జొన్న. కర్నూలులో 4,017, నంద్యాలలో 27,534 హెక్టార్లలో కలిపి ఉమ్మడి జిల్లాలో 31,551 హెక్టార్లలో సాగవుతోంది. నంద్యాలలో 94 శాతం మేర సాగు చేయగా.. కర్నూలులో 41 శాతం మాత్రమే రైతులు పంట వేశారు.

వరి సాగు సైతం అంతంతమాత్రంగానే ఉంది. నంద్యాల జిల్లాలో 29,084 హెక్టార్ల సాధారణ సాగు కాగా కేవలం 10,891 హెక్టార్లలో మాత్రమే నాటారు. కర్నూలులో సాధారణ సాగు 4,314 హెక్టార్లకు గాను కేవలం 40 హెక్టార్లలో మాత్రమే సాగవుతోంది.

రబీ సీజన్‌లో రాయితీపై వేరుసెనగ విత్తనాలు ఇవ్వలేదు. ఈ ప్రభావం సాగుపై పడింది. కర్నూలులో 15,499 హెక్టార్లు సాధారణం కాగా.. బోరు బావుల కింద కేవలం 2,642 (17 శాతం), నంద్యాలలో 3,058 హెక్టార్లు సాధారణం కాగా కేవలం 1,455 హెక్టార్లలో మాత్రమే విత్తు పడింది.

**మొక్కజొన్నపై మక్కువ**

ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న సాగు అనూహ్యంగా పెరిగింది. సాధారణానికి మించడం విశేషం. ఉమ్మడి జిల్లాలో 18,590 హెక్టార్ల సాధారణ సాగుకు గాను కర్నూలు 7,426, నంద్యాల 22,936 కలిపి ఉమ్మడి జిల్లాలో 30,362 హెక్టార్లలో సాగవుతుండటం విశేషం. ఖరీఫ్‌లో గిట్టుబాటు ధరలు రాక పోయినా చాలామంది రైతులు రబీలో అత్యధికంగా సాగు చేయడం విశేషం.

# మర ఆడించి.. విలువ జోడించి



ఎమ్మిగనూరు : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్మితే రైతులకు గిట్టుబాటు కావడం లేదు. అదే బియ్యంగా మార్చి విక్రయిస్తే అధిక ఆదాయం వస్తుంది. ఈ విధానంతో దళారుల బెడద, వ్యాపారుల మోసాల బారిన పడకుండా తప్పించుకోవచ్చు. దీనినే పలువురు రైతులు గత కొన్నేళ్లుగా అనుసరిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. కల్తీ లేని బియ్యం కొనేందుకు వినియోగదారులు సైతం అధిక ధర చెల్లించేందుకు వెనకాడటం లేదు. విలువ ఆధారిత ఉత్పత్తులతో అదనపు ఆదాయం లభిస్తోంది.

**దళారుల బెడద దూరం**

బియ్యంగా మార్చి విక్రయించడం ద్వారా దళారుల బెడద ఉండదు. తూకాల్లో మోసం, కొందరు వ్యాపారులు డబ్బు ఎగ్గొట్టడం వంటివి ఉండవు. పశ్చిమ ప్రాంతంలోని గుడేకల్, నదీ తీర ప్రాంతాలైన గురుజాల, నాగలదిన్నె, కాచాపురం తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు కొన్నేళ్లుగా ఈ విధానాన్ని అనుసరించి ఆదాయం పొందుతున్నారు.

**రూ.20 వేల అదనపు ఆదాయం**

ఈ ఏడాది అధిక వర్షాలతో ఎకరాకు 20 క్వింటాళ్ల వరి ధాన్యం వచ్చింది. క్వింటా రూ.2 వేల నుంచి రూ.2,100 వరకు పలుకుతోంది. ఈ లెక్కన రూ.42 వేలు వస్తుంది. మర ఆడిస్తే క్వింటాకు 68-70 కిలోల బియ్యం వస్తుంది. ఎకరాకు 14 క్వింటాళ్ల బియ్యం వస్తుంది. మార్కెట్లో క్వింటా రూ.4 వేలు అమ్ముడుపోతోంది. రైతులు నేరుగా అమ్ముతుండటంతో పలువురు క్వింటా రూ.500 అధిక ధర చెల్లించి తీసుకుంటున్నారు. మర ఆడించడంతో రూ.63 వేలు వస్తుంది. విలువ ఆధారిత ఉత్పత్తితో ఎకరాకు రూ.20 వేల వరకు అదనపు ఆదాయం పొందుతున్నారు.**ఐదేళ్లుగా అమ్ముతున్నా**

రెండు ఎకరాల్లో వరి సాగు చేయగా 60 బస్తాల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.2,100కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఐదేళ్లుగా మర ఆడించి అమ్ముతున్నా. వినియోగదారులు బియ్యం క్వింటాకు రూ.500 వరకు అధికంగా చెల్లించి తీసుకుంటున్నారు.యేసేపు, హాలహర్వి, నందవరం మండలం

# ఆచితూచి ఎంపిక.. నైపుణ్యాలే ప్రాతిపదిక..!

విశాఖపట్నం: జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రాంగణ నియామకాల సందడి మొదలైంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలకే కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. ఇంజినీరింగ్ చివరి ఏడాదిలో ఉండగానే విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంగణ నియామకాల సమయంలో విద్యార్థులు తమ నైపుణ్యాల గురించి కంపెనీల ప్రతినిధులకు తప్పని సరిగా వివరించాలని నిపుణులు చెబుతున్నారు.

**అన్నింటినీ ప్రస్తావిస్తేనే..:** విద్యార్థులు రెజ్యూమ్ తయారు చేసుకోవడంపై వివిధ కళాశాలల్లో శిక్షణ ఇస్తున్నారు. అందులో విద్యార్హత, చేపట్టిన ప్రాజెక్టులు, ఇతర నైపుణ్యాలను ప్రస్తావించాలి. నేర్చుకున్న అంశాలనే నిజాయతీగా అందులో పేర్కొనాలి. ఇంటర్వ్యూ సమయంలో ఆయా అంశాల గురించి కంపెనీ ప్రతినిధులు అడిగినప్పుడు తడబడకుండా సమాధానం చెప్పగలగాలి.

**ప్రారంభం నుంచే దృష్టి పెట్టాలి**

విద్యార్థులు మొదటి ఏడాది నుంచే వర్క్‌షాప్‌లకు హాజరుకావాలి. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు పెంచుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. లేకుంటే

ప్రశ్నలు అడిగినప్పుడు తడబడే అవకాశముంది.

కొన్ని కళాశాలలు పాఠ్య ప్రణాళికలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశాయి. పరిశ్రమల్లో పనిచేసే సమయంలో కోడింగ్, ఇతర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సహకారంతో 3-2, 4-1 సెమిస్టర్లలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి 10 నుంచి 15 నిమిషాలు కేటాయించి ప్రశ్నలు అడుగుతున్నారు. చెప్పిన సమాధానాలు పరిశీలించి, విద్యార్థులు చేసిన



పొరపాట్లు, సరిదిద్దుకోవాల్సిన అంశాలను వివరిస్తున్నారు.

ఇంటర్వ్యూలో మార్కులు ఒక్కటే ప్రాతిపదిక కాదు. నైపుణ్యాలు, సాఫ్ట్‌స్కిల్స్, ఇతర అంశాలనూ పరిశీలిస్తారు. ఇంటర్వ్యూలో కొంతైనా ఇంగ్లిషులో మాట్లాడాలి. మొదటి ఏడాది నుంచే ఇంగ్లిషులో మాట్లాడటం సాధన చేస్తే కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెరుగుతాయి. ఇంటర్వ్యూకు వెళ్లేటప్పుడు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.

జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు: 22

ఏటా ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు: 20 వేలకు పైగా..

ఏదో ఒక నైపుణ్యం అవసరం: మాక్ ఇంటర్వ్యూలతో విద్యార్థుల్లో మార్పు కనిపిస్తోంది. ఆత్మవిశ్వాసం పెరగడానికి ఇంటర్న్‌షిప్స్ ఉపయోగపడతాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు పోటీ ఎక్కువైంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఏదో ఒక నైపుణ్యం సాధించాలి. ప్రస్తుతం ఆన్‌లైన్ చదువులు పెరిగాయి. ఆన్‌లైన్‌లో చదివినప్పుడు బట్టీ పట్టకుండా సబ్జెక్టును అర్థం చేసుకోవాలి.

డి.సరిత, జీవీపీ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగ డీన్

# కావాలి.. రూ.58 కోట్లు!

నర్సీపట్నం : సాగునీటి వనరులన్నీ సక్రమంగా ఉంటే పొలాలకు సమృద్ధిగా నీరు అందుతుంది. తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి. అవి మరమ్మతులకు గురై ఏళ్ల తరబడి శాశ్వత మరమ్మతుకు నోచుకోకపోతే ఎప్పుడు గండిపడుతుందో... పొలాలను ముంచెత్తి ఎక్కడ నష్టపోతామని రైతులు బెంగ పడుతుంటారు. వ్యవసాయం ప్రాధాన్యాంశంగా సకాలంలో నిధుల విడుదల చేస్తేనే ఆయకట్టుకు మేలు జరుగుతుంది. జలవనరులశాఖ నర్సీపట్నం డివిజన్‌లోని నాలుగు నియోజకవర్గాల్లో చెరువులు, ఆనకట్టలు, కాలువలు, జలాశయాల కింద 1,23,676 ఎకరాల ఆయకట్టు ఉంది. మొంథా తుపాను సమయంలో సాగునీటి కట్టడాలు పలుచోట్ల దెబ్బతిన్నాయి. కాలువలకు గండ్లు పడ్డాయి. మొత్తంగా మరమ్మతులకు రూ.58 కోట్లు అవసరమని అంచనా.

ఇవిగో ఉదాహరణలు..

నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలంలోని రావణాపల్లి జలాశయం ప్రధాన గట్టు నాలుగు నెలల క్రితం రెండు అడుగుల మేర కుంగిపోయింది. తాత్కాలికంగా ఇసుకబస్తాలు వేసి నీటి లేకుండా చుశారు. శాశ్వత మరమ్మతుకు రూ.2.20 కోట్లు అవసరం. గట్టు పటిష్ఠ పర్చకపోతే గండి పడే ప్రమాదం ఉంది. ఏడాదిన్నర క్రితం రావణాపల్లి మదుం కోతకు గురైంది. ఇప్పటికీ ఇసుక బస్తాలే దిక్కు.

మాకవరపాలెం మండలంలో జాగారం గెడ్డకు గండిపడి పొలాలు ముంపునకు గురయ్యాయి. రక్షణ గోడకు రూ.40 లక్షలు అవసరం.

ఎలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం రజాల గ్రామం సమీపంలో శారదానది కుడి వరదగట్టు అక్టోబరు నెలాఖరులో 140 మీటర్ల మేర కొట్టుకుపోయింది. వ్యవసాయ భూములు మునిగిపోయాయి. చేపల చెరువులకు నష్టం జరిగింది. శాశ్వత మరమ్మతులకు రూ. 2 కోట్లు అవసరమని అంచనా. ఇదే మండలం కొత్తూరు వద్ద ఏడుముళ్ల డ్యాం ఎగువ భాగంలో శారదానది కుడిగట్టు 120మీటర్ల మేర దెబ్బతింది. మరమ్మతుకు రూ. 1.6 కోట్లు అవసరమని అంచనా వేశారు.

చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం చీమలపాడు వద్ద అక్విడక్ట్ రాతికట్టు జారిపోయింది. మరమ్మతుకు రూ.30 లక్షలు కావాలి.

పాయకరావుపేట నియోజకవర్గంలో ముతా ఆనకట్ట, భూమి ఆనకట్ట గేట్లు పనిచేయడం లేదు. ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లి వద్ద వరాహ నది గట్టు 200 మీటర్లు కోతకు గురైంది. మరమ్మతుకు రూ.10 కోట్లు కావాలి. ప్రతిపాదన దస్త్రం ఆర్థికశాఖ అనుమతి కోసం చూస్తోంది.

నాణ్యంగా పనులు... ఏప్రిల్ మొదటి వారంలో నిధులిస్తే పనులన్నీ నాణ్యతగా చేయడానికి వీలుంటుంది. రానున్న ఖరీఫ్ పంట కాలానికి సాగునీటి వనరులన్నీ సిద్ధం చేసుకోవచ్చు. తాండవ ప్రాజెక్టు కాలువలకు అత్యవసరంగా రూ.12 కోట్లు అవసరం. ఈ విషయం సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లాం.

కరక సత్యనారాయణ, తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్

నిధుల కోసం నివేదిక పంపాం.. క్షేత్ర పరిశీలన చేసి 261 చోట్ల శాశ్వత మరమ్మతులు అవసరమని గుర్తించాం. ఇందుకోసం రూ.58 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశాం. నవంబరులో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం. వచ్చే ఏడాది ఖరీఫ్‌కి ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నదే ఆశయం.

వెలమల బాలసూర్యం, ఈఈ, జలవనరులశాఖ

## 'పచ్చని' వేదిక.. పర్యావరణానికి కానుక..!

ఆరిలోవ : నగర పర్యావరణానికి పచ్చని హారంలా భాసిల్లుతోంది చినగదిలి లోని జీవీఎంసీ నర్సరీ. 20ఏళ్ల కిందట దీన్ని ఏర్పాటు చేశారు. నగర అవసరాలకు అవసమైన వివిధ రకాల మొక్కలను సేకరించి ఇక్కడ సంరక్షిస్తున్నారు. నగరంలో రహదారులకు ఇరువైపు లా, విభాగినులపై నాటేందుకు మొక్కలను ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నారు.వేప, రావి, కానుగ మొక్కలతో పాటు ఎర్ర తురాయి, టాబోబియా, బోగన్‌విల్లా వంటి పువ్వుల రకాలు ఇక్కడ ఉన్నాయి. పక్షులు, ఉడతలు, కీటక జాతులకు ఆహారంగా ఉపయోగపడే సపోటా, మామిడి, జామ, సీతాఫలం, కొబ్బరి తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వీటిని కడియం నుంచి తెప్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.ప్రస్తుతం నర్సరీలో 40 వేల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జీవీఎంసీ ఉద్యాన విభాగ డీడీ ఎం.దామోదరరావు తెలిపారు.



**కమిషనర్ అనుమతితో..**

పాఠశాలలు, కళాశాలలు, ఆలయాల ప్రాంగణంలో నాటేందుకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అవసరమైనవారు జీవీఎంసీ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఉచితంగా మొక్కలు తీసుకున్నవారు వాటిని సంరక్షిస్తామని భరోసా ఇవ్వాలి.

**సంరక్షణ ఇలా..**ఇక్కడ మొక్కల సంరక్షణకు ఆరుగురు జీవీఎంసీ సిబ్బంది, రక్షణ కోసం సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. తెగుళు
,, కీటకాలు ఆశించకుండా ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేస్తున్నారు. ఈ ఏడాది జులై నెలలో విశాఖ పోర్టు ట్రస్టు వివిధ రకాలకు చెందిన లక్ష మొక్కలను నర్సరీకి వితరణగా అందించిందని దామోదరరావు తెలిపారు. అవసరమైన ఇతర మొక్కలను కడియం నర్సరీల నుంచి తెప్పిస్తున్నామన్నారు.

## ప్రయాణానికి రాజమార్గం

నక్కపల్లి, : అనకాపల్లికి చెందిన కుమార్ కారులో తుని వెళ్లి వస్తే నక్కపల్లి మండలం కాగిత టోల్‌ప్లాజా ఫీజు రూ.225 ఫాస్టాగ్ నుంచి కట్ అయింది. అడ్డురోడ్డుకు చెందిన నాగేశ్వరరావు జీపులో రాజమహేంద్రవరం వెళ్లి రాగా రెండు టోల్‌ప్లాజాల్లో కలిపి రూ.60 మాత్రమే చెల్లింపు జరిగింది. ఈయన ఫాస్టాగ్‌తోపాటు రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను వినియోగిస్తుండటంతో ఈ వెసులుబాటు కలిగింది. జాతీయ రహదారిపై ప్రతి 80 కిలోమీటర్లకు ఓ టోల్‌గేట్‌ను దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సగటున కారు, జీపు అయితే రూ.140 వరకు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా నిర్దేశించిన వాహన యజమానులకు ఆర్థికంతా ఊరట లభిస్తోంది.

**యాప్ వినియోగించుకోవాలంటే..**

సొంత అవసరాల నిమిత్తం తిరిగే కార్లు/జీపులు/వ్యాన్‌లకు మాత్రమే ఉపయోగపడుతుంది. (వైట్ నంబర్ ప్లేట్)

ఫాస్టాగ్ ఉన్న వారు తమ స్మార్టు ఫోన్‌లో ప్లేస్టోర్‌కు వెళ్లి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో వాహన నంబరు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. రవాణా శాఖ నుంచి వాణిజ్యేతర వాహనాల వివరాలను తీసుకుని కేంద్రం యాప్‌లో అప్‌డేట్ చేసింది. తనుగుణంగా ఉన్న వాహనాల వివరాలే ఇందులో నమోదవుతాయి.



అర్హత పొందిన వారు ఒకేసారి రూ.3 వేలు ఆన్‌లైన్‌లో రీఛార్జి చేసుకుంటే ఏడాది కాలంలో 200 సార్లు దేశ వ్యాప్తంగా ఏ జాతీయ రహదారి, జాతీయ ఎక్స్‌ప్రెస్ వే టోల్‌గేట్ల నుంచి రాకపోకలు సాగించొచ్చు. టోల్‌ప్లాజాను ఓసారి దాటితే రూ.15 మాత్రమే కట్ అవుతుంది.గడువులోగా 200 ట్రిప్పులు పూర్తయితే మళ్లీ రీఛార్జ్ చేసుకోవచ్చు.టోల్‌ప్లాజా దాటిన తర్వాత ఇంకా ఎన్నిసార్లు రాకపోకలు సాగించవచ్చనే విషయాన్ని తెలుపుతూ సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది.రాష్ట్ర రహదారి టోల్‌గేట్ల నుంచి వెళ్లేవారు కచ్చితంగా ఫాస్టాగ్‌లో కొంత సొమ్మును నిల్వ ఉంచుకోవాలి. వీటికి రాజ్‌మార్గ్ యాత్ర యాప్ వర్తించదు. ఒకవేళ ఫాస్టాగ్‌లో సొమ్ము లేకుండా దాటితే ఆ మొత్తం రాజ్‌మార్గ్ యాత్ర యాప్ నుంచి మినహాయింపు జరిగి బ్లాక్ లిస్టులోకి వెళ్తుంది.

## కారిడార్‌లో మరిన్ని రోడ్లు

నక్కపల్లి : పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన పనుల్లో మరిన్ని రహదారులను నిర్మించేలా పరిశ్రమల శాఖ చర్యలు చేపడుతోంది. గ్రామాల మధ్య అనుసంధానం, ప్రధాన మార్గాల ఏర్పాటుపై దృష్టిసారించారు. నక్కపల్లి మండల పరిధిలో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంటుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. త్వరలోనే బొమ్మల పరిశ్రమ ఏర్పాటు కానుంది. బల్క్‌డ్రగ్, స్టీల్‌ప్లాంటుకు మరిన్ని భూములు అవసరం కావడంతో సీహెచ్‌ఎల్‌పురం, పెదతీనార్ల, వేంపాడు, నెల్లిపూడి, ఉద్దండపురం తదితర ప్రాంతాల్లో సేకరించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజయ్యపేట మొదలు డీఎల్‌పురం వరకు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.850 కోట్లు ఖర్చు చేయనున్నారు. పారిశ్రామిక కారిడార్‌కు చేరుకోడానికి వీలుగా కాగిత నుంచి రూ.26 కోట్లతో రహదారి నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటికే సగం వరకు పనులు పూర్తయ్యాయి. ఈ రహదారిని మరింత విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపారు. రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలాపురం, డీఎల్‌పురం పంచాయతీల మధ్య రోడ్లు, కాలువలు, పరిపాలన భవనాల నిర్మాణాలు చేస్తున్నారు. పరిశ్రమలకు కేటాయించిన భూముల మధ్య సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. ఇటీవల ఈ పనులు పరిశీలించేందుకు వచ్చిన పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ స్థానికులకు ఇబ్బందుల్లేకుండా మరిన్ని రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు.

పారిశ్రామిక నడవకు చేరేందుకు ప్రస్తుతం కాగిత మార్గం ఒక్కటే ఏర్పాటవుతోంది. అదనంగా సారిపల్లిపాలెం నుంచి ఉన్న హెటెరో రహదారిని విస్తరించడం, అడ్డురోడ్డు సమీపం నుంచి పెదతీనార్ల - గుడివాడ వరకు మరో రహదారికి ప్రతిపాదించారు. కాగిత నుంచి ఎన్.నర్సాపురం మీదుగా హెటెరో రోడ్డుకు అనుసంధానంగా రహదారి నిర్మాణం చేయనున్నారు.

# రిజర్వుడు స్థలాల్లో పాగా



గుత్తి : ఈ చిత్రంలో కనిపిస్తున్న పునాదులు గుత్తికి 5 కిలోమీటర్లలోని కొత్తపేట జగనన్న కాలనీ లేఅవుట్‌లోనివి. ఓ పంచాయతీ ప్రజాప్రతినిధి భర్త... సర్వేనంబరు 689లో సుమారు 20 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి పునాదులు వేశాడు. ఆయనకు తన గ్రామంతోపాటు గుత్తిలో రూ.కోట్లు విలువైన భవంతులు ఉన్నాయి. పేదల కోసమంటూ ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో వైకాపా నాయకులు పాగా వేశారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలని... అధికారంలో ఉన్నప్పుడు సామాజిక అవసరాలకు కేటాయించిన రిజర్వుడు స్థలాలను కబ్జా చేశారు. రూ.కోట్లు విలువైన వాటిని కాజేశారు. గుడి, బడికి కూడా కాసింత స్థలం లేకుండా పోయింది. గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు జగనన్న కాలనీల్లో అక్రమార్కులు విలువైన స్థలాలను సొంతం చేసుకున్నారు. మరోవైపు పేదల ముసుగులో కొందరు వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్లాట్లు దండుకున్నారు.

**ఎక్కడ.. ఏమి చేశారంటే..**

గుత్తిలోని సర్వేనంబరు 689లో సుమారు 600 మందికి గత ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చింది. కొత్తపేట లేఅవుట్‌లోని కాలనీలో రిజర్వుడు స్థలాన్ని అప్పట్లో అధికారులు కేటాయించారు. అక్కడ ఓ యువనాయకుడు సుమారు 2ఎకరాల భూమిని ఆక్రమించుకుని.. ప్లాట్లు వేసి ఇతరులకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు. సుమారు 40 మంది స్థలాలను ఆక్రమించి పునాదులు వేసుకున్నారు. లచ్చానిపల్లి రోడ్డులోని సర్వేనంబరు 642లో ఎకరా స్థలాన్ని వైకాపా నాయకులు దొడ్డిదారిన పట్టాలు మంజూరు చేయించుకున్నారు.

చెట్నేపల్లిలోని సర్వేనంబరు 122-సిలో జగనన్న లేఅవుట్ వేశారు. అక్కడ రిజర్వుడు స్థలాన్ని కేటాయించగా ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించింది. తాజాగా కొందరు చోటా నాయకులు మిగిలిన ఖాళీ స్థలంలో ప్లాట్లు వేయడానికి పావులు కదుపుతున్నారు.

గుంతకల్లు దోనిముక్కల రోడ్డులోని కాలనీలో కొందరు నాయకులు వందల సంఖ్యలో ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నారు.

తాడిపత్రిలో నాలుగు జగనన్న లేఅవుట్లను వేయగా అప్పటి నాయకులు స్థలాలను కొట్టేశారు. 20సెంట్ల స్థలంలో ఇద్దరు నాయకులు పునాదులు వేసుకున్నారు. ఉరవకొండలోని రాయంపల్లి దారిలో ఉన్న లేఅవుట్‌లో సుమారు 50 మంది వైకాపా మద్దతుదారులు, నాయకులు మూడు సెంట్లు చొప్పున స్థలాలను ఆక్రమించారు.

**పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం**

-మారుతీప్రసాద్, టీపీవో, గుత్తిజగనన్న లేఅవుట్లలో రిజర్వుడు స్థలాలపై క్షేత్రస్థాయిలో విచారిస్తాం. ఆక్రమణదారుల నుంచి స్థలాలను తిరిగి తీసుకుంటాం. సాధారణంగా ప్రైవేట్ లేఅవుట్లలో ఎకరాకు పదిసెంట్లు స్థలం వస్తుంది. జగనన్న లేఅవుట్లలో రిజర్వుడు స్థలాలు ఇచ్చారో లేదో పరిశీలించి తగు చర్యలు చేపడతాం.

# ఆగలేదు.. అంతేలేదు..



పుత్తూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా చిత్తూరు జిల్లాలో వైకాపా నేతల ఇసుక అక్రమ వ్యాపారం ఆగడం లేదు. గత ఐదేళ్లలో అందినకాడికి అడ్డగోలుగా ఇసుక తరలించి రూ.కోట్లు దోచుకున్నారు. ఇప్పటికీ వారి హవానే సాగుతుండటం గమనార్హం. ప్రకృతి వనరులను చెరబట్టిన ఆ నేతలు తాజాగా శ్మశానాలనూ వదలడం లేదు. అక్కడి ఇసుకను దర్జాగా రాత్రివేళ ఇటు తమిళనాడు.. అటు కర్ణాటకకు తరలిస్తున్నారు.

కుశస్థలి నది పరివాహకానికి ఆనుకొని పలు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలోని వారంతా గట్లపై శ్మశానాలు ఏర్పాటు చేసుకున్నారు.. కొందరు ఇసుకాసురులు ఆయా శ్మశానాలను సైతం వదలకుండా తవ్వేస్తుండటం గమనార్హం.

కుశస్థలి నది పరివాహక ప్రాంతం అటు తమిళనాడు, ఇటు ఆంధ్ర ప్రాంతాల్లోను పారుతుంది. నగరి మండలం తెరణి వద్ద రాత్రీ పగలూ తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు వారిని అడ్డుకునే ప్రయత్నం చేసి గ్రామస్థులు విఫలమయ్యారు. నిత్యం వందల ట్రాక్టర్లతో తరలిస్తుండటంతో ఆ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని రైతులు వాపోతున్నారు.

**ఆగని అక్రమాలు..**

చిత్తూరు జిల్లాలో కార్వేటినగరం ప్రాంతం నుంచి విజయపురం వరకు 28 కి.మీ. మేర కుశస్థలి నది పరివాహకం ఉంది. ఏటా వర్షాకాలంలో ఈ నదిలో వరద ప్రవహిస్తే భారీగా ఇసుక చేరుతుంది. ఇది ఇసుకాసురులకు కాసులు కురిపిస్తోంది. గత వైకాపా హయాంలో రీచ్‌లు ఏర్పాటు చేసి బుకింగ్ చేసుకున్న వారికి అమ్మింది కొంతే. అక్రమంగా సరిహద్దులు దాటించిందే అధికం.

**ప్రశ్నిస్తే దాడు..**

కుశస్థలి నది పరివాహక ప్రాంతంలో అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమపైనే అక్రమార్కులు దాడులు చేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నా లెక్కచేయడం లేదని చెబుతున్నారు. మరోవైపున నదిలోకి ప్రవేశించకుండా పలు గ్రామాల్లో యువత అడ్డుకుంటున్నా వారిపై తెగబడుతుండటం గమనార్హం. రాత్రికిరాత్రి ఆయా మార్గాల్లో వాహనాలు రాకుండా నదిలో పలుచోట్ల కందకాలు తవ్వుతున్నా వాటిని పూడ్చేసి మరీ అక్రమాలకు బరితెగిస్తున్నారంటే వారికున్న పలుకుబడి అలాంటిది మరి.

**దాడులు నిర్వహిస్తాం..**

ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వం ఇసుక రీచ్‌ల ద్వారా విక్రయిస్తోంది. అక్కడి నుంచే ట్రాక్టర్ల యజమానులు ఇసుక తీసుకెళ్లాలి. అలాకాక అక్రమంగా తరలించడం నేరం. పట్టుబడితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం. ఎవరినీ ఉపేక్షించం.సత్యనారాయణ, డీడీ, గనులశాఖ, చిత్తూరు

# ఊడలు దిగి.. మేడలు ఎదిగి

తిరుపతి : తిరునగరిలో అక్రమ కట్టడాల తీవ్రత ఏస్థాయిలో ఉందో.. వాటివెనుక అవినీతి ఊడలు ఎంతగా విస్తరించాయో మంత్రి మాటలే నిదర్శనం. ఆయన హెచ్చరికల తదనంతరమూ పట్టణ ప్రణాళిక విభాగంలో చలనం లేదు. ఒకట్రెండు నిర్మాణాలు కూల్చివేసి లోపాయికారిగా సహకరిస్తుండటంతో నగరం వరద, ట్రాఫిక్ వంటి పీకల్లోతు సమస్యల్లోకి జారుకుంటోంది.

**ఉల్లంఘనలు వేలల్లో..**

వాస్తవానికి నగరంలో పదివేలకు పైగా అక్రమ కట్టడాలు, అనధికారిక, నిబంధనలకు విరుద్ధంగా, అనుమతుల్లేని కట్టడాలు ఉంటాయని అంచనా. వాటిలో వేయివరకు గుర్తించినా చర్యలకు అడుగులు పడటం లేదు.

**ప్రభుత్వం గడువు విధించినా..**

గత ప్రభుత్వంలో అక్రమాల జోరుతో సచివాలయ కార్యదర్శులతోనే పాలన సాగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇక్కడ తిష్ఠవేసిన అధికారులు వారి అండతో అక్రమాల సామ్రాజ్యం విస్తరించారు. అనుమతులు లేని, అనుమతులు రాని ప్రాంతాల్లో భవనాలు నిర్మించుకు నేలా బేరం కుదుర్చుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం అక్రమ భవనాల వ్యవహారంలో కఠినంగా వ్యవహరిస్తుండటం, ఆగస్టు 31 తరువాత నిర్మించిన అనుమతులు లేని భవనాలు, అదనపు అంతస్తులను కూల్చివేయాలని కఠినంగా ఆదేశించడంతో లోపాయికారి ఒప్పందం ప్రకారం ఒకట్రెండు నిర్మాణాలు కూల్చి



తరువాత తమ పంథా కొనసాగిస్తున్నారు.

**ఎల్‌ఆర్‌ఎస్., బీపీఎస్ దరఖాస్తులు అందేనా?**

మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాలు పట్టణ ప్రణాళికాధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ ప్రకటించి నాలుగు నెలలవుతున్నా.. పదికిలోపు దరఖాస్తులు మాత్రమే ఆమోదించారు. బీపీఎస్‌కు రెండువేల దరఖాస్తులు రావొచ్చని అంచనా. ఇదేమని అడిగేవారు లేకపోవడంతో అక్రమ నిర్మాణదారులు లెక్కచేయడం లేదు.

## పగలు సేకరణ.. రాత్రుళ్లు రవాణా!

అనకాపల్లి : జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రజాప్రతినిధులు, పోలీసులు తప్పితే.. అక్రమ రవాణాను అరికట్టాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి నెలా రేషన్ బియ్యం లబ్ధిదారుల ఇళ్లకు చేరక ముందే అక్రమార్కుల పరమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ దందాను కట్టడి చేయాల్సిన సంబంధిత అధికారులే దళారులకు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ప్రతి మండలంలోనూ రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు ముఠాలున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. వీరి హవానే సాగుతోంది. చోడవరం, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో వీరికి ఎదురే లేదు. ఆయా మండలాల్లో రేషన్ బియ్యాన్ని దళారులే కొనుగోలు చేయాలన్న ఆదేశాలున్నాయి. పగలు దండటం, సమీపంలోని రైస్ మిల్లుల్లో నిల్వ చేయడం చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో లోడ్ చేసి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు. అధికారులు తమ టార్గెట్‌కు అనుగుణంగా.. దాడులు చేసి దళారుల సూచనల మేరకు నామమాత్రంగా కేసులు నమోదు చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. జిల్లాలో కార్డుదారుల నుంచి రేషన్ డీలర్లు కేజీ బియ్యం రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వీరు బియ్యం వ్యాపారులకు రూ.20 చొప్పున అమ్ముతున్నారు. వ్యాపారులు పాలిష్ పట్టి కేజీకి రూ.30 ధర నిర్ణయించి కాకినాడకు తరలిస్తున్నారు.

జిల్లాలో పౌరసరఫరాల శాఖ డీటీలు ఆరుగురు ఉన్నారు. వీరెవరూ ఎక్కడా ఒక్క బియ్యం కేసు పట్టుకున్న దాఖలాల్లేవు. స్థానికులు పట్టుకుని అప్పగించే సందర్భాల్లో మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు. ఎలమంచిలి పౌర సరఫరాల శాఖ డీటీకి గ్రామాల నుంచి ఎవరైనా



ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా.. ఆ ప్రాంత వ్యాపారులకు సమాచారం చేరవేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం 2,625 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎమ్మెల్యే ఫోన్ చేసి చెప్పాక రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకున్నారు.

**ప్రత్యేక నిఘా పెట్టాం...** ప్రతి నెలా రేషన్ అందించే సమయాల్లో.. బియ్యం పక్కదారి పట్టకుండా దాడులు చేస్తున్నాం. డీటీలు, తహసీల్దార్లు తనిఖీలు చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాం.కేవీఎన్ మూర్తి, డీఎస్‌వో, అనకాపల్లి


## భవిత మార్చేలా... నైపుణ్యం నేర్పేలా...

విశాఖపట్నం: చదువు పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగం సాధించాలంటే నైపుణ్యం అవసరం. ఉద్యోగంలో చేరిన తర్వాత ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నా నైపుణ్యాలే కీలకం. దీన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యాలు నేర్పిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు స్వయం ఉపాధికి బాటలు వేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం, సమగ్ర శిక్షా (ఎస్ఎస్) భాగస్వామ్యంతో జిల్లాలోని పాఠశాలలకు ప్రయోగ, శిక్షణ సామగ్రి అందజేశారు. కోర్సులు నేర్పించడానికి ప్రత్యేకంగా నిపుణులను నియమించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకున్న విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పిస్తున్నారు.

**ఇంటర్న్‌షిప్, పరిశ్రమల సందర్శన**

జిల్లాలో 31 పీఎంశ్రీ, కేజీబీవీ, ఆదర్శ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. పీఎం శ్రీ పాఠశాలల్లో మూడేసి, మిగిలిన పాఠశాలలో ఒక్కో కోర్సు బోధిస్తున్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ప్రీ ఒకేషనల్ కింద కౌశల్ బుద్ధ్ పేరిట నిర్వహిస్తున్నారు. వారికి పుస్తకాల్లో వృత్తి నైపుణ్యాలను నేర్పిస్తారు. వీరికి ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా వారికి ఏదో ఒక అంశంపై ఆసక్తి మొదలవుతుంది.

9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు శిక్షణతోపాటు ఇంటర్న్‌షిప్,



పరిశ్రమల సందర్శన ఉంటుంది. వీరికి ప్రాక్టికల్ పరీక్షలు కూడా నిర్వహిస్తారు.ప్రతి పాఠశాలలో టైమ్ టేబుల్‌లో వారానికి నాలుగు పీరియడ్స్ కేటాయిస్తున్నారు. సంక్రాంతి, దసరా, ఇతర సెలవుల సమయంలో విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేయిస్తున్నారు.

పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయిన తర్వాత వారికి ప్రాక్టికల్స్ ఉంటాయి.

చదువుకుంటూనే ఉపాధి విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా నైపుణ్యాలు నేర్చుకోవడానికి ఒకేషనల్ విద్య ఉపకరిస్తుంది. ఇంటర్ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఖాళీ సమయాల్లో నేర్చుకున్న నైపుణ్యాలతో ఉపాధి పొందగలరు. అవసరమైతే చదువుకుంటూనే పని చేసుకోవడానికి వీలుంటుంది. కొన్ని కోర్సులో చేరిన విద్యార్థినులు సెలవుల్లో ఆ నైపుణ్యాలతో కొంత మొత్తం సంపాదిస్తున్నారు.

డా.జె.చంద్రశేఖర్‌రావు, ఏపీసీ, సమగ్రశిక్ష

జిల్లాలో కోర్సులు ఆటోమోటివ్

వ్యవసాయం అపెరల్ (దుస్తులు కుట్టడం)

బ్యూటీ అండ్ వెల్‌నెస్

ఎలక్ట్రానిక్స్

ఫుడ్ ప్రాసెసింగ్

హెల్త్‌కేర్‌జి ఐటీ-ఐటీఈఎస్

రిటైల్‌జి బ్యాకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్

# కోవెలకుంట.. ఆక్రమణల పుట్ట

నంద్యాల : జిల్లాలో ఆలయ భూములు హారతి కర్పూరంలా కరిగిపోతు న్నాయి. కోవెలకుంట్ల మండల కేంద్రంలోని పాండురంగస్వామి ఆలయానికి ఒకప్పుడు వందల ఎకరాల పొలం ఉండేది. కోవెలకుంట్ల, చింతకుంట పొరుగు గ్రామాలుగా ఉండేవి. వీటి పరిధిలో ఆలయ భూమి ఉండేది. రెండు గ్రామాలు కలిసిపోయి ప్రస్తుతం కోవెలకుంట్లగా మారింది. ఈ ఆలయం భూమి కనుమరుగైపోయింది. ప్రస్తుతం మండల కేంద్రంగా ఉన్న కోవెలకుంట్లలో గృహాలు, దుకాణాల సదుపాయాలు, ఇతర నిర్మాణాలు 50శాతానికి పైగా ఈ ఆలయానికి చెందిన భూమిలోనే ఉన్నాయి.

**వెలిసిన గోదాములు**

ఆలయ పరిధిలో ఒకప్పుడు 750 ఎకరాల పొలం ఉండేది. మూడు దశాబ్దాల కిందట అప్పటి ప్రజాప్రతినిధి ఒకరు ఆలయానికి సేవలు చేసే వివిధ వర్గాలకు 'కోవెల' భూమిని ఇళ్ల పట్టాల పేరుతో పంపిణీ చేశారు. ఇదే అదనుగా మరికొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. వర్గాలుగా విభజించుకుని పంచేసుకున్నారు. ఐదు వందల ఎకరాల వరకు అన్యాక్రాంతమైంది. గోదాములు, వాణిజ్య సముదాయాలు నిర్మించారు. బాడుగులకు ఇచ్చి సొమ్ము చేసుకొంటున్నారు. వందల



సంఖ్యలో ఇళ్లు వెలిశాయి. వీటిలో కొన్ని నిర్మాణాలకు రిజిస్ట్రేషన్లు లేవు. ఆలయ నిర్వహణకు ఇబ్బందిగా ఉండటంతో దాతల సహాయంతో వాణిజ్య సముదాయాలు నిర్మించారు. వచ్చిన డబ్బులతో ఆలయ నిర్వహణ చేస్తున్నారు.

**62.5 ఎకరాలు ఎక్కడ**

ప్రస్తుతం కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె గ్రామ పరిధి సర్వే నంబరు 93లో 2.44 ఎకరాలు, 916లో 8.81 ఎకరాలు కలిపి మొత్తం 11.25 ఎకరాలు, చింతకుంట గ్రామ పరిధిలో సర్వే నంబరు 173లో 9.89 ఎకరాలు, 174-1లో 5.50 ఎకరాలు, 174-2లో 11.06 ఎకరాలు, 174-3లో 5.6 ఎకరాలు, 138-బీలో 1.08, 154లో 13.22, 198లో రెండు ఎకరాలు, 234-2లో 0.56 ఎకరాలు, 71లో 0.26 ఎకరాలు, 73-ఏలో 2.08 ఎకరాలు కలిపి మొత్తం 51.25 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం మొత్తం 62.5 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి కౌలుకు అధికారికంగా వేలం పాటలు నిర్వహించలేదు. దస్త్రాల్లో భూమి ఉన్నా ఎవరి ఆధీనంలో ఉంది, సాగు చేస్తున్నది ఎవరు? క్షేత్రస్థాయిలో భూమి స్వరూపం ఎలా ఉందని ఆలయ అధికారులకు తెలియని దుస్థితి. రూ.కోట్లలో విలువ చేసే భూములు ఆక్రమణలో ఉన్నా అధికారుల చర్యలు లేవు.

# 'బెంగ'ళూరు దారి

కర్నూలు : జాతీయ దారి.. హైదరాబాద్- బెంగళూరు మార్గంలో 24 గంటలూ రయ్..రయ్ మంటూ వాహనాలు దూసుకెళ్తుంటాయి. ఏ ఒక్క వాహనం 100 కి.మీ. వేగం కంటే తక్కువ కాకుండా పరుగులు పెడుతుంటాయి.. అక్టోబరు 24వ తేదీన చెట్లమల్లాపురం వద్ద ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురై 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా రహదారిపై లోపాలు సరిదిద్దలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 18 బ్లాక్‌స్పాట్లు గుర్తించి వదిలేశారు.

**సర్వీసు రహదారులు నిర్మించక..**

కర్నూలు శివారు.. చిన్నటేకూరు వద్ద సర్వీసు మార్గం లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెల్దుర్తి కూడలి, డోన్ పరిధిలోని పోతుదొడ్డి, దేవరబండ, ఓబులాపురం మెట్ట, కొత్తపల్లి తదితర చోట్ల సర్వీసు రహదారులు లేకపోవడంతో వాహనదారులు రాంగ్‌రూట్లో ప్రయాణిస్తున్నారు. దొరపల్లి వద్ద సర్వీసు మార్గంలో వంతెన లేకపోవడంతో చాలామంది అపసవ్య దిశలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గత మూడేళ్లలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. సర్వీసు రోడ్డుతోపాటు పైవంతెన నిర్మించాలని ప్రతిపాదించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

**కానరాని ఏటీఎంఎస్ వ్యవస్థ** జాతీయ రహదారుల్లో ఏటీఎంఎస్ (అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ను ఏర్పాటు చేస్తున్నారు. వాహనం ఎంత వేగంతో వెళ్తుందో ఇట్టే తెలిసిపోతుంది. ఎలక్ట్రానిక్ బోర్డుల్లో కనిపిస్తోంది. పోలీసులకు సమాచారం అందుతుంది. దీంతో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవడం ద్వారా వేగాన్ని నియంత్రించడంతోపాటు ప్రమాదాలు తగ్గించడానికి వీలుంటుంది. 2010లో విస్తరించిన ఈ మార్గంలో ఏటీఎంఎస్ వ్యవస్థ లేకపోవడం గమనార్హం.



**రూ.70 కోట్లతో ప్రతిపాదనలు**

"కర్నూలు నుంచి అనంతపురం వరకు సుమారు 150 కి.మీ. మేర జాతీయ రహదారిపై కొత్త పొర వేసేందుకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. వచ్చే ఏడాది వంద శాతం పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం. విభాగినులపై పూర్తిస్థాయిలో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం" అని ఎన్‌హెచ్ఏఐ పీడీ (అనంతపురం) తరుణ్ తెలిపారు.

**వీటిని పట్టించుకోరు**

మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహనాలను దూరం నుంచే గుర్తించేందుకు 'స్పీడ్‌లేజర్ గన్లు' అవసరం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేవలం ఒకే ఒక్కటి ఉండటం గమనార్హం.

కర్నూలు నుంచి డోన్ వెళ్లే మార్గంలో టోల్‌గేటు దగ్గర నిఘా కెమెరాలు లేవు. అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న పోలీసుల ప్రతిపాదనను టోల్‌గేటు నిర్వాహకులు పట్టించుకోవడం లేదు.

జాతీయ రహదారి మార్జిన్లలో పలుచోట్ల ఇసుక మేట వేసింది. ఫలితంగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. మట్టి లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు.

విభాగినులపై నాలుగైదు అడుగుల ఎత్తున గుబురు మొక్కలు పెంచితే రాత్రివేళలో ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ డ్రైవర్ల కళ్లలో పడదు. జాతీయ రహదారిపై ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు.

ఉమ్మడి జిల్లాలో పొడవు 83 కి.మీ

వాహనాల రాకపోకలు 15 వేలు

టోలు వసూలే (నిత్యం) రూ. 20 లక్షలు (అమకతాడు టోల్‌ప్లాజా)

బ్లాక్‌స్పాట్లు 18

# నకిలీ విత్తు.. రైతన్న చిత్తు



చిత్తూరు : ఏపీ సీడ్స్ నిర్లక్ష్యం రైతన్నలకు శాపంగా మారింది. నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేసి చేతులు దులుపుకొంది. దీనికి తోడు ప్రణాళికాలోపం స్పష్టంగా కనిపిస్తోంది. రబీలో వేరుసెనగ విత్తుకు గడువు ముగుస్తున్నా రాయితీ విత్తనాలు ఇప్పటికీ పంపిణీకి నోచుకోలేదు.

**కాలయాపన.. తిరస్కరణ**

రబీ సీజన్ విత్తన పంపిణీకి అక్టోబరులోనే విత్తనాన్ని సేకరించి ప్రాసెసింగ్ చేయాల్సి ఉన్నా ఏపీ విత్తన సంస్థ దృష్టిసారించలేదు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో విత్తన సేకరణ నవంబరు చివర్లో ప్రారంభించారు. వర్షాలతో కాయలు తేమ శాతం అధికంగా ఉందని, నాణ్యత లేదంటూ నేటికీ చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సరఫరా చేయలేదు.

చిత్తూరు జిల్లాకు సరఫరా చేసిన కాయలు నాణ్యమైనవి కావని ఏవోలు.. 2,070 క్వింటాళ్లు తిరస్కరించి వెనక్కి పంపేశారు.

**ముందస్తు ప్రణాళిక ఎక్కడ..?**

రబీ సీజన్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తూర్పు ప్రాంత మండలాల్లో విస్తారంగా.. మిగిలిన చోట్ల నామమాత్రంగా వేరుసెనగ సాగు చేస్తారు. చిత్తూరు జిల్లాలో నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లో.. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ తదితర మండలాల్లో సాగవుతుంది.

నవంబరు రెండో వారంలో రైతులు రాయితీ విత్తు అందించాలి. డిసెంబరు 15 లోగా విత్తుకుంటే లాభదాయకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

రాయితీ విత్తు పంపిణీపై అధికారులకు ముందస్తు ప్రణాళికే లేదు. కేటాయింపుల నుంచి ధర నిర్ణయం వరకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పంపిణీ పూర్తి చేయాల్సిన సమయం నవంబరు చివరి వారంలో ఎట్టకేలకు రాయితీపై 30 కిలోల బస్తా ధర రూ.1,656గా ఖరారు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

**త్వరలో అందజేస్తాం..**

రబీ సాగు రైతులకు రాయితీ వేరుసెనగ విత్తు వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం. నాణ్యమైనవి లభించడం లేదు. మేలైన కాయల సరఫరాకు.. ఏపీ విత్తన సంస్థకు లేఖ రాయనున్నాం.

# ఆక్రమించేశారు.. ఇరుకుగా మార్చేశారు



వెంకటగిరి : ఆక్రమణలపై అధికారుల నిఘా కొరవడింది. జాతీయ రహదారుల అంచులనే ఆక్రమిస్తున్నా పట్టించుకోవడం లేదు. నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ ఆక్రమిత స్థలాలు ప్రస్తుతం రూ.కోట్లల్లోనే పలుకుతున్నాయి. వెంకటగిరి నియోజక వర్గంలోని జాతీయ, రాష్ట్ర రహదారులతోపాటు పురపాలక పరిధిలోనూ అడుగడుగునా ఇదే పరిస్థితి.

**ఎన్‌హెచ్ పొడవునా..**

ఏర్పేడు నుంచి పెంచలకోన వెళ్లే 565 జాతీయ రహదారిలో స్థానిక క్రాస్ రోడ్డు వద్ద గతంలో బాలికల గురుకుల విద్యాలయ స్థలంలో పడమటి దిక్కున రోడ్డు మార్జిన్ వ్యాపారుల కోసం దుకాణ సముదాయం నిర్మించుకున్నారు. ఈ దుకాణాలకు కేటాయించిన స్థలమే కాకుండా ఫుట్‌పాత్‌నూ కలిపి వాడుతున్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ నుంచి పాలకేంద్రం, గూడూరు, రాపూరు రోడ్డు మలుపు వరకు ఈ రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించారు.

**పురపాలికలోనూ ఇదే పరిస్థితి**

వెంకటగిరి పురపాలక సంఘం పరిధిలోనూ రోడ్లు ఆక్రమించేశారు. పాలకేంద్రానికి సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని రోడ్డు మార్జిన్లల్లో తాత్కాలిక నిర్మాణాలు చేసి ఏళ్లుగా అనుభవిస్తున్నారు. స్థానిక అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం సమీపాన కట్టడాలు వెలిశాయి. ర.భ. ఏఈ బాబును వివరణ కోరగా.. మార్జిన్లు అక్కడక్కడా ఆక్రమణలకు గురవడం నిజమే. విస్తరణ పనుల్లో తొలగించే చర్యలు తీసుకుంటామన్నారు.

**ఎక్కడెక్కడంటే..**

పాలకేంద్రం కూడలిలో జాతీయ రోడ్డు మార్జిన్లను ఇరువైపులా ఆక్రమించి కట్టడాలు నిర్మించారు.

విద్యుత్తు కార్యాలయం ప్రహరీ ఆనుకుని ప్రభుత్వ స్థలంలో కట్టడాలు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారు.

దక్కిలి నడిబొడ్డున జాతీయ రహదారి ఫుట్‌పాత్‌లను వదిలిపెట్టలేదు. కమ్మకూడలిలోని దక్కిలి బస్టాండ్ స్థలం మార్జిన్లో గదులు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారు.

వెంకటగిరి నుంచి గూడూరు వైపు వెళ్లే రాష్ట్ర రహదారిలోనూ అదే తంతు. బాలాయపల్లి మండల సముదాయంలో రోడ్డు మార్జిన్లు ఆక్రమణలకు గురయ్యాయి. ఆ మార్గంలో గూడూరు మండలం గొల్లపల్లి, చెన్నూరు తదితర కూడళ్లలోనూ అదే తీరు.

నియోజకవర్గంలో ఏర్పేడు-పెంచలకోన జాతీయ రహదారి 3 కి.మీ ఆక్రమణలు 2 కి.మీ మేర

# ఇక.. ఆరు గంటల్లోనే!



విశాఖపట్నం : ఛత్తీస్ గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ ఆరు వరుసలతో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి పూర్తి చేసే కసరత్తు వేగంగా సాగుతోంది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రూ.16,482 కోట్లతో ఆయా పనులు చేపడుతుండగా వచ్చే ఏడాది డిసెంబరుకు ప్రారంభించనున్నారు.

విజయనగరం జిల్లా ఎల్.కోట సమీపంలో చెరువు చుట్టూ వృత్తాకారంలో రోడ్డు నిర్మించారు.

ఒడిశాలోని ఉమ్మరికోట వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్‌ఛేంజ్ పలు రహదారులను అనుసంధానం చేస్తుంది. ఇప్పటికే అనేక చోట్ల సూచికలు, వివరాల బోర్డుల ఏర్పాటు పూర్తయింది.

**3.4 కి.మీ. మేర ట్విన్ టన్నెల్**

రాయపూర్-విశాఖ ఆర్థిక కారిడార్ మూడు రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల మీదుగా వెళ్తుంది. కొండల నడుమ, అడవుల మధ్యలో ఎన్నో వంపులు తిరిగి వెళ్తుంది. ఈ కారిడార్ ఏపీ నుంచి ఒడిశాలోకి ప్రవేశించగానే కొండల మధ్యలో నుంచి పక్కపక్కనే రెండు టన్నెళ్లు (ట్విన్ టన్నెల్స్) నిర్మించాల్సి వచ్చింది. ఒక్కోటి 3.4 కి.మీ. పొడవు ఉండే వీటి నిర్మాణం ఇంజినీరింగ్ అద్భుతంగా పేర్కొనొచ్చు. కోరాపుట్ జిల్లా పరిధి సుంకి ఘాట్‌కు సమీపంలో వీటిని నిర్మించారు.

**తగ్గిన దూరం..133 కి.మీ.**

ప్రస్తుత రాయపూర్ నుంచి విశాఖకు ఎన్‌హెచ్-26లో 597 కి.మీ. ప్రయాణించాలి.

కొత్త కారిడార్‌ను 464 కి.మీ.లతో పూర్తి చేస్తున్నారు. అంటే 133 కి.మీ. దూరం తగ్గింది.

ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని పరిశ్రమలను విశాఖ పోర్టు, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి అనుసంధానం చేసినట్లవుతుంది.

ఇదీ ప్రయోజనం

ప్రస్తుతం కొండల మధ్య విశాఖ నుంచి రాయపూర్‌కు చేరుకోవాలంటే 12 గంటల సమయం పడుతోంది. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే కేవలం ఆరు గంటల్లోనే చేరుకోవచ్చు.

సరకు రవాణా మరింత వేగవంతమవుతుంది.

# ఇంటి పన్నుతో 'కనెక్షన్'

ఎమ్మిగనూరు : ఆదోని పట్టణ శివారులోని అమరావతి నగర్‌లో ప్రభుత్వం ఇచ్చిన సెంటున్నర స్థలంలో షాహిన్‌బీ ఇల్లు నిర్మించుకుంటున్నారు. కుళాయి కనెక్షన్ కోసం పురపాలిక అధికారులను సంప్రదిస్తే ఇంటి పన్ను రూ.వెయ్యి దాటింది.. జనరల్ కనెక్షన్ మంజూరవుతుందన్నారు. రూ.8 వేల భారం భరించలేక ఆమె పక్కింటి నుంచి నీటిని తెచ్చుకొంటున్నారు.

గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన ఆస్తి పన్ను విధానంతో పేదలు కుళాయి కనెక్షన్ పొందలేకపోతున్నారు. సమస్యను గుర్తించి 'కూటమి' ప్రభుత్వం సరి చేయాలని పుర పేదలు విన్నవిస్తున్నారు.

రూ.వెయ్యి పన్ను దాటితే అంతే

గత వైకాపా ప్రభుత్వం ఇష్టానుసారంగా ఆస్తి పన్ను సవరణలు చేసింది.



చిన్నపాటి ఇంటికి సైతం పన్ను రూ.వెయ్యి దాటుతోంది. దీంతో ఏదాదికి రూ.1,000 ఇంటి పన్ను దాటితే బీపీఎల్ కనెక్షన్లు పొందలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో తెల్లరేషన్ కార్డు ఉంటే చాలు.. బీపీఎల్ కనెక్షన్లు పొందేందుకు వీలుండేది.

అదే బీపీఎల్ కనెక్షన్ అయితే ఎలాంటి డొనేషన్ లేకుండా కేవలం ఆరు నెలల నీటి పన్ను రుసుం వసూలు చేస్తారు. గుంత తవ్వేందుకు రూ.4-5 వేలు, కుళాయి సామగ్రికి రూ.5-8 వేల వరకు ఖర్చవుతుంది. మొత్తం లెక్కిస్తే జనరల్ కుళాయి కనెక్షన్‌కు సరాసరి రూ.20-25 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇది పేద కుటుంబానికి ఆర్థిక భారంగా పరిణమిస్తోంది.

ప్రస్తుతం జనరల్ కుళాయి కనెక్షన్ కింద డొనేషన్ రూ.8 వేల నుంచి రూ.10 వేలు.. ఆరు మాసాల నీటి పన్ను ముందస్తుగా చెల్లింపునకు రూ.720. ఛార్జీల కింద మీటరుకు రూ.1,500 విధిస్తారు.

# భక్తజన అజెండా

శ్రీశైలం : మల్లన్న స్పర్శ దర్శనం.. అతిశీఘ్ర దర్శనం టికెట్లు పొందిన భక్తులకు ఉచితంగా లడ్డూలు ఇవ్వడం.. దర్శన ముగింపు సమయాన్ని రాత్రి 10 నుంచి 11 గంటలకు పెంపు.. భక్తులు సమర్పించిన చీరలు, పంచెలు చెంచుగూడేల్లో గిరిజనులకు ఉచితంగా పంపిణీ.. భక్తుల నుంచి సూచనలు, ఫిర్యాదులు స్వీకరించడానికి డయల్ యువర్ ఈవో, ఛైర్మన్ కార్యక్రమం పునరుద్ధరణ వంటి భక్తజన అజెండాకు శ్రీశైల దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ఆమోద ముద్ర వేసింది.

**మాస్టర్ ప్లాన్ అమలుపై దృష్టి**

ఇల కైలాసమైన శ్రీశైల మల్లికార్జునుడి క్షేత్రం చెంత గత వైకాపా సర్కారు రాజకీయం చేసింది. అన్యదీయులకు ఆలయ బాధ్యతలు అప్పగించి ఆక్రమాలు పెంచిపోషించారు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత భక్తజన అజెండాపై దృష్టి సారించింది. ఈవో ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ రమేష్‌నాయుడు, సభ్యుల సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. మాస్టర్ ప్లాన్ త్వరగా అమలు చేయడానికి ఏకాభిప్రాయ స్వీకరణ.. దేవస్థానం పరిధిలోని అన్ని వీవీపీ కాటేజీలు, వసతి గదుల్లో మరమ్మతులు చేయాలని నిర్ణయించారు.

**రాత్రి 10 గంటల వరకు అనుమతి**

యాత్రికులకు అటవీశాఖ చెక్‌పోస్టుల సమయ వేళలతో ఇబ్బందులు న్నాయి. రోజులో 15 గంటల సమయంలో మాత్రమే శ్రీశైలానికి వచ్చి వెళ్లాల్సి ఉంటుంది. కనీసం 10 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి ఉండదు. ధర్మకర్తల మండలి ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వాహనాలను అనుమతించాలని ప్రతిపాదించారు.

**ఏడాదిలో ఏ రోజైనా రావొచ్చు**

రెండేళ్ల కిందట దేవస్థానంలో నూతనంగా రూ.1,01,116లతో ఉ



దయాస్తమానసేవ ప్రారంభించారు. ఈ టికెట్ తీసుకొన్న భక్తులు తెల్లవారుజామున సుప్రభాతసేవ మొదలుకొని రాత్రి ఏకాంతసేవ వరకు 14 రకాల సేవల్లో భక్తులు పాల్గొనవచ్చు. టికెట్ పొందిన రోజుకే పరిమితం చేయడంతో ఆదరణ కొరవడింది. పదేళ్ల కాలపరిమితికి ఏడాదిలో భక్తులు కోరుకున్న రోజు సేవ చేసుకొనేలా ప్రతిపాదనలు రూపొందించారు.

# తీరం.. ఏం చేసింది నేరం

శ్రీశైలం : ఏర్పాట్లు ఇవీ.. పెదమైనవానిలంక, చినమైనవానిలంక మధ్య గడేదాటి రెండు హేచరీలు ఏర్పాటు చేసే ఈసారి మూడు చేశారు. రాత్రి 8 నుంచి 10 గంటలు, తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు తీరంలో తాబేళ్ల జాడను గుర్తించేందుకు ఆరుగురు సిబ్బంది (టీవ్ వాచర్స్)ని మూడు బేస్ క్యాంపుల్లో నియమించారు. ఎంతో మేలు.. సముద్రంలో ఆక్సిజన్ పెంచడంతో పాటు మత్స్య సంపదను వృద్ధి చేయడంలో తాబేళ్లు కీలకపాత్ర పోషిస్తాయి. చేపగుడ్లు తినే జెల్లీ ఫిష్ జాతిని నియంత్రిస్తాయి. తాబేళ్ల కోసం ముందస్తుగా ఏర్పాట్లు చేసినట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి కరుణాకర్ తెలిపారు. ఆలివ్ రిడ్లే తాబేళ్లు.. ఏటా వేల మైళ్ల దూరం ప్రయాణం చేసి తీరంలోని ఇసుక తిన్నెల్లో గుడ్లు పెట్టేందుకు నవంబరులో వస్తేవి. ఈ ఏడాది డిసెంబరు రెండో వారం వచ్చినా తీరంలో కనిపించడం లేదు. ఏటా నవంబరు నుంచి మార్చి వరకు గుడ్లు పెట్టే సమయం కావడంతో అర్ధరాత్రి 2 నుంచి ఉదయం 6 గంటల మధ్య ఒడ్డుకు వస్తుంటాయి. తీరానికి సుమారు 50 మీటర్ల దూరంలో ఉన్న ఇసుక దిబ్బల్లో బొరియలు చేసి గుడ్లు పెడుతుంటాయి. అటువంటి సమయంలోనే బోట్లు, వలలకు తాకి, ఇతర కారణాలతో మృత్యువాత పడుతున్నాయి.

## చీరలో దివి అందాలు.. దాసోహం అంటున్న కుర్రకారు!

సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత సెలబ్రెటీలు తమ ఉనికిని చాటుకోవడానికి గ్లామర్ తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. అలాగే చీరకట్టులో కూడా సాంప్రదాయంగా కనిపించి మెప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే మరొకసారి చీరకట్టులో గ్లామర్ ఒలకబోస్తూ.. అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ప్రముఖ నటి దివి. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో తన అందంతో అభిమానులను అలరించే ఈమె.. తాజాగా తన అందాలతో చీరకట్టులో కనిపించి కుర్రకారును ఫిదా చేసింది. తాజాగా పర్పుల్ కలర్ చీరకట్టిన ఈమె అందుకు తగ్గట్టుగా స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. లోటస్ పట్టుకొని స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులు ఇచ్చిన ఈమె వెనుతిరిగి అందాలతో అభిమానులను కట్టిపడేసింది. చాలా రోజుల తర్వాత చీర కట్టులో కనిపించడంతో అభిమానులు దానికి ముగ్ధులు అవుతున్నారు. 1996 మార్చి 15న హైదరాబాదులో శశికాంత్ వైద్య, దేవకీ దంపతులకు జన్మించింది దివి. పదవ తరగతి వరకు జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్లో తన స్కూల్ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన ఈమె.. ఆ తర్వాత జీ.నారాయణమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎంబీఏ



పూర్తి చేసింది. ఆ తర్వాత ఎమ్ టెక్ కూడా పూర్తి చేసింది దివి. చదువుకునే సమయంలోనే సినిమాల పైన ఆసక్తి పెంచుకున్న ఈమె తొలిసారి మోడల్ గా మారి 2017లో మోడలింగ్ తో తన కెరీర్ను మొదలుపెట్టింది. 2018లో పలు ఫ్యాషన్ సంస్థలకు మోడలింగ్ చేసిన ఈమె తొలిసారి లెట్స్ గో అనే షార్ట్ ఫిలింలో నటించింది. 2019లో వచ్చిన మహర్షి సినిమాతో సినీ రంగంలోకి అడుగు పెట్టింది. ఇందులో మహేష్ బాబు, అల్లరి నరేష్, పూజా హెగ్డే తదితరులు కీలకపాత్రలు పోషించారు. 2019లో ఏ 1 ఎక్స్ ప్రెస్, 2022లో క్యాబ్ స్టోరీస్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఈమె 2021 జూలై 3న సిలక ముక్కుదాన అనే మ్యూజిక్ వీడియోలో కూడా కనిపించి సందడి చేసింది. సినిమాల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె 2020 సెప్టెంబర్ 6న బిగ్ బాస్ తెలుగు సీజన్ 4లో కంటెస్టెంట్ గా పాల్గొని, 49 రోజులపాటు హౌస్ లో కొనసాగి ఎలిమినేట్ అయింది. గాడ్ ఫాదర్, రుద్రంగి, లంబసింగి, సింబా, పుష్ప2, డాకు మహారాజ్ వంటి చిత్రాలలో నటించి భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ఇక టెలివిజన్ సిరీస్ హరికథలో కూడా నటించిం ది. ఇది డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇలా ఒకవైపు నటిగా కొనసాగుతూనే మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ.

## డైరెక్టర్ కోసం హీరో వెయిటింగ్ !

అన్నీ అనుకున్నట్లు జరిగితే ఎల్ సీ యూ నుంచి ఖైదీ 2 ఇప్పటికే మొదలవ్వాలి. కానీ కార్తీ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉ ండగా, లోకేష్ కనగరాజ్ తన పనుల్లో తాను బిజీగా ఉన్నాడు. మరి ఈ డిలేకి కారణం ఏంటి? అంటే? కొన్నాళ్ల పాటు డైరెక్షన్ పక్కన బెట్టి హీరోగా లక్ చెక్ చేసుకోవడమే. కూలీ రిలీజ్ అనంతరం లోకేష్ కనగరాజ్ హీరోగా మ్యాకప్ వేసుకున్న సంగతి తెలిసిందే. అరుణ్ మాథేశ్వర్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. లోకేష్ మార్క్ క్రైమ్ థ్రిల్లర్ కావడం..హీరో ఛాన్స్ అనే సరికి లోకేష్ కూడా వెయిటింగ్ ఎందుకునుకున్నాడో? ఏమో గానీ మారు మాట్లాడకుండా పట్టాలెక్కిం చాడు ప్రాజెక్ట్. డీసీ అనే టైటిల్ తో తెరకెక్కుతోన్న చిత్రమిది. మరి ఈ సినిమా రిలీజ్ ఎప్పుడు అంటే వచ్చే ఏడాది సమ్మర్ వరకూ రిలీజ్ కాదు. మరి ఖైదీ2 మొదలయ్యేది ఎప్పుడు? అంటే రిలీజ్ తర్వాతేనని తెలుస్తోంది. దీంతో లోకేష్ కోసం కార్తీ వెయిట్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం కార్తీ హీరోగా మార్షల్ అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా తప్ప మరే సినిమా షూటింగ్ దశలో లేదు.



కార్తీ నటించిన వా వాతయార్ ఇప్పటికే రిలీజ్ కు రెడీ గా ఉంది. డిసెంబర్ లో ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. కార్తీ నటిస్తోన్న మరో చిత్రం సర్దార్ 2 కూడా షూటింగ్ పూర్తి చేసుకుంది.

**కార్తీకి ఇదో కొత్త ఎక్స్ పీరియన్స్:** ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సినిమా వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి కార్తీ కేవలం ప్రచార కార్యక్రమాల్లో మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. ఆ రెండు రిలీజ్ అయితే వాటి నుంచి పూర్తిగా రిలీవ్ అవుతాడు. మార్షల్ కూడా మరో రెండు..మూడు నెలల్లో షూటింగ్ పూర్తవుతుందని సమాచారం. ఆ తర్వాత ఖైదీ 2 మొదలయ్యే వరకూ కార్తీకి వెయిటింగ్ తప్పదు. ఆ వెయిటింగ్ లోకేష్ వల్లే. ఇలా డైరెక్టర్ కోసం హీరో వెయిట్ చేయడం అన్నది కార్తీ అనుభవంలో ఇదే తొలిసారి కావొచ్చు.

**కొత్త కథలు వినే ఛాన్సుంది:** సాధారణంగా హీరోల కోసం డైరెక్టర్లు వెయిట్ చేస్తుంటారు. కానీ లోకేష్-కార్తీ మధ్య సన్నివేశం అందుకు భిన్నంగా కనిపిస్తుంది. మరి ఈ గ్యాప్ లో కార్తీ ఏం చేస్తాడు? అంటే కొత్త కథలు వినడానికి అవకాశం ఉంది. మార్షల్ కూడా నత్తనడకన షూటింగ్ జరుతుంది. దీంతో కార్తీ కి సమయం ఎక్కువగానే దొరుకుతుంది. షూటింగ్ ఉంటే చేయడం లేదంటే కథలు వినడంపైనే దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.




## న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లో సమంత - రాజ్.. ఎక్కడికి వెళ్లారో తెలుసా?



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ గా ఒక వెలుగు వెలిగి మంచి పాపులారిటీ సొంతం చేసుకుంది సమంత. మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్, ఎన్టీఆర్ లాంటి అగ్ర హీరోలతో సినిమాలు చేసి స్టార్ హీరోయిన్గా పేరు దక్కించుకున్న సమంత.. కెరియర్ పీక్స్ లో ఉండగానే అక్కినేని వారసుడు నాగచైతన్యతో ప్రేమలో పడి పెళ్లి చేసుకుంది. కానీ పెళ్లయిన నాలుగేళ్లకే విడాకులు తీసుకొని విడిపోయారు. ఆ తర్వాత ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న సమంత మధ్యలో యశోద , శాకుంతలం వంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది..కానీ ఈ సినిమాలు పెద్దగా ఆకట్టుకోలేదు. ఆ తర్వాత విజయ్ దేవరకొండ తో ఖుషీ సినిమా చేసింది. అయితే ఈ సినిమా పరవాలేదు అనిపించుకుంది. ఇక తెలుగులో సినిమాలు చేయకుండా బాలీవుడ్ కి మకాం మార్చిన ఈమె సిటాడెల్ హనీ బన్నీ అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ వెబ్ సిరీస్ మంచి విజయాన్ని అందించడమే కాకుండా పలు అవార్డులు కూడా అందించింది. ఇకపోతే ది ఫ్యామిలీ మెన్ 2 వెబ్ సిరీస్ షూటింగ్ సమయంలోనే ఈ వెబ్ సిరీస్ దర్శకుడు రాజ్ నిడిమోరుతో ప్రేమలో పడిందనే వార్తలు రాగా గత కొన్ని నెలలుగా వీరిద్దరూ చట్టాపట్టాలేసుకొని తిరిగారు. పైగా వెకేషన్ లకు వెళ్లడం, జిమ్ సెంటర్లకు ఇలా ఎక్కడపడితే అక్కడ కలిసి కనిపించడంతో ఇద్దరు పెళ్లి చేసుకుంటారు. అంటూ వార్తలు వచ్చాయి. కానీ ఎవరూ కూడా దీనిపై స్పందించలేదు. ఎట్టకేలకు ఈ ఏడాది డిసెంబర్ 1న కోయంబత్తూర్ లోని ఈ యోగా సెంటర్ సమీపంలో ఉన్న లింగ భైరవి ఆలయంలో భూతశుద్ధ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. ఇక వివాహం తర్వాత పెద్దగా మీడియా ముందుకు రాని ఈ జంట సడన్గా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లో భాగంగా వెకేషన్ వెళ్ళింది. అందులో భాగంగానే పోర్చుగల్ లోని లిస్బన్ కి నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడానికి కొత్తజంట వెళ్ళింది. ముఖ్యంగా వివాహం తర్వాత వచ్చిన మొదటి న్యూ ఇయర్ కావడంతో అక్కడికి వెకేషన్ కి వెళ్ళింది ఈ జంట. ముఖ్యంగా అక్కడి నుంచి సమంత షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్న సమంత.. ఈ కొత్త ప్రయాణంలో ఉల్లాసమైన క్షణాలను, తాను సందర్శించిన మార్గాలను అభిమానులతో పంచుకుంది. ఇకపోతే చాలా కాలం తర్వాత ఇలా సంతోషంగా కనిపించి అభిమానులను మరింత సంతోషపరిచింది. ఇక సమంత సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఈమె తన నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై మా ఇంటి బంగారం అనే సినిమా నిర్మిస్తోంది. అలాగే ఇందులో లీడ్ రోల్ కూడా పోషిస్తుంది. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇదివరకే వీరిద్దరి కాంబినేషన్లో ఓ బేబీ సినిమా వచ్చి మంచి సక్సెస్ అందుకుంది. ఇప్పుడు మళ్లీ ఈ సినిమా రాబోతుండడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి.

## మాస్ రాజా.. మళ్లీ హిట్ రూట్లోనే డబుల్ ప్లాన్



మాస్ మహారాజా రవితేజ ఎనర్జీకి తిరుగులేదు కానీ, బాక్సాఫీస్ లెక్కలు మాత్రం ఈ మధ్య అనుకూలంగా ఉండటం లేదు. వరుస పెట్టి సినిమాలు చేస్తున్నా, విజయాలు మాత్రం అందని ద్రాక్షలా మారాయి. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో వచ్చిన 'మిస్టర్ బచ్చన్', 'మాస్ జాతర' ఫలితాలు రవితేజ మార్కెట్ ను గట్టిగానే దెబ్బతీశాయి. కనీసం ఓపెనింగ్స్ కూడా రాబట్టలేకపోవడం ఫ్యాన్స్ ను కలవరపెడుతోంది. దీంతో ఇప్పుడు రవితేజ ప్రయోగాలు పక్కన పెట్టి, ఒక పక్కా సేఫ్ ప్రాజెక్ట్ కోసం చూస్తున్నట్లు అర్థమవుతోంది. గత కొంతకాలంగా రవితేజ కెరీర్ గ్రాఫ్ గమనిస్తే, సోలో హీరోగా ఆయనకు వచ్చిన సాలిడ్ బ్లాక్ బస్టర్ కేవలం 'ధమాకా' మాత్రమే. మధ్యలో 'వాల్తేరు వీరయ్య' లాంటి మెగా హిట్ ఉన్నా, అది మల్టీస్టారర్ కాబట్టి క్రెడిట్ చిరంజీవికి కూడా వెళ్తుంది. ఇక రావణాసుర'టైగర్ నాగేశ్వరరావు, ఈగల్ వంటివన్నీ బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచినవే. అందుకే ఇప్పుడు మళ్ళీ తనకు కలిసొచ్చిన మ్యాజిక్ ను రిపీట్ చేయడానికి రవితేజ సిద్ధమవుతున్నాడు. లేటెస్ట్ గా ఇండస్ట్రీలో వినిపిస్తున్న వార్త ఫ్యాన్స్ లో కొత్త జోష్ నింపుతోంది. రవితేజకు 'ధమాకా' వంటి హిట్ ఇచ్చిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ, ఇటీవల ఫిల్మ్ ఛాంబర్ లో "డబుల్ ధమాకా" అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ను రిజిస్టర్ చేయించిందట. ఈ టైటిల్ చూడగానే ఇది పక్కా రవితేజ కోసమే అని, మళ్ళీ ఆ హిట్ సెంటిమెంట్ ను వాడుకోబోతున్నారని ఇండస్ట్రీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ ప్రాజెక్ట్ కోసం పాత సక్సెస్ ఫుల్ కాంబినేషన్ ను రంగంలోకి దింపుతున్నట్లు టాక్. దర్శకుడు త్రినాథ రావు నక్కిన దర్శకత్వంలో, రవితేజ శ్రీలీల జోడీ మరోసారి సందడి చేసే అవకాశం ఉందని టాక్. గతంలో వీరిద్దరి కెమిస్ట్రీ, శ్రీలీల ఎనర్జిటిక్ డ్యాన్సులు సినిమా విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయి. ఇప్పుడు 'డబుల్' అంటూ వస్తున్నారంటే, ఎంటర్టైన్మెంట్ డోస్ కూడా డబుల్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. రవితేజ ఇటీవల మాస్ ఎంటర్టైనర్స్ తీసినా కూడా ఫ్లాప్స్ అవుతున్నట్లు మాస్ జాతర నిరూపించింది. అలాగని ఫ్యాన్స్ అవి కోరినట్లు కాదు. రెగ్యులర్ కంటెంట్ తో కాకుండా కాస్త కొత్తగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇక ఇప్పుడు మళ్లీ సీరియస్ రోల్స్ కంటే, రవితేజ మార్క్ కామెడీ, మాస్ మేనరిజమ్స్ ఉంటేనే సినిమా సేఫ్ జోన్ లో ఉంటుందని మేకర్స్ గ్రహించినట్లున్నారు. వరుస డిజాస్టర్ల తర్వాత రవితేజ తీసుకున్న ఈ నిర్ణయం ఆయన కెరీర్ కు చాలా కీలకం కానుంది. హిట్ ఇచ్చిన బ్యానర్, కలిసొచ్చిన డైరెక్టర్, లక్కీ హీరోయిన్.. ఈ కాంబో కనుక సెట్ అయితే రవితేజ బౌన్స్ బ్యాక్ అవ్వడం ఖాయం. మరి కాంబినేషన్ పై అఫీషియల్ క్లారిటీ ఎప్పుడు వస్తుందో చూడాలి.

## హాట్ సింగర్ పై ఇలాంటి పనులు తగునా?

బాలీవుడ్ హాట్ సింగర్ సునీది చౌహాన్ గురించి పరిచయం అవసరం లేదు. తనకంటూ ఓ బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమ్మడు మైక్ చేత పట్టి గొంతు సవరించిందంటే? కుర్రాళ్లలో పూనకాలు లోడ్ అవ్వాల్సిందే. బోల్డ్ ఓకల్ రేంజ్ తో యువత గుండెల్లో గునపాలు దించడం సునీది చౌహాన్ ప్రత్యేకత. తనదైన పవర్హౌస్ ప్రదర్శన తో సెగలు పుట్టిస్తుంది. ఎలాంటి వేదికైనా రక్తి కట్టించడంలో తానో స్పెషలిస్ట్. ఎక్కడ షో చేసినా? అది నెట్టింట వైరల్ అవ్వాల్సిందే. సోషల్ మీడియాలో ఇప్పటికే ట్రెండింగ్ లో నిలిచిన బ్యూటీ. వైరల్ పెర్ఫార్మర్ గానూ పేరుంది. అయితే సునీది చౌహాన్ పై విమర్శలు ఎప్పటికప్పుడు అదే స్థాయిలో వ్యక్తమవుతుంటాయి. సోషల్ మీడియలో



ట్రోల్ అయిన సందర్భాలెన్నో. ఆమె యాంటీ ఫ్యాన్స్, ఇనెసెల్స్ నుంచి నిత్యం ఈ తరహా విమర్శలు పరిపాటే. తాజాగాఆమెను టార్గెట్ గా చేసుకుని సునీది ప్రదర్శనలు మరీ బోల్డ్గా ఉన్నాయంటూ ట్రోలింగ్ జరుగుతోంది. ఓలైవ్ ఈవెంట్ లో అలరించిన అమ్మడు మరోసారి ట్రోలర్లకు దొరికిపోయింది. చిట్టి పొట్టి దుస్తుల్లో సునీది బోల్డ్ పెర్ఫార్మెన్స్ పై రకరకాల కామెంట్లు పడుతున్నాయి. ఆమె వయసును గుర్తు చేస్తూ ఎగతాళి చేస్తున్నారు. మరికొం దరు ఆమెను నేహా కక్కర్తో పోలుస్తున్నారు. ఇంకొందరైతే వెస్ట్రన్ సింగర్స్ నిక్కీ మినాజ్ లేదా కార్డి బిలను అను కరించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు. అయితే ఈ విమర్శలపై సునీధి అభిమానులు అంతే ధీటుగా బధులిస్తున్నారు. సునీది చౌహాన్ వోకల్ రేంజ్ కి ఎవరూ సాటిలేరంటున్నారు. నిక్కీ మినాజ్ లేదా కార్డి బి వంటి వారు కూడా సునీద్ సామర్థ్యం ముందు ఎంత? అంటున్నారు. ఇలాంటి వాటిని సునీది పట్టించుకోకుండా కళాత్మకతకే ప్రాధాన్యత ఇవ్వాలని మద్దతుదారులంతా కోరుతున్నారు. ఈ చర్చలోకి నేహా కక్కర్ను లాగడాన్ని కూడా చాలా మంది తప్పుబడుతున్నారు.

ఒక సింగర్ ని సమర్థించే క్రమంలో మరో మహిళను కించ పరచడం సరికాదని అభిప్రా యపడుతున్నారు. ఇలాంటి వాటిపై ఎలాంటి చర్చకు దారి తీసినా? అది ఎంతో హుందాగా ఉండాలంటూ సునీది చౌహాన్ ఫాలోవర్లు కోరుతున్నారు. మరి ఈ విమర్శలు..ట్రోలింగ్ ఇప్పటికైనా ఆగుతుందేమో చూద్దాం.

## 2026 లో లేడీ సూపర్ స్టార్ లైనప్ ఇలా!

లేడీ సూపర్ స్టార్ నయనతార 2025 లో టెస్ట్ అనే ఒకే ఒక్క చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించింది. గత ఏడాది కూడా బియోండ్ ది ఫెయిరీ టేల్ అనే చిత్రంతోనే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇలా రెండేళ్ల కాలంలో కేవలం రెండు సినిమాలతోనే థియేటర్లోకి వచ్చింది. దీంతో వెండి తెరపై నయన్ కనిపించి చాలా గ్యాప్ వచ్చినట్లు అభిమా నులు భావిస్తున్నారు. కానీ కొత్త ఏడాదిలో మాత్రం 2024-25 లెక్కల న్నింటిని సరిచేయబోతుంది.

అమ్మడు 2026లో వరుస సినిమాలతో అలరించడం ఖాయం. మనాన్ ఘాటీ సిన్స్ 1960 షూటింగ్ ఇప్పటికే పూర్తి చేసింది.

**ఆన్ సెట్స్ లో బిజీ బిజీగా:** ప్రస్తుతం ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వచ్చే ఏడాది ఆరంభంలోనే ఆసినిమా రిలీజ్ కానుంది. అలాగే తమిళ్, మలయాళంలో తెరకెక్కిన డియర్ స్టూడెంట్స్ అనే చిత్రం కూడా విడుదలవుతుంది. ఆసినిమా కూడా చిత్రీకరణ ముగించు కుని నిర్మాణానంతర పనుల్లో ఉంది. జనవరిలో సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతున్న మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతోనూ అలరిం చనుంది. ఇందులో అమ్మడు మెగాస్టార్ చిరంజీవికి జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే టాక్సిక్ అనే పాన్ ఇండియా చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. యశ్ హీరోగా నటిస్తోన్న చిత్రమిది.

**నయన్ నామ సంవత్సరం...** సమ్మర్ కానుకగా చిత్రం రిలీజ్ కానుంది. పేట్రియేట్ అనే మలయాళం చిత్రంలోనూ నటిస్తోంది. అలాగే తమిళ్



లో మూకుత్తి అమ్మన్ 2 , హాయ్,రఖియే అనే మరో మూడు చిత్రాల్లోనూ నటిస్తోంది. ఈ మూడు షూటింగ్ దశలో ఉన్నాయి. వీటిలో రెండు చిత్రాలు 2026 మిడ్ లో, మరో సినిమా ఏడాది ముగింపులో రిలీజ్ కానున్నాయి. తాజాగా నటసింహ బాలకృష్ణ 111వ చిత్రంలోనూ హీరోయిన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. బాలయ్య తో కలిసి నాల్గవ సారి నటిస్తోంది. మొత్తంగా 2026 లో అమ్మడు తొమ్మిది రిలీజ్ లతో ప్రేక్షకుల్ని అలరించడం ఖాయం. చాలా కాలం త ర్వాత నయన్ ఒకే సారి ఇన్ని సినిమాలతో రావడం ఇదే.

**2026 లో ఫుల్ జోష్ తో:** సక్సస్ తో నిలదొక్కుకున్న సమయంలో ఒకే ఏడాది ఆరేడు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలో ఉండేది. కాల క్రమంలో అమ్మడు సినిమాల సంఖ్య తగ్గించింది. దీంతో రిలీజ్ లు తగ్గాయి. లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్లో నటించాలి అన్న ఆసక్తి కారణంగా చాలా సమయాన్ని వృద్ధా చేసింది. కొన్ని కథలు నచ్చినా సరైన దర్శకులు సెట్ కాకపో వడం..మరికొన్ని నచ్చక పోవడంతో పట్టాలెక్కడంలో జాప్యం చోటు చేసుకుంది. కొత్త ఏడాదిలో మాత్రం వరుస రిలజ్ లతో అభిమానుల్లో మళ్లీ జోష్ నింపనుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536